
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



నిర్మాణంలో వినియోగిస్తున్న ఇటుకలు

కాంక్రీట్ కాదు.. ఆగ్రోక్రీట్



వ్యవసాయ వ్యర్థాలతో పర్యావరణ ఇటుకలు
పేటెంట్ సాధించిన వాల్తేరు యువకులు
గ్రీన్‌జామ్ పేరుతో ఆగ్రోక్రీట్ ఇటుకల తయారీ
ఏయూ ఇంక్యుబేషన్ హబ్ వేదికగా విజయ ప్రస్థానం

వరి.. చెరకు.. గోధుమ.. పత్తి.. సోయా. పంట ఏదైనా.. వాటి వ్యర్థాల నుంచి ఇటుకల్ని పండించవచ్చంటున్నారు వాల్తేరు యువకులు. పంటల వ్యర్థాలతో కాంక్రీట్ కంటే గట్టిగా ఉండేలా ఆగ్రోక్రీట్ ఇటుకల్ని ఉత్పత్తి చేస్తున్నారు. గ్రీన్‌జామ్ పేరిట కంపెనీ స్థాపించి అనకాపల్లి జిల్లా పరవాడ, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఒక్కొక్క ప్లాంట్ చొప్పున ఏర్పాటు చేసి భారీ ఎత్తున ఇటుకల్ని తయారు చేస్తున్నారు.

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): పంట వ్యర్థాలను ఉపయోగించి ఇటుకల తయారీ చేస్తున్నారు విశాఖ యువకులు. కాంక్రీట్, ఇసుక అవసరం లేకుండా పర్యావరణ హితమైన ఇటుకల్ని తయారు చేయడంలో విజయం సాధించారు. ప్రపంచంలోనే తొలి కార్బన్ నెగెటివ్ కన్‌స్ట్రక్షన్‌కు నాంది పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ హబ్ వేదికగా జామి తరుణ్, జామి వరుణ్ నిర్వహిస్తున్న గ్రీన్ జామ్స్ సంస్థ ఈ ఘనతను సాధించింది. దేశవ్యాప్తంగా తాము తయారు చేసిన ఇటుకలను విక్రయిస్తూ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సాధించింది. ఏటా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వంద మిలియన్ టన్నులకు పైగా వ్యవసాయ వ్యర్థాలను రైతులు కాల్చేస్తున్నారు. ఆ వ్యర్థాలను ఉపయోగించి ఇటుకల తయారీ చేపడితే పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్లు అవుతుందని ఆ ఇద్దరు యువకులు భావించారు. వరి, చెరకు, గోధుమ, పత్తి, సోయా వంటి పంటల వ్యర్థాలను ప్రస్తుతం ఇటుకల తయారీకి వినియోగిస్తున్నారు.

ఒక్కో ఇటుక రూ.30 నుంచి రూ.50

ఆగ్రోక్రీట్ పేరుతో మార్కెటింగ్

వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి తయారు చేస్తున్న పర్యావరణహిత ఇటుకలు కావడంతో ఆగ్రోక్రీట్ పేరుతో వీటిని మార్కెటింగ్ చేస్తున్నారు. స్టీల్ పరిశ్రమ నుంచి స్లాగ్, ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్, రైతుల నుంచి పంట వ్యర్థాలను సేకరించి ఇటుకల తయారీలో వినియోగిస్తున్నారు. వీటిలో ఇసుక, సిమెంట్ వంటివి ఒక్క శాతం కూడా వినియోగించకపోవడం ప్రత్యేకత. ఈ ఇటుకలు సాధారణ మట్టి ఇటుకల కంటే అధిక పటిష్టతతో 75 ఏళ్ల వరకు మన్నిక ఇస్తాయని చెబుతున్నారు. వీటిని సీబీఆర్ఐ రూర్కీ పరీక్షించి సర్టిఫై చేసింది. ప్రహరీ గోడ నుంచి, ఇంటి లోపలి గోడల వరకు ఎక్కడైనా వీటిని వినియోగించే అవకాశం ఉంది.

గ్రీన్‌జామ్స్ పేరిట కంపెనీ ఏర్పాటు చేసిన ఆ యువకులు అనకాపల్లి జిల్లా పరవాడలో ఒక ప్లాంట్‌ను, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో మరో ప్లాంట్‌ను నెలకొల్పారు. ఒక్కో ఇటుక సైజ్‌ను బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు ధర ఉంది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఇటుకలతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అధిక ఇన్సులేషన్ సామర్థ్యం కలిగి ఉండటం వలన భవన నిర్మాణం పూర్తయిన తరువాత విద్యుత్ ఖర్చు 25 శాతం వరకు తగ్గుతుంది. ఇటుక తక్కువ బరువు ఉండటంతో ఐరన్, కాంక్రీట్ వ్యయం తగ్గుతోంది. దేశంలో ఈ ఇటుకలకు ఇప్పటికే పేటెంట్ సాధించగా.. అంతర్జాతీయ పేటెంట్‌లకు సైతం దరఖాస్తు చేశారు. పర్యావరణ హిత ఇటుకలను ఐటీసీ సంస్థ తాము చేపట్టే నిర్మాణాలలో ప్రస్తుతం వినియోగిస్తోంది.



సంస్థ నిర్వాహకులు తరుణ్, వరుణ్



మీరట్‌లో నెలకొల్పిన ప్లాంట్

ప్రోత్సహించిన ఏయూ హబ్..

స్టార్టప్‌లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రీన్ జామ్స్ సంస్థకు వర్క్ స్పేస్ కేటాయించాం. మార్కెట్ యాక్సెస్ ఇవ్వడం, బ్రాండింగ్ తదితర రంగాలలో వీరికి సహకారం అందించాం. త్వరలో ఏయూలో జరిపే నిర్మాణాలలో ఈ సాంకేతికతను వినియోగించే ఆలోచన ఉంది. ఇటువంటి నవ్య ఆలోచనలతో పనిచేసే యువతకు యూనివర్సిటీ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తాం.

– రవి ఈశ్వరప్పు, సీఈవో, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్, విశాఖపట్నం

విశాఖ నుంచి తొలి యూనీకాన్‌గా నిలవాలి

దేశవ్యాప్తంగా 18 వేల కర్మాగారాలను స్థాపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. విశాఖ నుంచి తొలి యూనీకాన్‌గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పర్యావరణ హితంగా నడుచుకుంటూ క్లైమేట్ ఛేంజ్ దుష్పరిణామాలను వీలైనంత వరకు తగ్గించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

–జామి తరుణ్, సీఈవో, జామి వరుణ్, సీవోవో, గ్రీన్ జామ్స్

అమెరికాలో తెలుగు దంపతులు గల్లంతు

- వారి స్నేహితుడు కూడా..
- సరస్సు దాటుతున్న క్రమంలోఘటన
- గుంటూరు జిల్లా పాలపర్రులో విషాదఛాయలు



నారాయణ, హరిత (ఫైల్ ఫొటో)


పెదనందిపాడు: అమెరికాలో విషాదం చోటు చేసుకుంది. న్యూజెర్సీలో నివాసముంటున్న గుంటూరు జిల్లాకు చెందిన దంపతులు సరస్సు దాటుతున్న క్రమంలో గల్లంతయ్యారు. ఈ ఘటనలో భార్య హరిత మృతదేహం లభ్యమైంది. ఆమె భర్త నారాయణ, అతడి స్నేహితుడు ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ముద్దన నారాయణ, హరిత దంపతులు అమెరికాలోని న్యూజెర్సీలో నివాసం ఉంటున్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా తమ ఇద్దరు పిల్లలు, స్నేహితుడితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫీనిక్స్‌లో ఉన్న సరస్సు దాటే క్రమంలో మంచు ఫలకలు కుంగాయి. దీంతో నారాయణ, ఆయన భార్య హరిత, స్నేహితుడు సరస్సులో పడిపోయారని తెలుస్తోంది. ఈ ఘటనలో హరిత మృతదేహం లభించింది. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారని అమెరికాలోని నారాయణ స్నేహితులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా ఈ ఘటనలో చిన్నారులకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదని తెలిపారు. పాలపర్రుకు చెందిన ముద్దన వెంకట సుబ్బారావు, వెంకటరత్నం దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో కుమారుడు నారాయణ పెద్దవాడు. కష్టపడి చదివి విదేశాల్లో స్థిరపడిన కుమారుడు కుటుంబానికి అసరాగా ఉంటున్న సమయంలో విధి ఇలా చేస్తుందని అనుకోలేదని అతడి తల్లిదండ్రులు, తోబుట్టువులు రోదిస్తున్నారు. కనీసం కడసారి చూపులకైనా మృతదేహాలను స్వగ్రామానికి తరలించేలా ప్రభుత్వం కృషి చేయాలని తల్లిదండ్రులు ప్రభుత్వానికి విన్నవించారు.

తెలంగాణ నుంచి వచ్చిన వారికి మరో మూడేళ్లు స్థానికత

ఉద్యోగ, విద్యా రంగాల్లో ఏపీలో స్థానికత వర్తింపు

- రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలకు అనుగుణంగా గెజిట్ నోటిఫికేషన్లు జారీ
- ఏడేళ్లు పూర్తి కావడంతో మరో మూడేళ్లు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఏపీకి వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్న వారికి విద్య, ఉద్యోగాలకు సంబంధించి మరో మూడు సంవత్సరాలు స్థానికత కల్పించేందుకు రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేసిన సవరణలకు అనుగుణంగా సాధారణ పరిపాలన శాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన వారికి ఏడేళ్ల స్థానికత కల్పిస్తూ 2014లోనే రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణలు చేస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు. ఆ గడువు పూర్తవడంతో మరో మూడేళ్లు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నుంచి వచ్చి ఏ జిల్లాలోనైనా నివసిస్తున్న వారికి మరో మూడేళ్లు స్థానికతను వర్తింపజేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణలు చేస్తూ రాష్ట్రపతి గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలకు అనుగుణంగా విద్యా సంస్థల్లో ప్రవేశాలకు 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణలు, ఉద్యోగాల స్థానికతకు సంబంధించి 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణలకు అనుగుణంగా సాధారణ పరిపాలన శాఖ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)కు సవరణలు చేస్తూ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్లలో మరో మూడేళ్లు స్థానికత కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్లు)కు సవరణలు చేస్తూ విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో మరో మూడేళ్ల పాటు స్థానికత కల్పిస్తూ మరో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 277

బుధవారం 28-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అమెరికాలో మంచు విలయం

60 దాటిన మృతుల సంఖ్య.. పొంచి ఉన్న వరద ముప్పు - 6లో



శిఖర్ ధావన్‌పై వేటు

వన్డేల్లో వైస్ కెప్టెన్‌గా హార్దిక్.. శ్రీలంకతో సిరీస్‌కు భారత జట్ల ప్రకటన - 12లో

న్యూస్‌రీల్

నేడు ప్రధానితో సీఎం భేటీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఆయన బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు.

వివరాలు 2 ▸

బాబు ఆంధ్రాలో తిరిగి.. హైదరాబాద్‌లో నిద్రపోతారు



ప్రతిపక్ష నేత చంద్రబాబు పగలు ఆంధ్రాలో తిరుగుతూ.. రాత్రికి హైదరాబాద్ వెళ్లి నిద్ర పోతుంటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.7 వేల కోట్లు ఇస్తే అప్పటి సీఎం చంద్రబాబు ఒక్క భవనం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు.

వివరాలు 10 ▸

బాలికపై లైంగిక దాడికి టీడీపీ నేత యత్నం



తొమ్మిదేళ్ల బాలికపై టీడీపీ సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్ లైంగిక దాడికి ప్రయత్నించాడు. చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి బాలికను ఓ ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో వినుకొండ అశోక్‌బాబు పారిపోయాడు.

వివరాలు 5 ▸

అభి'వృద్ధి'లో అగ్రగామి



అభివృద్ధిలో ఏపీ దూసుకుపోతోంది. 2021–22కి సంబంధించి దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు నమోదు చేసిన రాష్ట్రంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ వెల్లడించిన అంశాలు, రాష్ట్ర ప్రగతిపై 2022 రౌండప్.

వివరాలు 10 ▸

ఇదండీ సంగతి



మనం చలి కాలంలో వణుకుతున్నప్పుడే ఆయన స్పీచ్‌లిస్తున్నారు!

పెంచితే అభాండాలా?

మూడున్నరేళ్లలో పెన్షన్లు 60 శాతానికిపైగా పెంచాం: సీఎం జగన్

- గతంతో పోలిస్తే మూడున్నర రెట్లకుపైగా పెరిగిన పింఛన్ల వ్యయం
- పేదలు అందుకునే పెన్షన్ సొమ్ములో 175% పెరుగుదల.. పింఛన్లు తీసేస్తున్నారంటూ విపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- పెంపును జీర్ణించుకోలేకే కట్టుకథలు
- ఇవాళ విష వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం
- ఆరోపణల్లో నిజం ఉంటే సరిచేద్దాం.. లేదంటే గట్టిగా వాస్తవాలు చెబుదాం
- అర్హులందరికీ అందాలి.. అనర్హులకు అందకూడదన్నదే ప్రభుత్వ విధానం
- అందులో భాగంగానే ఆర్నెల్లకు ఒకసారి ఆడిట్.. అనుమానాలు, సందేహాలున్న వారికి నోటీసులిస్తారు
- రీ వెరిఫై చేయకుండా ఏ చర్యలూ తీసుకోరు
- మిగిలిపోయిన అర్హులకూ లబ్ధి చేకూర్చడం మన పారదర్శక పాలనకు నిదర్శనం
- డీబీటీ, నాన్ డీబీటీతో రూ.3.30 లక్షల కోట్లు అక్క చెల్లెమ్మలకు అందచేశాం
- 11 పథకాలకు సంబంధించి వివిధ కారణాలతో మిగిలిపోయిన 2.79 లక్షల మంది అర్హులకు రూ.590.91 కోట్లు జమ చేసిన సీఎం

2లో



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> ప్రతి కలెక్టర్‌కు చెబుతున్నా.. మనది మానవత్వం ఉన్న ప్రభుత్వం. పేదవాడికి దగ్గరగా ఉండే మనసులు మనవి. అర్హత ఉన్నప్పటికీ ఇవ్వని పరిస్థితి, పథకాలు రాని పరిస్థితి, కటింగ్ అయిన పరిస్థితి అసలు ఉండకూడదు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ లబ్ధిదారుడికే ఇవ్వండి. నాకు అర్హత ఉండి కూడా ఈ ప్రభుత్వంలో మంచి జరగలేదనే మాటను ఏ ఒక్క పేదవాడి నుంచి కూడా, ఏ ఒక్క కలెక్టర్ ఎట్టి పరిస్థితుల్లోనూ అనిపించుకునే పరిస్థితి రానివ్వద్దు.
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జనవరి 3 నుంచి పింఛన్ల పెంపు వారోత్సవాలు

- రాజమండ్రిలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- పింఛన్ల పంపిణీ మాత్రం యధావిధిగా ఒకటి నుంచే..

2లో

ఈ-ఆఫీస్ @ 2023

నూతన సంవత్సరం ఆరంభం నుంచి ప్రభుత్వంలో అమలు

- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ- ఆఫీస్, అధికారిక ఈ-మెయిల్స్ ద్వారానే
- భౌతికంగా ఫైళ్లు, తపాల్స్‌కు స్వస్తి
- మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్
- ఈ-ఆఫీస్, ఈ-మెయిల్స్ ద్వారా ఫైళ్లు, ఉత్తర ప్రత్యుత్తరాలపై సిబ్బందికి శిక్షణ



సాక్షి, అమరావతి: నూతన సంవత్సరం ఆరంభం నుంచి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పని తీరులో నూతనత్వం సంతరించుకోనుంది. కాగితాలు, ఫైళ్లతో పని లేకుండా అంతా ఈ-ఆఫీస్ పద్ధతిలో కార్యకలాపాలు జరగనున్నాయి. జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ కార్యకలాపాలన్నీ ఈ-ఆఫీస్ నుంచే నిర్వహించాలని సీఎస్ డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫైళ్లు, తపాల్స్ అన్నీ ఈ-ఆఫీస్, అధికారిక ఈ-మెయిల్స్ ద్వారానే జరగాలని, భౌతికంగా తీసుకోబడవని తెలిపారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఇటీవల సీఎస్ జారీ చేశారు. ఈ-ఆఫీస్‌ను ప్రవేశపెట్టి ఆరు సంవత్సరాలైనా ఇంతవరకు అమలు కాలేదు. ఈ-ఆఫీస్‌కు స్పష్టమైన మార్గదర్శకాలున్నప్పటికీ శాఖలు, సచివాలయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు ఫిజికల్ విధానంలోనే జరుగుతున్నాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫలితంగా సిబ్బంది శక్తి, ఉత్పాదకత, వనరులతో పాటు సమయం వృథా అవుతోందన్నారు. కాలం చెల్లిన విధానాలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. శాఖాధిపతుల కార్యాలయాలు సమర్పిస్తున్న కొన్ని ప్రతిపాదనలు, ఏసీబీ కేసులు అందుబాటులో లేవన్న ఫిర్యాదులున్నాయన్నారు. ఈ నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో ▶

జిజెయాంగ్‌లో రోజుకు 10 లక్షల కేసులు

- చైనాలో ప్రతిరోజూ లక్షలాది మంది కరోనా బారిన పడుతున్నారు. షాంఘై సమీపంలోని పారిశ్రామిక నగరమైన జిజెయాంగ్‌లో రోజుకు కనీసం 10 లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. మార్చురీల బయట శవాలు గుట్టలుగా పేరుకుంటున్నాయి. మరోవైపు కరోనా కట్టడి ప్రయత్నాలను గాలికొదిలేస్తూ చైనా సర్కార్.. దేశ సరిహద్దులను పూర్తిగా తెరవాలని నిర్ణయించింది. విదేశాల నుంచి వచ్చే వారికి అమలు చేస్తున్న క్వారంటైన్ నిబంధనను పూర్తిగా ఎత్తేయబోతోంది.



ఇంకోవాక్ ధర ఖరారు

- ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్ 'ఇంకోవాక్' ధరను భారత్ బయోటిక్ ప్రకటించింది. కోవిన్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉండే ఈ వ్యాక్సిన్‌ను రూ.800కు అందివ్వనున్నట్లు తెలిపింది. భారీ స్థాయిలో సేకరించి, పౌరులకు అందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.325కే ఒక డోస్ టీకాను విక్రయిస్తామని తెలిపింది.

6లో

కోవిడ్ సన్నద్ధతపై మాక్ డ్రిల్

ఆసుపత్రుల్లో సదుపాయాలపై కేంద్ర ఆరోగ్య మంత్రి సమీక్ష

కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు గడువు పెంపు

జనవరి 7వరకు అవకాశం

సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును రాష్ట్ర పోలీసు నియామక మండలి పొడిగించింది. ఇటీవల 611 ఎస్‌ఐ పోస్టులు, 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలకు అభ్యర్థుల వయో పరిమితిని ప్రభుత్వం రెండేళ్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా ముందు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కానిస్టేబుల్ పోస్టులకు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలి.



వయో పరిమితి రెండేళ్లు సడలింపునిచ్చిన నేపథ్యంలో అర్హత సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా గడువును 2023, జనవరి 7 వరకు పొడిగించింది. ఈ మేరకు పోలీస్ నియామక నోటిఫికేషన్‌ను సవరించింది. ఎస్‌ఐ పోస్టులకు మాత్రం ముందు ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం జనవరి 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



ప్రమాదంలో ప్రధాని సోదరుడికి గాయాలు

ప్రధాని మోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ కుటుంబం ప్రయాణిస్తున్న వాహనానికి కర్ణాటకలోని మైసూరు సమీపంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రహ్లాద్, ఆయన కుమారుడు, కోడలు, ఓ చిన్నారి గాయపడ్డారు. అందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు చెప్పారు.

- వివరాలు 6లో



సుశాంత్‌ది హత్యే!

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ది కచ్చితంగా హత్యేనంటూ మృతదేహానికి పోస్టుమార్టం చేసిన వైద్యుల బృందంలోని సభ్యుడు రూప్ కుమార్ షా సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆయన శరీరంపై.. మెడపై కొట్టిన గాయాల గుర్తులున్నాయని చెప్పాడు. డాక్టర్లకు చెప్పగా.. వీలైనంత త్వరగా పోస్టుమార్టం అయిందనిపించి పోలీసులకు అప్పగించాలన్నారని తెలిపాడు.


- వివరాలు 6లో

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

వాటిపై కొన్ని పత్రికల్లో వస్తున్న కథనాలు అవాస్తవం

- 2025 మార్చి నాటికి అన్నిచోట్లా వీటిని పెట్టాలని కేంద్రం ఆదేశించింది
- రాష్ట్రమంతా ఈ మీటర్లు పెడితే రైతులకు ప్రయోజనం, డిస్కంలకు జవాబుదారీతనం
- శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు వల్ల విద్యుత్ ఆదా అయ్యింది
- టెండర్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది
- ఏ ఒక్క సంస్థకో ప్రయోజనం చేకూర్చడంలేదు
- టెండర్లు ఇప్పటికీ ఓపెన్‌గా ఉన్నాయి.. ఎవరైనా దాఖలు చేయొచ్చు
- మీడియాతో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

సాక్షి, అమరావతి: స్మార్ట్ మీటర్లవల్ల ప్రయోజనాలే తప్ప ఎలాంటి నష్టంలేదని, ఈ విషయంలో ఎవరూ ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయడంపై పలు పత్రికల్లో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఆ కథనాల్లోని సందేహాలను నివృత్తి చేస్తూ.. స్మార్ట్ మీటర్లవల్ల కలిగే ప్రయోజనాలను, ఈ ప్రాజెక్టులోని వాస్తవాలను ఆయన వివరించారు. విజయవాడ విద్యుత్ సౌధలో గవర్నమెంట్ డిప్యూటీ సెక్రటరీ కుమార్‌రెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్, సెంట్రల్ డిస్కం సీఎండీ పద్మాజనార్ధనరెడ్డిలతో కలిసి మంగళవారం విజయానంద్ మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో భాగంగా 2025 మార్చి నాటికి దేశమంతా అన్ని రాష్ట్రాలూ స్మార్ట్ విద్యుత్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు 2019లోనే

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు సీజే చంద్రచూడ్



రేణిగుంట విమానాశ్రయంలో సీజేఐ డీవై చంద్రచూడ్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)/రేణిగుంట (తిరుపతి జిల్లా): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం రాత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ధనంజయ వై చంద్రచూడ్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి కోర్టు స్థానిక న్యాయమూర్తి నరేంద్రరెడ్డి, ఆర్డీవో రామారావు, ఈవో సాగర్‌బాబు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు సీజేఐ చంద్రచూడ్‌కు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ నాయుడు, ఏజీపీ దశరథరామిరెడ్డి, సీనియర్ అడ్వకేట్ ఉదయ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు సీజేఐ ధనంజయ వై చంద్రచూడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు, చిత్తూరు ఉమ్మడి జిల్లా జడ్జి జస్టిస్ భీమారావు, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, మూడో అదనపు జిల్లా జడ్జి వీర్రాజు, ప్రొటోకాల్ మెజిస్ట్రేట్ కోటేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏఎస్పీ కులశేఖర్, జిల్లా బార్ కౌన్సిల్ అధ్యక్షుడు దినకర్ తదితరులు స్వాగతం పలికారు.

నేడు ప్రధానితో ముఖ్యమంత్రి భేటీ

- మధ్యాహ్నం 12.30 గంటలకు సమావేశం
- ఢిల్లీకి చేరుకున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా అధికారిక నివాసానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, పార్టీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఢిల్లీకి వచ్చారు.

జనవరి 3 నుంచి పింఛన్ల పెంపు వారోత్సవాలు

- రాజమండ్రిలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- పింఛన్ల పంపిణీ మాత్రం యధావిధిగా ఒకటి నుంచే..

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తదితరులకు ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంచిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహించనుంది. 9వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీల స్థాయిలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ వారోత్సవాల కార్యక్రమాలు కొనసాగుతాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనవరి మూడో తేదీన రాజమండ్రిలో ఈ వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు తగిన సూచనలు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. తొలుత జనవరి ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు ఈ పింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఒకటవ తేదీన ఆదివారం కావడంతో పాటు నూతన సంవత్సరం రోజు కూడా కావడంతో రెండు రోజులు ఆలస్యంగా ఈ కార్యక్రమాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, పింఛన్ల పంపిణీ కార్యక్రమం మాత్రం ఎప్పటి మాదిరే ఒకటో తేదీ నుంచే ప్రారంభమవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పెంచితే అభాండాలా..?

మూడున్నరేళ్లలో పెన్షన్లు 60 శాతానికిపైగా పెంచాం: సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, అధికారులు

సాక్షి, అమరావతి: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం జనవరి 1వ తేదీ నుంచి పింఛన్ మొత్తాన్ని పెంచుతుండటాన్ని జీర్ణించుకోలేక పెన్షన్లు తొలగిస్తున్నారంటూ విపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత మానవతా దృక్పథంతో పని చేస్తుంటే మంచిని సహించలేక ఆశ్చర్యకరమైన వార్తలు రాస్తున్నారని, అభాండాలు వేయాలన్న తపనతో కట్టుకథలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలు, కట్టుకథలు, విష రాతలను ఎవరూ నమ్మాల్సిన అవసరం లేదని, అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్లు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి వాస్తవాలను గట్టిగా వెల్లడించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు దూరం కారాదనే సంకల్పంతో ఏ కారణంతోనైనా పొరపాటున పథకాలు అందని అర్హులకు కూడా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2,79,065 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.590.91 కోట్లను ముఖ్యమంత్రి జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేశారు. వివిధ జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న వారినుద్దేశించి సీఎం మాట్లాడారు. ఆ వివరాలివీ..

తప్పుడు ప్రచారాలు..

అర్హత ఉన్నవారికి ఏ పథకం కూడా మిస్ కాకూడదు. ఇది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అలాగే అర్హత లేని వారికి రాకూడదు. ఏ పథకమైనా ప్రతి ఆర్నెల్లకు ఒకసారి ఆడిట్ జరగాలి. ఇందులో తప్పేముంది? పెన్షన్లకు సంబంధించి కొంతమందికి నోటీసులు వెళ్లాయి. ఎక్కడెక్కడ సందేహాలున్నాయో వాటిని ప్రస్తావిస్తూ నోటీసులు ఇస్తారు. దానికి సమాధానాలు కూడా తీసుకుంటారు. ఆ తర్వాత రీ వెరిఫై చేసి అనంతరం ఏదైనా చర్య తీసుకుంటారు. అంతేకానీ రీ వెరిఫై చేయకుండా ఏ చర్యలూ తీసుకోరు. కేవలం నోటీసులిస్తేనే పెన్షన్లు తీసేస్తున్నారంటూ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ ప్రభుత్వంలో ఏ పేదవాడికైనా, ఎక్కడైనా నష్టం జరుగుతుందా? అని అంతా గుండెల మీద చేతులు వేసుకుని ప్రశ్నించుకోవాలి.

విష వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం

మనం ఇవాళ ఒక పార్టీతో యుద్ధం చేయడం లేదు. ఒక విష వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం. మనం ఎలాంటి మంచి చేసినా నెగిటివ్‌గా చూపించాలని తపనపడే ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 విష వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం. అయినా కూడా మంచి చేసేవాళ్లకి దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. ఇలాంటి విష వక్రీకరణలు చేసే వారికి దేవుడే సమాధానం చెబుతాడు. విష రాతలు రాసేవారికి దేవుడే మొట్టికాయ వేస్తాడు. వాళ్లు చేసే ఏ ఆరోపణ అయినా మనం పాజిటివ్‌గా తీసుకుందాం. అందులో నిజం ఉంటే సరిదిద్దుకుందాం. నిజం లేకపోతే వారి తప్పును కచ్చితంగా తెలియజేసే కార్యక్రమం చేయాలి. లేదంటే తప్పుడు సమాచారం పోతుంది. వాళ్లు చెప్పేదే నిజమనుకునే ప్రమాదం ఉంది. మన తప్పు లేకపోతే మీడియా సమావేశం పెట్టి గట్టిగా చెప్పండి. అప్పుడే వాళ్లు చేసిన తప్పు వాళ్లకు ఎత్తి చూపినట్లు అవుతుంది. మనం ప్రజా పాలకులం. అంటే ప్రజలకు సేవకులం అని అర్థం. పాలన అంటే సేవ అనే అర్థం. ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోండి.

అధికారం ప్రజా సేవకే...

దేవుడి దయతో ఈ రోజు మంచి కార్యక్రమం జరుగుతోంది. ఇవాళ మనం వేసే అడుగు మన పాలనకు అద్దం పట్టే విధంగా జరుగుతోంది. అధికారం చలాయించడానికి కాదు.. ప్రజల కోసమే మనం ఉన్నాం. ప్రజలకు సేవ చేయటానికే మనం ఉన్నామని చెప్పడానికి ఇది గొప్ప నిదర్శనం.

డీబీటీ, నాన్ డీబీటీతో రూ.3.30 లక్షల కోట్ల లబ్ధి

ఇవాళ లంచాలకు తావులేకుండా, వివక్షకు చోటు ఇవ్వకుండా ఎంత పారదర్శకంగా పాలన జరుగుతుందో చెప్పడానికి చిన్న ఉదాహరణ. ఈ 36 నెలల వ్యవధిలో బటన్ నొక్కి డీబీటీ ద్వారా రూ.1.85 లక్షల కోట్లు నేరుగా అక్క చెల్లెమ్మల కుటుంబాలకు జమ చేశాం. దీనికి నాన్ డీబీటీ అంటే ఇళ్లు, ఇళ్ల పట్టాలు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, ట్యాబ్‌లు, విద్యా కానుక తదితరాలతో డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.3.30 లక్షల కోట్ల మేర అక్కచెల్లెమ్మల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చగలిగాం.

కళ్లూ, చెవులు మీరే..

కలెక్టర్లు ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారు. వారి పాత్ర చాలా కీలకం. వారు బాగా పనిచేస్తే ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తుంది. కలెక్టర్లకు ఈ విషయంలో అభినందనలు. పారదర్శకంగా, అవినీతికి చోటు లేకుండా చేయగలిగారు కాబట్టే ఒక గొప్ప వ్యవస్థను తేగలిగాం.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాల నాయుడు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.యస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్(ఎఫ్ఏసీ) వై.మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, బీసీ, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, హేండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ ముఖ్య కార్యదర్శి కె.సునీత, రవాణాశాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ ఎంఎం నాయక్, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, కాపు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ జి. రేఖారాణి, సెర్ప్ సీఈవో ఇంతియాజ్, గృహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక కార్యదర్శి బీఎం దివాన్, సచివాలయాల శాఖ కమిషనర్ షన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మీ కష్టం తెలిసిన ప్రభుత్వం..

మనది మనసున్న ప్రభుత్వం.. పేదల కష్టం తెలిసిన ప్రభుత్వం.. రైతన్నల కష్టం తెలిసిన ఎరిగిన ప్రభుత్వం. అందుకే ఏ ఒక్కరికైనా, ఏ కారణం చేతనైనా, ఏ ఒక్క పథకమైనా అర్హత ఉన్నప్పటికీ పొరపాటున అందకపోతే కంగారు పడాల్సిన పనిలేదని భరోసా ఇస్తున్నాం. పథకం నెల రోజులలోగా దరఖాస్తు చేసుకోమని చెప్పాం. దాన్ని రీ వెరిఫై చేస్తాం. జనవరి నుంచి మే వరకు అమలైన పథకాలకు సంబంధించి మిగిలిపోయిన అర్హులకు జూన్‌లోనూ, జూన్ నుంచి నవంబరు వరకు అమలైన వాటికి డిసెంబరులోనూ మిగిలిపోయిన వారికి లబ్ధి చేకూరుస్తున్నాం. ఇలాంటి కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. అర్హులు ఎవరూ మిస్ కాకూడదని తపన పడి ఇచ్చే కార్యక్రమం బహుశా దేశ చరిత్రలో కూడా జరిగి ఉండదు. అది కూడా అర్హుల జాబితాను సామాజిక తనిఖీల కోసం గ్రామ సచివాలయంలో ప్రదర్శిస్తూ మరీ పారదర్శకంగా అందించడం దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. అందులో భాగంగా ఈ రోజు 11 పథకాలకు సంబంధించి మిగిలిపోయిన (జూన్ నుంచి నవంబరు వరకు) 2,79,065 మంది అర్హులకు మంచి చేస్తూ రూ.591 కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం.

నాడు - నేడు.. ఎంత తేడా?

'జన్మభూమి' ఆగడాలు.. మరుగుదొడ్లకూ లంచాలు

గత ప్రభుత్వ హయాంలో ప్రతి అడుగులో, ప్రతి గ్రామంలో జన్మభూమి కమిటీలదే రాజ్యం. నాడు ఏ పథకం రావాలన్నా అడిగే మొట్టమొదట ప్రశ్న మీరు ఏ పార్టీకి చెందిన వారు? ఇచ్చే అరకొర కూడా లంచాలు చెల్లిస్తేనే కానీ అందని దుస్థితి. గత ప్రభుత్వ హయాంలో గమనిస్తే అరకొరగా ఇచ్చిన పింఛన్ కేవలం రూ.1,000. అది కూడా మూడు నెలల పెన్షన్ సొమ్ము జన్మభూమి కమిటీల చేతిలో పెడితే కానీ వచ్చేది కాదు. జన్మభూమి కమిటీలకు రూ.20 వేలు లంచం చేతిలో పెడితే కానీ ఇళ్లు వచ్చేవి కాదు. రూ.50 వేల సబ్సిడీ లోన్ ఇవ్వాలంటే రూ.20 వేలు జన్మభూమి కమిటీలకు ముట్టచెప్పాల్సిందే. మరుగుదొడ్లు కావాలన్నా కూడా లంచమే. మరుగుదొడ్లకు కూడా లంచాలు తీసుకున్న అధ్వాన్న పరిస్థితిని మనం గతంలో చూశాం.

అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోరాదనే ఆరాటంతో...

ఆ పరిస్థితులన్నీ ఇవాళ మార్చగలిగాం. వ్యవస్థలో పూర్తి మార్పులు తెచ్చాం. గ్రామస్థాయిలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ కనిపిస్తోంది. సోషల్ ఆడిట్‌తో అర్హుల జాబితాలను ప్రదర్శించి పారదర్శకంగా ఇస్తున్నాం. అర్హత ఉండి కూడా ఏ ఒక్కరికైనా ప్రయోజనం దక్కకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాం. రీ వెరిఫై చేసి మంజూరు చేసే గొప్ప మనసు ఇవాళ కనిపిస్తోంది. అర్హులను వెతికి మరీ ఏ ఒక్కరూ మిగిలిపోకూడదన్న ఆరాటంతో మంచి చేస్తున్నాం. ఇవాళ పార్టీలు, కులాలు, ప్రాంతాలు చూడటం లేదు. మన పార్టీకి ఓటు వేయని వారికి కూడా అర్హత ఉంటే ఇచ్చే గొప్ప ఆలోచన జరుగుతోంది.

పెన్షన్ మొత్తంలో 175 శాతం పెరుగుదల

గత ప్రభుత్వ హయాంలో 39 లక్షల పెన్షన్లు ఇవ్వగా ఈరోజు 62.70 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. గతంలో పెన్షన్ రూ.వెయ్యి మాత్రమే ఇస్తే ఇవాళ రూ.2,750కి పెంచుతున్నాం. అందుకునే పెన్షన్ మొత్తంలో 175 శాతం పెరుగుదల కనిపిస్తోంది. ఇక పెన్షన్ల సంఖ్య 39 లక్షల నుంచి 62.70 లక్షలకు పెరిగిందంటే 60 శాతానికిపైగా పెరుగుదల ఉందని అర్థం. అలాగే నెలవారీ పింఛన్ల వ్యయంలో మూడున్నర రెట్లకుపైగా పెరుగుదల కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల బిల్లు వ్యయం రూ.400 కోట్లు కాగా నేడు నెలకు రూ.1,770 కోట్లు పింఛన్ల కోసం ఇస్తున్నాం. ఇంత భారీగా పెరిగిన పరిస్థితుల్లోనూ ఇంకా ఎవరైనా అర్హులు పొరపాటున కూడా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో వారితో దరఖాస్తు చేయించి రీ వెరిఫై చేసి మరీ ఇస్తున్నాం.

లబ్ధిదారుల కళ్లల్లో 'సంతృప్తి'

అర్హులైన లబ్ధిదారులు పథకాలు అందుకోవడం ఒక ఎత్తయితే వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన అర్హులకు కూడా సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తుండటంతో వారి కళ్లల్లో ఎంతో సంతోషం కనిపిస్తోంది. లంచాలు ఏమైనా ఇస్తున్నారా? అంటే మా జగనన్న వచ్చినప్పటి నుంచి ఆ మాటే లేదంటున్నారు. అన్ని పల్లెలు, పట్టణాల్లో అదే మాట వినిపిస్తోంది. ప్రతి అక్కచెల్లెమ్మ మా అన్న వచ్చిన తర్వాత జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటి దగ్గరే నీళ్లు తీసుకుంటున్నాం అని చెబుతుంటే ఆనందంగా ఉంది. – బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి)

అన్నలా, తమ్ముడిలా, కుమారుడిలా



అమ్మ ఒడి మూడో విడత డబ్బులు రాకపోవడంతో వలంటీర్‌ను కలిశా. బ్యాంక్ ఖాతా లింక్ కాకపోవడంతో పడలేదని చెప్పారు. మా వలంటీర్ సచివాలయానికి తీసుకెళ్లి లింక్ చేయించింది. మీరు మాట ఇచ్చారంటే తప్పరని తెలుసు. మళ్లీ లిస్ట్‌లో నాపేరు రావడంతో సంతోషంగా ఉంది. నవరత్నాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సచివాలయ వ్యవస్థతో పనులన్నీ జరుగుతున్నాయి. అన్నీ ఇంటి ముందుకే వస్తున్నాయి. ఇప్పుడు పల్లెటూళ్లలో కూడా అభివృద్ధి జరుగుతోంది. మాలాంటి పేదల సొంతింటి కలను కూడా మీరు నెరవేర్చారు. ప్రతి ఇంట్లో మిమ్మల్ని అన్నలా, తమ్ముడిలా, కుమారుడిలా భావిస్తున్నారు. మీరు సీఎంగా రావడం మాకు వరం. – వెలమల నాగమణి, లబ్ధిదారు, పెద్ద తాడివాడ, విజయనగరం జిల్లా

కాపులను గుర్తించింది మీరే..



మాకు గతంలో ఎప్పుడూ ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరలేదు. మీరు మాకు కాపునేస్తం ఇచ్చారు. అయితే రెండోసారి రాలేదు. వలంటీర్ నిన్న కాల్ చేసి మీకు కాపు నేస్తం వచ్చిందని చెప్పడంతో చాలా సంతోషం వేసింది. రూపాయి అడగాలంటే మనసు ఒప్పుకోక ఇంట్లోనే ఉండే మా కాపు మహిళలకు మీరు అండగా నిలుస్తున్నారు. కాపులను మీరు గుర్తించారు. ఇవాళ గర్వంగా చెబుతున్నాం జగనన్న మాకు డబ్బులు ఇస్తున్నారని. ప్రతి ఇంటికి మీరు ఎంతో సాయం చేస్తున్నారు. మా నాన్నకు పింఛన్ వస్తోంది. నా పెద్ద కుమారుడు జగన్ ప్రతి నెలా తెల్లవారగానే డబ్బులు పంపుతున్నాడని సంతోషంగా చెబుతున్నారు. మాకు ఆసరా కూడా వచ్చింది. – దేవిశెట్టి శారదాదేవి, లబ్ధిదారు, కొవ్వూరు, కాకినాడ రూరల్ మండలం

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ బాగుంది



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ ప్రేమ్‌సాగర్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్ జి. రెడ్డి

- డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది నియామకం గొప్ప విషయం
- ఏపీకి డిజిటల్ ఎక్స్‌రే మిషన్లు, అత్యాధునిక మెడికల్ ఎక్విప్‌మెంట్ ఇవ్వడానికి నేను రెడీ
- సీఎంతో భేటీ అనంతరం ప్రైమ్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రైమ్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. ప్రైమ్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో అమెరికాలోని 14 రాష్ట్రాల్లో 46 ఆసుపత్రులు నిర్వహిస్తూ, అక్కడ టాప్ టెన్ వైద్య వ్యవస్థల్లో ఒకటిగా ప్రైమ్ కేర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. సీఎంతో సమావేశానంతరం డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి మాట్లాడుతూ 'సీఎం జగన్‌తో సమావేశం మంచి సుహృద్భావ వాతావరణంలో జరిగింది. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాకు మంచి స్నేహితుడు.. అలాగే నా సహాధ్యాయి. మేం వివిధ అంశాలపై చర్చించాం. అందులో ప్రధానంగా ఏపీలో ఆరోగ్యరంగంపై చర్చ జరిగింది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ చాలా బాగుంది. ఏపీలో 98 శాతం డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకం జరగడం గొప్ప విషయం. ఏపీకి డిజిటల్ ఎక్స్‌రే మిషన్లు, అత్యాధునిక మెడికల్ ఎక్విప్‌మెంట్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కోవిడ్ సమయంలో కూడా అతితక్కువ వ్యవధిలో 1,500 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌లు ఇచ్చాను. పేదలకు ఇళ్లు, ఆరోగ్యశ్రీ, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో చాలా చక్కగా సీఎం అభివృద్ధి చేస్తున్నారు. ఈ రాష్ట్రం కోసం అనేక గొప్ప పనులు చేస్తున్నారు. తన తండ్రిలా చక్కటి పాలన అందిస్తూ ప్రజల మన్ననలు చూరగొంటున్నారు, ఈ కార్యక్రమాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వంలో నేను భాగస్వామిని కావడం చాలా గర్వంగా, సంతోషంగా ఉంది'. అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రసాద్ జి.రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి, మెడికల్ అడ్వైజర్ ఎన్నారై ఎఫైర్స్ వాసుదేవరెడ్డి నలిపిరెడ్డి, ఏపీఎస్‌ఆర్‌టీ ప్రెసిడెంట్ మేడపాటి వెంకట్, పలువురు సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు

తల్లిని కోల్పోయిన మంత్రి సురేశ్ కుటుంబానికి సీఎం జగన్ ఓదార్పు

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం మంత్రి ఆదిమూలపు సురేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి సమయంలో మంత్రి సురేశ్ మాతృమూర్తి థెరీసమ్మ తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మంగళవారం మధ్యాహ్నం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వచ్చారు. మంత్రి ఇంటికి చేరుకొని.. థెరీసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సురేశ్‌తో పాటు ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమారుడు విశాల్, కుమార్తె శ్రిష్టి, అల్లుడు సిద్ధార్థ్, సోదరుడు సతీష్, ఇతర కుటుంబ సభ్యులను సీఎం జగన్ ఓదార్చి.. అధైర్యపడొద్దు అంటూ ధైర్యం చెప్పారు.



థెరీసమ్మకు నివాళులర్పిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు సురేశ్, మేరుగు నాగార్జున

ఉత్తమ విద్యాకేంద్రాలుగా కేజీబీవీలు

పాఠశాల విద్యా కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ ఎస్.సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యుత్తమమైన విద్యా కేంద్రాలుగా రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉండాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్లో జీసీడీవో, ఏజీసీడీవోల రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు కేజీబీవీలను సొంత ఇల్లులా భావించేలా వాతావరణం సృష్టించాలని చెప్పారు. కేజీబీవీల అభివృద్ధికి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీబీవీలను తరచూ సందర్శించి సమస్యలుంటే పరిష్కరించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం చేయాలన్నారు. అనంతరం జీసీడీవో విధివిధానాలు తెలిపే ఎస్‌వోపీ, విజిట్ ఫార్మాట్ గురించి వివరించారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 180 కేజీబీవీల్లో పర్సనలైజ్డ్ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీడీ సమగ్ర శిక్షా అదనపు రాష్ట్ర పథక సంచాలకులు డాక్టర్ కె.వి.శ్రీనివాసులరెడ్డి, కేజీబీవీ సెక్రటరీ కె.రవీంద్రనాథ్ రెడ్డి, సీఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ-ఆఫీస్ @ 2023

▶ మొదటి పేజీ తరువాయి


ఈ-ఆఫీస్‌ను నిజమైన స్ఫూర్తితో అమలు చేయడానికి కఠినమైన మార్గదర్శకాలను అనుసరించాలని చెప్పారు. అసాధారణ కేసులకు సంబంధించి సంబంధిత కార్యదర్శి అనుమతి తీసుకుంటే తప్ప మిగతా కార్యకలాపాలన్నీ జనవరి 1వ తేదీ నుంచి ఈ-ఆఫీస్ ద్వారానే కొనసాగించాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ సూచనలను చిత్తశుద్ధిలో అనుసరించాలని సీఎస్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ-ఆఫీస్ నిర్వహణపై సాధారణ పరిపాలన శాఖ ఈ నెలాఖరు వరకు శాఖాధిపతులు, శాఖలు, ఇతర ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు శిక్షణ ఇస్తోంది.

ఇవీ మార్గదర్శకాలు..

- ఆమోదిత ముసాయిదా ప్రతుల కరస్పాండెన్స్ లన్నింటిపై (జీవోలు మినహా) తప్పనిసరిగా సంబంధిత అధికారి డిజిటల్ సంతకం ఉండాలి. ఆ ప్రతులను ఎంట్రీలో సూచించిన చిరునామాకు ఈ-ఆఫీస్‌లో ఈ-డిస్పాచ్‌లోనే పంపాలి. ఆమోదించిన ముసాయిదా ప్రతులను (జీవోలు మినహా) కూడా ఈ-డిస్పాచ్ ద్వారానే పంపాలి.
- ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థలోనే జీవో నంబర్లను జనరేట్ చేయాలి. తుది జీవోను నంబర్‌తో పాటు సంతకం చేసిన స్కాన్డ్ కాపీలను ప్రభుత్వ అధికారిక ఈ-మెయిల్స్ ద్వారా మాత్రమే పంపించాలి.
- ప్రభుత్వ శాఖాధిపతుల కార్యాలయాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, కలెక్టరేట్లు, జిల్లా కార్యాలయాలు అన్ని ప్రతిపాదనలను తప్పనిసరిగా డిజిటల్ ఆకృతిలో (పీడీఎఫ్) ఇన్‌వర్డ్ అండ్ అవుట్‌వర్డ్ కమ్యూనికేషన్ విభాగం ఈ-మెయిల్ ఐడీ, ఈ-ఆఫీస్ వ్యవస్థలోని ఈ-డిస్పాచ్ ద్వారా లేదా అధికారిక ఇ-మెయిల్ ద్వారానే పంపాలి. భౌతిక ఆకృతిలో సమర్పించిన ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోబడవు. డిజిటల్ ఫార్మాట్‌లో ప్రతిపాదనను సమర్పించడంలో జాప్యానికి సంబంధిత కార్యాలయమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అధికారిక ఈ-మెయిల్, ఈ-డిస్పాచ్ ద్వారా డిపార్ట్‌మెంట్‌లో స్వీకరించిన అన్ని ప్రతిపాదనలు, డిస్పాచ్ విభాగంలో సంబంధిత సిబ్బంది ఈ-రశీదులుగా మార్చి, వెంటనే సంబంధిత శాఖ అధికారులకు పంపాలి.
- ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్లు కూడా నివేదికలను డిజిటల్ ఫార్మాట్‌లో ఏకకాలంలో ఏపీ విజిలెన్స్ కమిషన్‌కు, సంబంధిత శాఖ కార్యదర్శికి పంపాలి. రిఫరెన్స్ కోసం నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి స్థూలమైన భౌతిక నివేదికను పంపాలి.
- సచివాలయాల శాఖలన్నీ తప్పనిసరిగా అన్ని సాధారణ ఉత్తర ప్రత్యుత్తరాలు (కరస్పాండెన్స్‌లు) డిజిటల్ ఫార్మాట్‌లో ఈ-డిస్పాచ్ ద్వారా ఇన్‌వర్డ్ అండ్ అవుట్‌వర్డ్ కమ్యూనికేషన్ విభాగాల అధికారికి పంపించాలి. డీవో లేఖలతో పాటు ఇతర ముఖ్యమైన ఉత్తర ప్రత్యుత్తరాలను సంబంధిత అధికారి అధికారిక ఈ-మెయిల్‌కు పంపాలి.

ప్రజా సేవే ధ్యేయంగా పనిచేస్తున్నా

- ప్రజల వద్ద తలదించుకునే పని ఎప్పుడూ చేయను
- నాకు సంబంధం లేని విషయాల్లో బురదజల్లుతున్నారు
- రాయచోటిలో భూ అక్రమాల ఆరోపణలపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి




రాయచోటి: ప్రజా సేవే ధ్యేయంగా తాను పనిచేస్తానని, ప్రజల వద్ద తలదించుకునే పనిని ఎప్పుడూ చేయనని, ఆరోజు వస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. సాక్ష్యాధారాలు లేకుండా బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రాయచోటిలో మంగళవారం తహసీల్దార్ రవిశంకర్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ గురుస్వామిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా కేంద్రం అయిన తర్వాత ఇక్కడ భూముల విలువ బాగా పెరిగి, భూ దందాలపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అంతకు ముందే తాను ప్రభుత్వ భూములు కాపాడాలని అధికారులకు సూచించానన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భూమి రిజిస్ట్రేషన్ విషయంలో జరిగింది తప్పేనని, ఈ స్థలం కబ్జాకు గురైందన్న విషయం పత్రికల ద్వారానే తనకు తెలిసిందని అన్నారు. రిజిస్ట్రేషన్లను ఎక్కడైనా చేసుకోవచ్చన్న చట్టం వల్ల రాయచోటికి సంబంధించిన 938 రిజిస్ట్రేషన్లు ఇతర ప్రాంతాల్లో జరిగాయని చెప్పారు. వీటిలో 275 రిజెక్ట్ అయ్యాయన్నారు. ఇలా వేరే ప్రాంతాల్లో ఎందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారో వాటిని చేయించుకున్న వారికే ఎరుక అన్నారు. లక్కిరెడ్డిపల్లె ఎస్సీల భూ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యేపైన కూడా తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని అన్నారు. ఆ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరానన్నారు.

క్లుప్తంగా...

సీలేరు నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల

- రోజుకు 2,700 క్యూసెక్కుల నీరు
- ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి వెల్లడి



డొంకరాయి డ్యామ్ నుంచి నీరు విడుదల

మోతుగూడెం: ఉభయ గోదావరి జిల్లాల్లోని పంట భూముల కోసం సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ నుంచి నీటి విడుదలను మంగళవారం ప్రారంభించినట్లు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి తెలిపారు. డొంకరాయి పవర్ కెనాల్ పనుల పరిశీలన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీలేరు కాంప్లెక్స్ నుంచి ఏటా ఉభయ గోదావరి జిల్లాల్లో వరినాట్ల కోసం నీరు విడుదల చేస్తామని చెప్పారు. దీనిలో భాగంగానే ఇరిగేషన్ శాఖ ఆదేశాలతో డొంకరాయి మెయిన్ డ్యామ్ నుంచి 2వేల క్యూసెక్కులు, ఏవీపీ డ్యామ్ నుంచి మరో 700 క్యూసెక్కులు నీటిని నేరుగా గోదావరి డెల్టాకు పంపిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 2,700 క్యూసెక్కులు చొప్పున ఈ నెల 29వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 5వ తేదీన డొంకరాయి పవర్ కెనాల్ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి మరింత ఎక్కువగా నీటిని విడుదల చేస్తామని వివరించారు. బలిమెల రిజర్వాయర్, సీలేరు కాంప్లెక్స్ రిజర్వాయర్ కలిపి మొత్తం 43.33 టీఎంసీల నీరు ఉందని, మార్చి వరకు గోదావరి డెల్టాకు 40 టీఎంసీలు ఇచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

అధికార భాషా సంఘం సభ్యుడిగా 'గాజులపల్లి'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం సభ్యుడిగా గాజులపల్లి రామచంద్రారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అధికారిక కార్యకలాపాల నిమిత్తం తెలుగును పరిపాలనలో భాగస్వామ్యం చేసేలా అధ్యక్షుడితో కలిసి పని చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

సీహెచ్‌వో, ఏఎన్ఎంలు గ్రామసభల్లో పాల్గొని వైద్య సేవలను వివరించాలని ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలకు అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరూ తమ సొంత ఊరిలోనే మెరుగైన వైద్యం పొందడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం గ్రామసభలను వేదికలుగా మలుచుకోవాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను చేరువచేయడం కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నెలకొల్పింది. వీటిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ క్లినిక్స్‌లో 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. టెలీ మెడిసిన్ సదుపాయం కూడా ఉంది. ఈ సేవలతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడం, మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను సీహెచ్‌వో, ఏఎన్ఎంలకు వైద్యశాఖ అప్పగించింది. ఈ మేరకు ప్రతి సీహెచ్‌వో, ఏఎన్ఎం గ్రామసభలకు హాజరై వైద్యసేవలు, మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సామాన్యులకు చేరువగా 'ఎంఎస్ఎంఈ' సేవలు


ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలను గ్రామీణ స్థాయిలో సామాన్య ప్రజలకు చేరువచేశామని కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు 12వ సమావేశం చైర్మన్ వంక రవీంద్రనాథ్ అధ్యక్షతన విజయవాడలోని కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బోర్డు చేపట్టిన చర్యల ఫలితంగా ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ కల్పిస్తున్న సదుపాయాలను వేలాది మంది వినియోగించుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈలకు రాయితీ(ఇన్సెంటివ్స్)లను ఫిబ్రవరిలో సీఎం వైఎస్ జగన్ విడుదల చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ బోర్డు డైరెక్టర్లను జిల్లా ప్రణాళికా కార్యక్రమాలలో పాల్గొనేందుకు కలెక్టర్లకు శాఖాపరమైన ఆదేశాలు ఇవ్వాలని రవీంద్రనాథ్ సూచించగా, ఇందుకు ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సృజన అంగీకరించారు. ఈ సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో పది మంది డైరెక్టర్లు, సలహాదారు అవుతు శ్రీధర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రూ.635.21 కోట్లతో అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ

టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన జలవనరుల శాఖ

- పనుల పూర్తికి రెండేళ్ల గడువు
- జనవరి 10లోగా షెడ్యూలు దాఖలుకు అవకాశం
- 17న ఆర్థిక బిడ్.. అదే రోజున రివర్స్ టెండరింగ్
- తక్కువ ధరకు కోట్‌చేసిన సంస్థకు పనుల అప్పగింత



అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి, అమరావతి: గతేడాది నవంబర్ 19న చెయ్యేరుకు వచ్చిన ఆకస్మిక భారీ వరదలకు దెబ్బతిన్న అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించే పనులకు రూ.635.21 కోట్ల అంచనాతో జలవనరులశాఖ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. లంప్సమ్-ఓపెన్ విధానంలో రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తిచేయాలని షరతు విధించింది. జనవరి 10వ తేదీలోగా టెండర్‌లో పాల్గొనేందుకు షెడ్యూలు దాఖలు చేయడానికి అవకాశం కల్పించింది. ఆర్థిక బిడ్‌ను జనవరి 17న ఉదయం 11 గంటలకు తెరిచి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తారు. తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థకు టెండర్ అప్పగించాలని స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ (ఎస్.ఎల్.టి.సి.)కి ప్రతిపాదనలు పంపుతారు. కాంట్రాక్టు సంస్థ అర్హతలను మరోసారి పరిశీలించి, నిబంధనల ప్రకారం టెండర్‌ను ఎస్.ఎల్.టి.సి. ఆమోదిస్తుంది. తర్వాత కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగిస్తూ జలవనరుల శాఖ ఒప్పందం చేసుకుంటుంది.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో

అన్నమయ్య జిల్లాలో రాజంపేట మండలంలోని బాదనగడ్డ వద్ద చెయ్యేరుపై దెబ్బతిన్న అన్నమయ్య ప్రాజెక్టును 2.24 టీఎంసీల సామర్థ్యంతో పునరుద్ధరించేలా పనులను కాంట్రాక్టు సంస్థ చేపడుతుంది. చెయ్యేరుకు భారీ వరద వచ్చినా చెక్కుచెదరకుండా నిలబడేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపట్టింది.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఒక రెగ్యులేషన్ ఇచ్చింది. రాష్ట్రంలో ముందుగా 18.56 లక్షల వ్యవసాయ, హైవాల్యూ.. అంటే నెలకు 500 యూనిట్లు పైన విద్యుత్ వినియోగం ఉన్న 27.68 లక్షల సర్వీసులకు స్మార్ట్‌మీటర్లు అమర్చాలని ప్రభుత్వం అదే ఏడాది నిర్ణయించింది. అలాగే. వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టాలని 2020లో డిస్కంలకు ఆదేశాలు జారీచేసింది. టెండర్ల కోసం దేశమంతా ఒకే నిబంధనలతో ఒక డాక్యుమెంట్‌ను కేంద్రమే రూపొందించింది. దాని ప్రకారం టెండర్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. పైగా.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా టెండర్ డాక్యుమెంట్‌ను న్యాయ సమీక్షకు పంపించి అక్కడ నుంచి అనుమతి వచ్చాక మాత్రమే టెండర్ల ఖరారు జరుగుతుంది. మరోవైపు.. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ ఓపెన్‌గానే ఉంది. ఐఆర్‌డీఏ, బ్లూటూత్, స్మార్ట్, రేడియో ఫ్రీక్వెన్సీ మీటర్లను ఆయా ప్రాంతాల్లో వెసులుబాటులను బట్టి ఏర్పాటుచేసేలా టెండర్లు రూపొందించాం. ఎవరైనా ఈ టెండర్లలో పాల్గొనవచ్చు. ఏ ఒక్క సంస్థకో ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం ఎక్కడా జరగడంలేదు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మీటర్ ఒక్కటే పెట్టడంతో సరిపెట్టకుండా రైతుల ప్రాణ రక్షణ బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకుంది. అందుకు అవసరమైన పరికరాలను (అలైడ్ మెటీరియల్) ఆర్థికంగా భారమైనా మీటర్లతో పాటు ఏర్పాటుచేయనున్నాం. మిగతా రాష్ట్రాల్లో కేవలం మీటర్లే ఇస్తున్నారు. మన దగ్గర స్మార్ట్‌మీటర్‌తో పాటు మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీబీ)తో కూడిన ఫ్యూజ్‌బాక్స్‌నూ అందిస్తున్నాం. పట్టుకున్నా షాక్ కొట్టని బాక్స్‌ను అందిస్తున్నాం. ఇప్పుడున్నట్లు మూడు ఫ్యూజులు ఉండవు. మోటార్లు కాలిపోయే అవకాశం ఉండదు. అలాగే, ఎర్తింగ్ రాడ్‌ను కూడా ఏర్పాటుచేస్తాం.

గ్రిడ్‌పై లోడ్ పడకుండా జాగ్రత్త పడొచ్చు

ఇక ప్రస్తుతం గ్రామాల్లో పొలాల మధ్య ఉండే వ్యవసాయ మీటర్ వద్దకు వెళ్లి రీడింగ్ నమోదు చేయడం శ్రమతో కూడుకున్నది కావడంతో ఎవరూ ముందుకు రావడంలేదు. పూర్తి ఆధునిక సాంకేతికతతో స్మార్ట్‌మీటర్లను ఇస్తున్నాం. అలాగే..

- ➡ వీటి ద్వారా మోటార్ ఆన్, ఆఫ్ చెయ్యొచ్చు. పొలానికి వెళ్లి మోటారు స్విచ్చాన్ చేయాల్సిన అవసరం ఉండదు.
- ➡ భవిష్యత్‌లో గ్రిడ్‌పై పడే లోడ్‌ను మ్యానేజ్ చేయాలంటే స్మార్ట్‌మీటర్ల ద్వారానే వీలవుతుంది.
- ➡ అదే విధంగా ఎప్పటికప్పుడు లోడ్‌ను మానిటర్ చేస్తూ గ్రిడ్‌పై లోడ్ పడకుండా జాగ్రత్తపడొచ్చు.
- ➡ తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా కాపాడుకోవచ్చు.
- ➡ పైగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌పై రెండు, మూడు సర్వీసులుంటే అన్ని సర్వీసులకూ ఒకే విధమైన వినియోగం జరగదు. అందరిదీ కలిపి ఒకే రీడింగ్ చూపిస్తుంది. దీనివల్ల రైతులకు నష్టం కలుగుతుంది.

పైలట్ ప్రాజెక్టుతో సత్ఫలితాలు

మరోవైపు.. స్మార్ట్ మీటర్లపై శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలిచ్చింది. ప్రయాస్ అనే సంస్థ 20 శాతం విద్యుత్ ఆదా అయినట్లు తేల్చింది. మేం అన్ని సర్వీసులపైనా అధ్యయనం చేశాం. 33 శాతం విద్యుత్ ఆదా కనిపించింది. ఇక రాష్ట్రంలో 12 వేల మిలియన్ యూనిట్లు వ్యవసాయానికి వాడుతున్నారు. ఇందులో 20 శాతమే ఆదా అనుకుంటే రూ.1,900 కోట్లు, 33 శాతం అయితే రూ.3,600 కోట్లు మిగులుతాయి. మీటర్లు పెట్టడానికి రూ.4 వేల కోట్లు ఖర్చవుతోంది. అంటే పెట్టిన పెట్టుబడి ఒకటి, రెండేళ్లలోనే వచ్చేస్తుంది. ఈ ఫలితాల ఆధారంగానే స్మార్ట్ మీటర్లపై ముందుకెళ్తున్నాం. రాష్ట్రంలో 99 శాతం మంది రైతులు కూడా ఇప్పటికే తమ అంగీకారాన్ని తెలిపారు.

టీడీపీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక

- విజయవాడలో వివిధ పార్టీలు, సంఘాల సమావేశం
- వైఎస్సార్‌సీపీ పాలనపై సుప్రీంకోర్టు సీజేకి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం
- భేటీకి హాజరైన జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆప్ తదితర పార్టీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అఖిలపక్ష పార్టీలు, వివిధ సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని ఒక హోటల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీ పాలనపై భారత ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ బాధితులకు రక్షణగా ఈ వేదిక నిలుస్తుందన్నారు. ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాల్ని ఈ వేదిక ద్వారా నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎవరి ఆలోచనల ప్రకారం వారు ముందుకు వెళ్లొచ్చన్నారు. ఇకపై రాష్ట్రంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ఈ వేదిక ద్వారా వారికి అండగా నిలబడాలన్నారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే అందరం రాష్ట్రం వదిలిపోవాల్సిందేనని హెచ్చరించారు. మాచర్ల సహా పల్నాడులో ఉన్న పరిస్థితుల్ని పరిశీలించడానికి వేదిక తరఫున పర్యటిద్దామని కోరారు. ఈ మూడేళ్లలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని ప్రజలు కోల్పోయారన్నారు. ఈ సమావేశంలో జనసేన నేత కందుల దుర్గేష్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేత నరహరిశెట్టి నరసింహారావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆప్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, నవతరం పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీకి షాక్ ఇచ్చిన బీజేపీ

వచ్చే ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి దగ్గర కావడానికి టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని ప్రయత్నాలు చేస్తున్నా... బీజేపీ మాత్రం దూరం దూరంగానే వ్యవహరిస్తోంది. తాజాగా టీడీపీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఆ పార్టీ ఝలక్ ఇచ్చింది. ఈ భేటీకి బీజేపీ తరఫున ఎవరూ హాజరుకాలేదు. టీడీపీ పెద్దలు అఖిలపక్ష భేటీ విషయం ముందుగానే బీజేపీ రాష్ట్ర నేతలకు తెలియజేశారు. అంతేకాకుండా మంగళవారం ఉదయం నుంచి బీజేపీ నుంచి ఎవరో ఒక ప్రతినిధిని సమావేశానికి పంపాలంటూ తమ పార్టీ పెద్దలకు పదేపదే తెలుగుదేశం నేతలు ఫోన్లు చేసినట్టు బీజేపీ వర్గాలు వివరించాయి. అయితే, ఇటీవల రాష్ట్రంలో సొంతగా ఎదగాలనే విషయంపైనే బీజేపీ దృష్టి పెట్టింది. దీంతో టీడీపీ నిర్వహించిన సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయం తీసుకున్నట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

ప్రజలంతా జగన్ వెంట.. దొంగలంతా బాబు కిందకు..

- చంద్రబాబు అండ్ కోది కమ్యూనల్ టెర్రరిజం
- నిన్నటి కాపునాడు, నేటి అఖిలపక్షం అన్నీ బాబు ప్రాయోజిత కార్యక్రమాలే
- పాత సినిమాల్లో రాజనాల, ముక్కామలలాగా కుట్రలు చేస్తున్నారు
- నారాయణ, రామకృష్ణల్లో అసలు కమ్యూనిజం ఉందా?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ధ్వజం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంట ఉంటే.. దొంగలంతా ప్రతిపక్ష నేత చంద్రబాబు కిందకు చేరారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతలకు వాక్ స్వాతంత్ర్యం లేకపోతే మూడున్నరేళ్లుగా సీఎం జగన్‌పై ఇష్టమొచ్చినట్టు ఎలా మాట్లాడుతున్నారని నిలదీశారు. వారు మాట్లాడే భాష సభ్య సమాజం ఒప్పుకునే భాషేనా అని ప్రశ్నించారు. పైగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలు వాక్ స్వాతంత్ర్యం కోల్పోయారని అచ్చెన్నాయుడు వగలాడి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విజయవాడలో ఒక హోటల్లో చంద్రబాబు అంటే వల్లమాలిన ప్రేమ ఉన్న కొంతమంది వ్యక్తులు సమావేశమయ్యారని నాని ఎద్దేవా చేశారు. 'స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం.. సేవ్ డెమోక్రసీ' అంటూ కారుకూతలు కూశారని నిప్పులు చెరిగారు. చంద్రబాబుకు 70 ఏళ్లు దాటాయని.. అందుకే పాత సినిమాల్లో రాజనాల, ముక్కామల మాదిరి కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది..

చంద్రబాబును సీఎంను చేయాలని అనుకుంటున్న ఎల్లో టెర్రరిజం బ్యాచే విజయవాడలో అఖిలపక్షం పేరుతో సమావేశమైంది. వీరంతా వాక్ స్వాతంత్ర్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది. చంద్రబాబు అండ్ కోది కమ్యూనల్ టెర్రరిజం. ఇప్పటికైనా ముసుగు తీసేసి చంద్రబాబు కోసం పనిచేస్తున్నామని ఎల్లో బ్యాచ్ చెప్పాలి. నిన్నటి కాపునాడు, నేటి అఖిలపక్షం అన్నీ బాబు ప్రాయోజిత కార్యక్రమాలే. సీఎం జగన్‌కి ఓట్లేసి ప్రజలు తప్పుచేశారనే భావన ఈ ఎల్లో నేతలకు ఉంటే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఎందుకు పారిపోయిందో సమాధానం చెప్పాలి.

కమ్యూనిస్టులమని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి

సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదంటారు.. అసలు వారిలో కమ్యూనిజం ఉందా? కమ్యూనిస్టులు సింగపూర్ లాంటి సిటీ కావాలని కోరుకోరు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు, రెండు పూటలా భోజనం కావాలని నిజమైన కమ్యూనిస్టులు కోరుకుంటారు. సీఎం వైఎస్ జగన్ 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ నేతలు శభాష్ అంటూ ఒక్క రోజైన్నా మాట్లాడారా? అమరావతి ప్రాంతంలో 54 వేల మంది పేదలకి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే.. ఇవ్వవద్దనే వారికి కొమ్ముకాస్తున్నందుకు సిగ్గుపడాలి. నారాయణ, రామకృష్ణను చూసి నిజమైన కమ్యూనిస్టులు కన్నీరు కారుస్తారు. ఈ ఇద్దరు కమ్యూనిస్టు పార్టీని చంద్రబాబుకు తాకట్టు పెట్టారు.

ఎన్టీఆర్ పట్ల చేసిన పాపాలే బాబుకు శాపాలు..

అధికారంలో లేనప్పుడు చంద్రబాబు కుహనా మేధావుల్ని వాడుకుంటున్నారు. ఈ సమావేశానికి హాజరైనవారిలో జడ శ్రావణ్‌కుమార్‌కి రాజకీయ పార్టీ ఉందట. అలాగే లక్ష్మణరెడ్డి అనే గోడలు దూకే వ్యక్తి ఉన్నారు. వీరు ప్రజాస్వామ్యం, ప్రజల గురించి నీతులు మాట్లాడుతున్నారు. ఇవన్నీ చంద్రబాబు డ్రామాలు. ఎన్టీఆర్ పట్ల చేసిన పాపాలు శాపాలై చంద్రబాబును చుట్టుకున్నాయి. వాటిని చంద్రబాబు అనుభవించక తప్పదు. భవిష్యత్తులో కుప్పంలో కూడా గెలుస్తానో, లేదో అనే అనుమానంతో అక్కడ ఇల్లు కట్టుకోవాలనే భయం కలిగింది. ఆ భయం సీఎం జగన్ వల్లే వచ్చింది. తప్పుడు సంతకాలతో ఇప్పటంలో పవన్‌కళ్యాణ్ ప్రజలను కష్టాల్లోకి నెట్టాడు. కోర్టుకు రూ.లక్ష చొప్పున జరిమానాను కూడా కట్టడం లేదట. అదన్నా కట్టి ఇప్పటం ప్రజలను ఆదుకోవాలి. ప్రతివారం సీఎం జగన్‌ను తిట్టడానికి ఒక అడ్డగాడిద రాష్ట్రానికి వచ్చిపోతోంది. మరి ఈ వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం ఎక్కడి నుంచి వచ్చింది? సినిమా సెటైర్లు రాసిచ్చారని.. ఏది పడితే అది మాట్లాడటం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం పడని నెల ఒక్కటైనా ఉందా? ఎవరికి జీతం పడలేదో చెప్పాలి. ప్రతి నెలా ఠంచనుగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడుతున్నాయి.

టీడీపీ తప్పులు, అప్పుల వల్లే తిప్పలు

- యనమలా మీది కునుకుపాటా? 'ఉనికి'కి పాట్లా?
- 58 ఏళ్లలో చేసిన అప్పుకంటే టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసింది 124 శాతం ఎక్కువ
- రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసిన తప్పులు, అప్పుల వల్లే నేటికీ ఆంధ్రప్రదేశ్ తిప్పలు పడాల్సి వస్తోందని రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. టీడీపీ నాయకుడు, ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అప్పులపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యనమలా మీది కునుకుపాటా? 'ఉనికి'కి పాట్లా అని ప్రశ్నించారు. అప్పులపై మీ 'అంచనా'లు తలకిందులైనా అసత్య ప్రచారం ఆపరా.. అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలపై మంగళవారం ఒక ప్రకటనలో బుగ్గన మండిపడ్డారు. 2021–22 సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం ద్రవ్యలోటు పరిమితి 4.5 శాతం కాగా.. కోవిడ్ విధి వైపరీత్యంలోనూ వైసీపీ ప్రభుత్వం కేవలం 2.1 శాతమే అప్పు చేసిందని తెలిపారు. మొత్తం రూ.1,85,000 కోట్లు డీబీటీ పద్ధతిలో ప్రజలకు సాయం చేశామని, అందులో రూ.1,35,000 కోట్లు.. అంటే 73 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకేనని, వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఉన్నంత వరకు రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు ఏ ఇబ్బందీ రాదని బుగ్గన స్పష్టం చేశారు.

ప్రతిపక్షాలది పూటకో మాట

'ఆంధ్రప్రదేశ్ అప్పులు, ఆర్థిక నిర్వహణపై ప్రతిపక్షాలది పూటకో మాట. అప్పులపై యనమల లెక్కలన్నీ తప్పులే. తొలుత రూ. 8 లక్షల కోట్లు అన్నారు. మేము అవగాహన కల్పించాక రూ.6.38 లక్షల కోట్లు అన్నారు. అంటే రూ.2 లక్షల కోట్లు తగ్గించారు. మీ అప్పులు, వాటికి వడ్డీలు కడుతూనే, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ప్రవాహంపైనా మీ ఈర్ష్య, ద్వేషం? 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.1,20,556 కోట్లు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పు రూ.2,69,462 కోట్లు. 58 సంవత్సరాల్లో చేసిన అప్పుకంటే మీ ఐదేళ్లలో చేసింది 124 శాతం ఎక్కువ. మీరు చేసిన అప్పులను చక్కదిద్దుతూ, పేరుకుపోయిన బకాయిలను కూడా మా ప్రభుత్వంలో చెల్లిస్తున్నాం. అయినా 2022 మార్చి నాటికి వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 3,82,165 కోట్లు. సీఎం వైఎస్ జగన్‌ది అప్పుల ఘనత కాదు... ఆర్థిక నిర్వహణలో సమర్థత. మా ప్రభుత్వం అన్ని కార్పొరేషన్ల రుణాల వివరాలు బడ్జెట్ డాక్యుమెంట్లతో సహా ఇచ్చింది. ప్రతి విషయం కాగ్‌కి తెలుసు. దాపరికాలు లేవు' అని బుగ్గన తెలిపారు.



ఏమీ లేకపోవడం, అది ఎంత ఆనందప్రదం! జ్ఞానోదయం అయినవారు ఏమీలేనివారు. ఏదో ఉన్నవారు, తన మనసులో మనుష్యుల సంకెళ్లు ఉన్నవారు పడే వేదన చూడండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, డిసెంబర్, 28

శాంతి మంత్రం - సమర శంఖం

లాగే కొద్దీ ముడి బిగుసుకుంటుంది. ఉక్రెయిన్‌పై రష్యా మొదలుపెట్టిన యుద్ధం ఇప్పుడు అలాగే తయారైంది. మరికొద్ది రోజుల్లో ఏడాది మారిపోయి, రెండో క్యాలెండర్ సంవత్సరంలోకి ఈ సంక్షోభం అడుగుపెడుతోంది. ఇప్పటికీ పరిష్కారం కనిపించడం లేదు. ఇరు దేశాధినేతలూ ఒకరోజు శాంతి మంత్రం పఠిస్తున్నారు. ఆ వెంటనే సమర శంఖం పూరిస్తున్నారు. చర్చలకు సిద్ధమని రష్యా అధినేత పుతిన్ ఆదివారం అన్నారో లేదో, మర్నాడే మాస్కో ప్రతిపాదనలకు అంగీకరిస్తే సరే... లేదంటే ఈ వ్యవహారాన్ని తమ సైన్యం తేలుస్తుందంటూ రష్యా విదేశాంగ మంత్రి హూంకరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం శాంతికి సిద్ధమంటూనే, అగ్రరాజ్యాల నుంచి ఆయుధాల సమీకరణకు తిరుగుతున్నారు. ఇటు రష్యా మంకుపట్టు, అటు పాశ్చాత్య దేశాల అండతో ఉక్రెయిన్ దుస్సాహసం – వెరసి ప్రపంచానికి పీటముడిగా మారింది.

ఇటీవలే అమెరికా అధ్యక్షుణ్ణి కలిసొచ్చిన జెలెన్‌స్కీ సోమవారం భారత ప్రధానికి చేసిన ఫోన్ ఆసక్తి రేపింది. నవంబర్‌లో బాలిలో జీ20 సదస్సులోనే ఆయన 'శాంతికి సూత్రాలు' అంటూ 10 అంశాలు ముందుకు తెచ్చారు. ఆ దశసూత్ర ప్రణాళికను అమలు చేయాలంటూ డిసెంబర్ 1 నుంచి ఏడాది కాలానికి జీ20కి అధ్యక్ష హోదా దక్కిన భారత్‌ను తాజా ఫోన్‌కాల్‌లో అభ్యర్థించారు. అణ్వస్త్రాల నుంచి రక్షణ, ఆహార భద్రత, ఖైదీల విడుదల, ఐరాస నిబంధనావళి అమలు, రష్యా సైన్యాల ఉపసంహరణ – ఇలా పది అంశాల సమాహారం ఆయన శాంతి ప్రణాళిక. వచ్చే 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జీ20 సదస్సు జరగాలి. దానికి అజెండాను సిద్ధం చేస్తూ, వివిధ దేశాలతో భారత్ సంప్రతిస్తున్న నేపథ్యంలో జెలెన్‌స్కీ శాంతిస్థాపన బాధ్యతను భారత భుజంమీదికి నెట్టారు.

నిన్నటిదాకా జీ20కి సారథ్యం వహించిన ఇండోనేసియా అధ్యక్షుడు మాస్కో, కీవ్‌లకు వెళ్ళి మాట్లాడారు. కానీ, ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడలేదు. ఇప్పుడు జీ20 పగ్గాలు పట్టిన భారత్, మిత్రదేశం రష్యాతో తనకున్న సుదీర్ఘ స్నేహసంబంధాల రీత్యా ఏదన్నా ఇంద్రజాలం చేయగలదా? యుద్ధానికి ముగింపు పలకగలదా? జీ20 సారథ్యానికి సంతసిస్తున్న భారత్‌కు ఉక్రెయిన్ అభ్యర్థనలో తప్పు లేదు. అయితే, రష్యా సహా అందరికీ ఆ శాంతి ప్రణాళిక ఆమోదయోగ్యమేనా అన్నది ప్రశ్న. ఏకపక్ష, నామమాత్ర ప్రతిపాదనలతో ప్రయోజనం లేదు. అలాగే, జీ20 అధ్యక్ష హోదాలో ఉన్నా అంతా భారత్ నిర్ణయమే ఉండదు. పైగా, ఆహార, ఇంధన భద్రతపై వర్ధమాన దేశాలకున్న ఆందోళనలపై గళం విప్పడమే ఆ వేదిక కీలకప్రాధాన్యాలు. అదే మోదీ గుర్తు చేయాల్సొచ్చింది.


ఎప్పటిలానే భారత్ సైతం రష్యా, ఉక్రెయిన్‌లు శత్రుత్వాలను తక్షణం విడిచి, చర్చలకు దిగాలనీ, దౌత్య విధానంలో అభిప్రాయ భేదాలకు దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనాలనీ హితవు పలికింది. శాంతి చర్చలకు అండగా ఉంటాననీ, దెబ్బతిన్న సామాన్య ప్రజలకు మానవతా సహాయం కొనసాగిస్తాననీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 4న జెలెన్‌స్కీకి ఫోన్‌లో ఇచ్చిన అవే హామీలను మోదీ పునరుద్ఘాటించారు. రష్యాతో స్నేహాన్ని వదులుకోవడం కానీ, అమెరికాను మరీ దూరం పెట్టడం కానీ ఏదీ వ్యూహాత్మకంగా భారత్‌కు సరి కాదు. అందుకే, సమతూకపు మాటలతో కత్తి మీద సాము చేస్తున్నాం. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని నేటికీ ఖండించకున్నా, చర్చలే పరిష్కారమన్న మాటను పదే పదే వల్లె వేస్తున్నాం. ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన 20 దేశాల జీ20 అధ్యక్ష పీఠం భారత్‌కు రావడంతో ఇప్పుడు సాముగరడీ సంక్లిష్టమైంది.

యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత్ తటస్థ వైఖరినే అవలంబిస్తోంది. ప్రపంచవ్యాప్త ఆహార, ఇంధన కొరతల వేళ దౌత్య మార్గంతోనే కథ సుఖాంతమవుతుందని చెబుతోంది. ఇంధన కొరతతో తాము ఇరుకునపడితే, చిరకాల మిత్రుడైన రష్యా నుంచి తగ్గింపు ధరకే భారత్ చమురు దిగుమతి నచ్చని పాశ్చాత్య దేశాలు విమర్శలకు దిగుతున్నాయి. భారత్ మటుకు దేశ ప్రజల అవసరాలే తనకు ప్రాథమ్యమంటోంది. ఎవరెన్ని ప్రవచనాలు, ప్రణాళికలు చెప్పినా ముందుగా ఇరుపక్షాల సందేహాలు వదిలించి, శాంతి చర్చలకు రప్పించడం కీలకం. రష్యా దురాక్రమణ తప్పే. ఉక్రెయిన్ కష్టం, నష్టం నిజమే. కానీ, సోవియట్ విచ్ఛిత్తి తర్వాత ఆడిన మాట తప్పి, తూర్పు ఐరోపా దేశాలను నాటోలో చేర్చుకొని, మాస్కోకు ముప్పు తెచ్చిన పాశ్చాత్య వైఖరీ సమర్థనీయం కాదు.

శాంతి నెలకొనాలంటే సొంత ప్రయోజనాల్ని పక్కనపెట్టక తప్పదు. ఉక్రెయిన్‌ను సైతం తమ కూటమిలో చేర్చుకోవాలని చూస్తున్న పాశ్చాత్య ప్రపంచం రష్యాకున్న భద్రతాపరమైన ఆందోళనల్ని తీరిస్తేనే శాంతి సాధనలో అడుగు ముందుకు పడుతుంది. రష్యా సైతం ఒకప్పటి తన యూనియన్‌లో భాగమైన ఉక్రెయిన్‌ను సమరాని కన్నా స్నేహంతో అక్కున చేర్చుకోవడం మేలు. ఇప్పటికే సైనికంగా, ప్రపంచంలో ఏకాకి అవుతూ ఆర్థికంగా దెబ్బతిన్న మాస్కో ఆధిక్యం సాధించడం కష్టమే. శీతకాలం మరిన్ని కష్టాలు తెస్తుంది. కీవ్‌కు కలిసొస్తుంది. కానీ, విద్యుత్ గ్రిడ్లు, నీటి సరఫరాలపై రష్యా దాడి చేస్తోంది. ఇప్పటికే లక్షలమంది కరెంట్ లేక కష్టపడుతున్నారు. అగ్ర రాజ్యపు అండతో, రానున్న కాలంలో రష్యా బలహీనపడుతుంది లెమ్మని ఎగిరిపడితే ఉక్రెయిన్‌కీ తీరని నష్టమే. వచ్చే 2023లో ఈ సుదీర్ఘ రాజకీయ, ఆర్థిక, సైనిక యుద్ధంలో మలుపులపై విశ్లేషకుల్లో ఎవరి అంచనా వారికుంది. చివరికిది అణ్వస్త్ర, మూడో ప్రపంచ యుద్ధానికీ దారి తీస్తుందనే ఆందోళనా ఉంది. ఇరు వైపులా సామాన్యులే నష్టపోయే సమరోత్సాహానికి స్వస్తి చెప్పి, శాంతి చర్చల్ని స్వాగతిస్తేనే మేలు!

న్యాయవ్యవస్థ స్వతంత్రతే పరమావధి

విశ్లేషణ



ఫిరోజ్ వరుణ్ గాంధీ

న్యాయవ్యవస్థకూ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య జరుగుతున్న చారిత్రక ఘర్షణ ఫలితంగా న్యాయవ్యవస్థ సామర్థ్యం క్షీణిస్తోంది. ప్రజాస్వామ్య ఆరోగ్యం కోసం న్యాయవ్యవస్థ స్వతంత్రత కొనసాగాలి. న్యాయవ్యవస్థ రాజకీయ భావజాలానికీ, ప్రజా ఒత్తిడికీ దూరంగా ఉండాలి. దాన్ని ప్రభుత్వ శాఖల నుంచి స్వతంత్రంగా ఉండేలా ప్రోత్సహించాలి. దీనికోసం న్యాయమూర్తులను నియమించే విశ్వసనీయ, పక్షపాత రహిత వ్యవస్థ అవసరం. కొలీజియం వ్యవస్థను కొనసాగిస్తూనే, జడ్జీలను నియమించే అధికారాన్ని కార్యనిర్వాహక వ్యవస్థకు ఇస్తూనే న్యాయమూర్తులను సిఫారసు చేయడానికి ఒక సెక్రటేరియట్‌ను బలోపేతం చేయవచ్చు. ప్రస్తుత న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ శాఖ, సామాన్యులు ఇందులో ప్రతినిధులుగా ఉండొచ్చు.

కేరళలోని ఎడ్నీర్ మఠం ఆస్తుల నిర్వహణ విషయంలో మఠంపై నిబంధనలు విధించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను సవాలు చేస్తూ మఠాధిపతి స్వామి కేశవానంద భారతి 1970 ఫిబ్రవరిలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 20 కింద సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. మూడేళ్ల తర్వాత సుప్రీంకోర్టు 7–6 మెజారిటీతో రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతాన్ని వివరిస్తూ, రాజ్యాంగ కీలక సూత్రాలను, స్వరూపాన్ని సవరించడంలో పార్లమెంట్‌కు ఉన్న పరిమితులను నొక్కిచెప్పింది.

అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు సుప్రీంకోర్టును కూడా నూతన న్యాయమూర్తుల బృందంతో నింపారు. ఆయన కంటే ముగ్గురు సీనియర్ జడ్జీలను పక్కకునెట్టి ఏఎన్ రాయ్‌ని ప్రధాన న్యాయమూర్తిగా రాష్ట్రపతి నియమించారు. కేశవానంద కేసు తీర్పుపై సంతకం చేయని ఆ ఒక్క న్యాయమూర్తి ఈయనే. ఈయన నేతృత్వంలో 13 మంది న్యాయమూర్తుల బెంచ్ నాటి చారిత్రాత్మక తీర్పును తిరగదోడింది. కేసును రెండు రోజులపాటు విచారించింది. ఈ కేసుపై ఎలాంటి రివ్యూ పిటిషన్‌ని దాఖలు చేయలేదనీ, మౌఖిక అభ్యర్థన ప్రాతిపదికగా తప్పు ప్రక్రియతో ఈ కేసును సమీక్షించారనీ త్వరలోనే గుర్తించారు. దాంతో బెంచ్ మొత్తాన్నీ రద్దు చేయాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత చూపే న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ ఆనాడు రాజ్యాంగ ప్రాథమిక స్వరూపం బతికి బట్టకట్టింది. ఈ చారిత్రాత్మక తీర్పు నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యానికి సమతుల్యతను కలిగించడంలో తోడ్పడింది.

కొంతకాలంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (2), 217 (1)లను వ్యాఖ్యానించడంలో కేంద్రప్రభుత్వానికీ, న్యాయవ్యవస్థకూ మధ్య ఘర్షణ కొనసాగుతోంది. ఆర్టికల్ 124(2) ప్రకారం సుప్రీంకోర్టుకు సంబంధించిన ప్రతి న్యాయమూర్తినీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు (ప్రత్యేకించి చీఫ్ జస్టిస్), రాష్ట్రాల్లోని హైకోర్టు న్యాయమూర్తులతో చర్చించి రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో, రాష్ట్ర గవర్నర్‌తో, హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో సంప్రదించిన తర్వాత రాష్ట్రపతి నియమిస్తారని ఆర్టికల్ 217 (1) నొక్కి చెబుతుంది. ఎస్పీ గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1981)లో న్యాయపరమైన భాష్యం కానీ, సుప్రీంకోర్టు రికార్డ్ అడ్వకేట్స్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (రెండో జడ్జీల కేసు) (1993) కానీ, ఆర్టికల్ 143(1) ... వర్సెస్ అనామక (మూడో జడ్జీల అభిప్రాయం) (1998) వంటివి కానీ... న్యాయమూర్తుల స్వాతంత్ర్య సూత్రాన్ని మరింతగా ముందుకు తీసుకుపోయాయి. న్యాయమూర్తులను సిఫారసు చేసే కొలీజియం వ్యవస్థకు దారి తీశాయి.

ప్రస్తుతం, కేంద్ర ప్రభుత్వం కొలీజియం వ్యవస్థ సిఫార్సులను ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు– కానీ కొలీజియం రెండోసారి కూడా ఆ సిఫార్సులను చేస్తే ప్రభుత్వం తప్పకుండా



ఆమోదించాల్సి ఉంటుంది. ఇటీవలే ఈ ఏకాభిప్రాయం స్తంభనకు దారి తీసింది. నవంబర్ 12న కొలీజియం తిరిగి సిఫార్సు చేసిన ప్రతిపాదనలను కేంద్రం నిలిపివుంచింది. దీంతో సెకండ్ జడ్జీల కేసులో విధించిన కాలక్రమాన్ని పాటించనందుకు సుప్రీంకోర్టు కేంద్రాన్ని నిలదీసింది. ఖాళీలను పూరించడానికి నిర్దిష్ట సమయాన్ని సూచించనందుకు న్యాయ శాఖ పట్ల న్యాయ, పర్సనల్ వ్యవహారాలపై స్టాండింగ్ పార్లమెంటరీ కమిటీ కూడా తన అసంతృప్తిని వెళ్లగక్కింది.

స్వతంత్ర న్యాయవ్యవస్థకూ, మితిమీరి వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికీ మధ్య జరుగుతున్న ఈ చారిత్రక ఘర్షణ ఫలితంగా భారత న్యాయవ్యవస్థ సామర్థ్యం క్షీణిస్తోంది. 2022 ఆగస్టులో సుప్రీం కోర్టులో మొత్తం 34కి గానూ 3 ఖాళీలు, హైకోర్టుల్లో 1,108 ఖాళీలకు గానూ 381, దిగువ కోర్టుల్లో 24,631 జడ్జి పదవులకుగానూ 5,342 ఖాళీలు ఉన్నాయి. అంటే 20 శాతం మేర ఖాళీలు ఉన్నాయి. బాంబే, పంజాబ్–హరియాణా, కలకత్తా, పట్నా, రాజస్థాన్ హైకోర్టుల్లో ఇలాంటి ఖాళీలు న్యాయవ్యవస్థ సామర్థ్యంపై ప్రభావం చూపుతాయి. (2022 ఆగస్టు నాటికి నాలుగు కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయి).

న్యాయవ్యవస్థలో సంస్కరణలు దీర్ఘకాలం పెండింగులో ఉండటం నిజమే కావచ్చు. రాజకీయ సంస్థల చేత జడ్జీల నియామకాలు జరుగుతున్న దేశాలను చూడండి. ఇటలీలో రాజ్యాంగబద్ధ న్యాయస్థానం నియామకాలకు అధ్యక్షుడు, లెజిస్లేచర్, సుప్రీంకోర్టు ఇలా ప్రతి సంస్థా అయిదుగురు జడ్జీలను నామినేట్ చేయడానికి అనుమతిస్తారు. అమెరికాలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులను శాశ్వత ప్రాతిపదికన అధ్యక్షుడు నామినేట్ చేస్తారు. తర్వాత సెనేట్ మెజారిటీ ద్వారా ఆమోదిస్తుంది. సహజంగానే ఇది పక్షపాత న్యాయవ్యవస్థకు దారితీస్తుంది. న్యాయవ్యవస్థ పారదర్శకతను మెరుగుపర్చడానికి న్యాయమూర్తుల ఎన్నికలు కూడా ఉపయోగపడతాయి. అమెరికాలోని అనేక రాష్ట్రాలు రాష్ట్ర సుప్రీంకోర్టుల న్యాయ నియామకాల కోసం ఎన్నికలను ఉపయోగించుకుంటున్నాయి. అయితే ఇవి ప్రజాకర్షక తీర్పులు ఇచ్చేలా న్యాయమూర్తులను ప్రోత్సహిస్తాయి. సంకీర్ణ ప్రభుత్వ ధోరణి కలిగిన ఏ ప్రజాస్వామ్యానికైనా ఇది మంచిది కాదు.

ఇతర దేశాలు న్యాయ కౌన్సిల్స్‌తో ప్రయోగాలు చేస్తాయి. ఇరాక్‌లో జడ్జీలందరూ ఒక న్యాయ సంస్థలో పట్టభద్రులై ఉంటారు. దరఖాస్తుదారులందరూ రాత, మౌఖిక పరీక్షల్లో పాల్గొంటారు. జడ్జీల ప్యానెల్‌తో ఇంటర్వ్యూలో పాల్గొంటారు. జపాన్‌లో సుప్రీంకోర్టు సెక్రటేరియట్ శిక్షణ, ప్రమోషన్లతోపాటు దిగువ స్థాయి న్యాయ నియామకాలను నియంత్రిస్తుంటుంది. ఇటీవలే, కేంద్రప్రభుత్వం న్యాయ కమిషన్ ద్వారా న్యాయమూర్తుల నియామకాలు చేపట్టాలని ప్రతిపాదించింది (జాతీయ న్యాయమూర్తుల నియామకాల కమిషన్ బిల్లు, 2014). 2015 అక్టోబర్ 16న దీన్ని 4–1 మెజారిటీతో సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. అయితే కొలీజియం వ్యవస్థలో మరింత పారదర్శకతను కల్పించడాన్ని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. అదే సమయంలో న్యాయమూర్తుల నియామకానికి సాధికారిక సెక్రటేరియట్ అవసరమా అనే అంశంపై చర్చపెట్టింది. దీనిపై తదుపరి సంస్కరణలు చేయవచ్చు. కొలీజియం వ్యవస్థ కొనసాగుతుంది; నియమించే అధికారాన్ని కార్యనిర్వాహక వ్యవస్థకు కొనసాగిస్తూనే అభ్యర్థులను సిఫారసు చేయడానికి ఒక సెక్రటేరియట్‌ను బలోపేతం చేయవచ్చు. దీన్ని ప్రస్తుత న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ మంత్రిత్వ శాఖ, సామాన్యుల ప్రతినిధుల నుంచి నియమించవచ్చు. ఇది న్యాయ వ్యవస్థలో మన సమాజానికి గొప్ప ప్రాతినిధ్యాన్ని కల్పిస్తుంది. 2022 డిసెంబర్ నాటికి, సుప్రీంకోర్టులో ముగ్గురు మహిళలు, ఇద్దరు ఎస్సీ జడ్జీలు మాత్రమే ఉన్నారు.

న్యాయమూర్తుల నియామకాలకు అవతల, ఒక కొత్త అప్పీల్ కోర్టు ఉండాల్సిన అవసరం ఉంది. హైకోర్టుల్లో తీర్పులకు వ్యతిరేకంగా రెగ్యులర్ అప్పీల్ కోర్టుగా ఉండాలనే ఉద్దేశం సుప్రీంకోర్టుకు ఎన్నడూ లేదు. సుప్రీంకోర్టు బెయిల్ అప్లికేషన్లను వినకూడదు. దానికి బదులుగా లా కమిషన్ సిఫార్సు చేసినట్లుగా, ప్రముఖ మెట్రో నగరాల్లో బ్రాంచ్‌లు ఉన్న ఒక ఫెడరల్ అప్పీల్ కోర్టు ఉండాలి. ఈలోపు, సుప్రీంకోర్టు ఒక రాజ్యాంగ కోర్టు (రాజ్యాంగ సవరణ ద్వారా)లోకి పరివర్తన చెందాలి. ఇలా చేయడమంటే అత్యున్నత స్థాయిలో తక్కువ కేసులు (మాట వరసకు 50) మాత్రమే పెండింగులో ఉండేట్టు చూడటం! ఏ స్థాయిలో అయినా జడ్జీలందరికీ కచ్చితమైన రిటైర్మెంట్ వయసు (65 ఏళ్లు) విధించాలి. రిటైర్మెంట్ తర్వాత, ప్రభుత్వంలో పోస్టులకు నామినేట్ చేయడానికి నిర్దిష్టమైన గడువును విధించాలి.

భారతీయ ప్రజాస్వామ్య ఆరోగ్యం కోసం న్యాయవ్యవస్థ స్వతంత్రత అవశ్యం. దీన్ని సాధించడానికి న్యాయమూర్తులను నియమించే విశ్వసనీయమైన, పక్షపాత రహితమైన వ్యవస్థ అవసరం. వ్యక్తి స్థాయిలో, వ్యవస్థ స్థాయిలో న్యాయవ్యవస్థను ప్రభుత్వ శాఖల నుంచి స్వతంత్రంగా ఉండేలా ప్రోత్సహించాల్సి ఉంది.

వ్యాసకర్త లోక్‌సభలో బీజేపీ ఎంపీ
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పక్కకు పెడతారా?



కొత్తగా ప్రారంభించిన డిజిటల్ కరెన్సీ మీద గాంధీ చిత్రం లేనందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఇక ఇప్పుడు దయ చేసి కాగితం కరెన్సీ మీద కూడా ఆయన మూర్తిని తొలగించండి.

– తుషార్ గాంధీ, రచయిత

అందరితోనే లౌకికవాదం



విశేష సంఖ్యలో ముస్లింలు, హిందువులు సామాజిక మాధ్యమాల్లో తమ స్నేహితులకు 'మెర్రీ క్రిస్మస్' అని ఎందుకు చెప్పకూడదో రాశారు. ఎలాంటి లౌకికవాదం ఇది? ఆంథోనీకి శుభాకాంక్షలు చెప్పవద్దంటూ అమర్, అక్బర్‌లు ఒక్కటయ్యారు.

– ఖాలిద్ బేగ్, హోస్ట్

పర్యవసానం ఏమిటి?



పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఉపాధి హామీ పథక కార్మికులకు బీజేపీ ప్రభుత్వం డబ్బులు చెల్లించక సరిగ్గా ఏడాది! కోటి మందికి పైగా కార్మికులకు రూ.2,744 కోట్లు రావాల్సి ఉంది. 15 రోజుల్లో చెల్లించాలని చట్టం చెబుతోంది. చెల్లించడంలో ఆలస్యం 'నిర్బంధ శ్రమే' అంటుంది సుప్రీంకోర్టు. పశ్చిమ బెంగాల్ అవినీతిలో కూరుకుపోయిందని కేంద్రం అంటుంది. కాబట్టి నిధుల్లో కోత విధించారు. దీనివల్ల ఇబ్బంది పడుతున్నది ఎవరు?

– నిఖిల్ డే, కార్మిక నాయకుడు

ఇక్కడ పుట్టలేదు



ఇండియాలో కాదు, మొట్టమొదట 'కాస్టా' పదసృష్టి జరిగింది యూరప్‌లో. రక్త శుద్ధి, చర్మ రంగులతో ముడిపడిన సామాజిక స్థాయికి దీన్ని ముడిపెట్టారు. ఈ ఐబీరియన్ పదానికి 'వంశక్రమం' అని అర్థం. 1417 నుంచీ ఇది స్పానిష్‌లో డాక్యుమెంట్ అయివుంది. ఇంగ్లిష్ 'కాస్ట్'(కులం) పదానికి ఇదే మూలం. ఇండియాలోకి ప్రవేశించిన పోర్చుగీసువారు ఈ విధానాన్నే వర్ణ ధర్మ హిందూ సమాజంలోకి తప్పుగా తెచ్చారు. ఇక 1901లో జరిగిన జనగణనలో వేలాది భారత జాతులను 'కులాలుగా' వర్గీకరించింది బ్రిటిష్ సెన్సస్ కమిషనర్ సర్ రిస్లీ.

– సావిత్రీ ముముక్షు, రచయిత్రి

తరగతి గదిలోనూ... వివక్ష

దేశం స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకొంటున్నా వివక్ష రాజ్యమేలుతూనే ఉండటం బాధాకరం. ఆర్టికల్ 15 (మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రదేశం లేదా వాటిలో దేని ఆధారంగానైనా రాజ్యం ఏ పౌరుడిపైనా వివక్ష చూపకూడదు), ఆర్టికల్ 16 (పౌరులందరికీ ఉపాధి విషయంలో సమాన అవకాశాలు ఉండాలి), ఆర్టికల్ 17 (అస్పృశ్యతా నిర్మూలన) వంటివి అనేకం వివక్ష లేని రాజ్యాన్ని హామీ ఇస్తున్నాయి.

కానీ దేశంలో వివక్ష అనేక రూపాల్లో ఇప్పటికీ కరాళ నృత్యం చేస్తూనే ఉంది. ముఖ్యంగా తరగతి గదుల్లో ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉంది. దళిత విద్యార్థి తమ కుండలో నీరు తాగాడని అగ్రవర్ణ టీచర్ కొట్టి చంపడం కానీ, ముస్లిం పిల్లలను క్లాస్‌లో అవమానించడం కానీ, ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్ష, లైంగిక హింసకు గురిచేయడం కానీ... ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. చట్టాలు మన సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఏనాడో విఫలమయ్యాయి. నిజానికి ప్రజాస్వామ్య దేశాలు వివక్షకు గురవుతున్న వారిని రక్షించడానికి బహుళ యంత్రాంగాలను కలిగి ఉంటాయి. లింగం, జాతి, మతం ఆధారంగా; వైకల్యం, లైంగికత లేదా వయస్సు, వైవాహిక స్థితి ఆధారంగా జరిగే వివక్షలపై చర్యలు తీసుకోవడం మీద దృష్టి సారిస్తాయి. భారతదేశంలోనూ పేరుకు కొన్ని అటువంటి ఏర్పాట్లు ఉన్నాయి. కానీ వివక్షను గుర్తించే ఎలాంటి సమగ్ర చట్టబద్ధమైన ఫ్రేమ్ వర్క్ లేని ఏకైక ఆధునిక ప్రజాస్వామ్యంగా మనం మిగిలిపోయాం.

2006లో 'సచార్ కమిటీ' నివేదిక తర్వాత– అన్ని వర్గాల పౌరులకు సమాన అవకాశాలను ఇవ్వాలని వివక్ష నిరోధక చట్టం గురించి క్లుప్తంగా సంభాషణ ప్రారంభించిన వెంటనే... రాజకీయ నాయకులు ఒత్తిడి చేశారు. దీంతో ఆ ప్రతిపాదన బుట్టదాఖలయ్యింది. ఒక దశాబ్దం తర్వాత, వివక్ష నిరోధక, సమానత్వ బిల్లును 2017లో పార్లమెంటులో ప్రైవేట్ బిల్లుగా శశి థరూర్ ప్రవేశపెట్టారు, కానీ సభ తిరస్కరించింది.




స్వాతంత్ర్యం వచ్చిన 40 ఏళ్ల తర్వాత 1989లో, విద్యా సంస్థల్లో హింసకు వ్యతిరేకంగా దళిత, గిరిజన పిల్లలకు చట్టపరమైన రక్షణగా పీఓఏ చట్టాన్ని రూపొందించగలిగాము. అయితే ఉద్యోగ ఇంటర్వ్యూకు పిలవని దళితులకు లేదా అగ్రవర్ణాల సముదాయంలో నివాసం నిరాకరించబడిన దళితులకు లేదా తరగతి గదుల్లో వేరుగా ఉన్న పిల్లలకు ఈ చట్టం సహాయ పడలేకపోయింది. ఎవరైనా పూర్తిగా ప్రజల దృష్టిలో కులతత్వ దూషణలు చేస్తే తప్ప సహాయం చేయలేరు ఈ చట్టం ప్రకారం. ఎందుకంటే పీఓఏ చట్టం ప్రకారం... అగౌరవపరిచినట్లు, కులతత్వాన్ని చూపినట్లూ సాక్ష్యాధారాలు ఉంటేనే శిక్ష పడుతుంది. మరి సాక్ష్యం చెపేది ఎవరు? ఎన్ని చట్టాలు చేసినా మనుషులు మారనపుడు ఏ ఉపయోగమూ ఉండదు.

ఇప్పటికైనా తలుపులు మూసి ఉన్న తరగతి గదులలో జరిగే వివక్షలకు చరమ గీతం పాడుదాం. తరగతి గదుల తలుపులు తెరిచి వివక్ష లేని స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తరగతిలోకి ఆహ్వానిద్దాం.

– ఈదర శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ ఇంజనీరింగ్ కాలేజీ, నాగార్జున యూనివర్సిటీ

ఈ ఏడాదంతా సైన్స్ విశేషాలే!

విశ్లేషణ



కె.బి. గోపాలం

కొత్త సంవత్సరం రానున్నది. అంటే గడిచిన సంవత్సరంలో జరిగిన, గమనించదగిన అంశాలను సమీక్షించడానికి ఇది తగిన సమయం. 2022లో చాలా ఆసక్తికరమైన విషయాలే జరిగినట్లు చూడవచ్చు.

జనవరి మాసంలో టోంగాలోని 'హంగా టోంగా' అనే అగ్నిపర్వతం పేలింది. 21వ శతాబ్దిలో ఇంతటి పేలుడు ఇదివరకు జరగలేదు. ఈ అగ్ని పర్వతం హోంగా ప్రధాన ద్వీపం పక్కన ఇంచుమించు సముద్రంలో ఉంటుంది. కనుక సునామీ పుట్టి 90 మీటర్ల ఎత్తు అలలు పుట్టాయి. నలుగురు మాత్రమే మరణించారు.

జనవరి 24న రష్యావారు ఉక్రెయిన్ మీద దాడి చేశారు. ఉక్రెయిన్‌లో పెద్ద సంఖ్యలో అణు విద్యుత్కేంద్రాలు ఉన్నాయి. అందరికీ తెలిసిన చెర్నోబిల్ కూడా అక్కడే ఉంది. ప్రపంచంలో అణు విద్యుత్తు ఉత్పత్తిలో ఆ దేశం 7వ స్థానంలో ఉంది. జపోరిజిజియా అనే చోట యూరోప్‌లోకెల్లా పెద్ద విద్యుత్కేంద్రం ఉంది. దాని మీద రష్యా దాడి ప్రభావం పడింది. అంటే యుద్ధం ఇంచుమించు అణు యుద్ధంగా మారే అవకాశం ఉండనాలి. వీరి కేంద్రాలు నిజానికి పాతవి. కొత్తగా కడుతున్న కేంద్రాలలో ఇటువంటి తాకిడులను దృష్టిలో ఉంచుకుని తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తాకిడిలో మరీ పెద్ద ప్రమాదాలు ఏవీ జరగలేదంటున్నారు నిపుణులు.

ఎవరికి వారు వంశ వృక్షాలు సిద్ధం చేసుకోవడం మామూలే. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మొత్తం మానవ జాతికి వంశ వృక్షం తయారు చేసే ప్రయత్నం మొదలయింది. మానవుల జన్యు వివరాలను పరిశీలించడం ఇప్పుడు మామూలయింది. అటువంటి ఆధునిక పరీక్షలు 3,600 వరకు ఉన్నాయి. కొన్ని ప్రాచీన మానవ జన్యు పరీక్షల ఫలితాల ఆధారంగా ఈ కొత్త వంశ వృక్షం తయారవుతున్నది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న ఈ పరిశోధనకు ప్రపంచం మొత్తం నుంచి సమాచారం అందుతున్నది అంటున్నారు పరిశోధకురాలు గిల్ మెక్ వీన్.

ప్రపంచ జనాభా ఎనిమిది బిలియన్‌లు దాటింది. పర్యావరణం పాడవుతున్నది. గడచిన ఫిబ్రవరి తరువాత మరోసారి సీఓపీ సభలు జరిగాయి. పరిస్థితి మాత్రం అసలు మార్పు లేకుండా ఉంది. వాతావరణ మార్పు ప్రభావాలకు గురవుతున్న బడుగు దేశాలకు సహాయం అందించడానికి గాను నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయం జరిగింది. నెల రోజులయినా నిధులు ఇస్తున్నట్లు ఎవరూ ప్రకటించలేదు. పెట్రోలియం కంపెనీల మీద ఒత్తిడి తేవాలని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటరెస్ గట్టిగా అంటున్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి కూడా ఎటువంటి ఆశ కనిపించడం లేదు. ఏం జరుగుతుందని పేద దేశాలు ఆత్రంగా చూస్తున్నాయి.

ఆస్టరాయిడ్‌లు అనే అంతరిక్ష శిలల వల్ల భూమికి ప్రమాదం జరిగే అవకాశాలు అప్పుడప్పుడు ఎదురవుతుంటాయి. నాసా వారు అటువంటి శిలలను దారి మళ్లించే ప్రయత్నంలో విజయం సాధించారు. భూమికి 11 మిలియన్ కిలోమీటర్ల దూరం పయనించిన 'డార్ట్' అనే నౌక 'డైమార్ఫస్' అనే అంతరిక్ష శిలను పక్కకు కదిలించ గలిగింది. ఈ చిన్న శిల నిజానికి మరొక పెద్ద శిల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అది ఇప్పుడు పెద్ద శిలకు కొంచెం దగ్గరగా జరిగింది. ఈ విజయం ఆధారంగా, రానున్న కాలంలో ఇటువంటి శిలలను దారి మళ్లించే ప్రయత్నాలు మరింత ఆశాజనకంగా ఉంటాయని పరిశోధకులు అంటున్నారు.



మానవ శరీర భాగాలను ఒకరి నుంచి మరొకరికి మార్చే ప్రయత్నాలు ఈ మధ్యన బాగా జరుగుతున్నాయి. న్యూయార్క్ యూనివర్సిటీలో సర్జన్‌లు ఈ సంవత్సరం జనవరిలో జన్యు మార్పులకు గురి చేసిన పంది గుండెను ఒక మనిషికి అమర్చారు. డేవిడ్ బెనెట్ అనే ఆ వ్యక్తి రెండు నెలల తరువాత చనిపోయాడు. అయినా, అతను అంతకాలం బతకడం గమనించదగిన విషయమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. 2021 వరకు జంతు శరీర భాగాలను మనుషులలో అమర్చడం అన్నది ఆలోచనగానే ఉండేది. ఇప్పుడది వాస్తవం కాబోతున్నది అంటారు బర్మింగ్‌హామ్ సర్జన్ ఆండర్సన్.

భౌతిక శాస్త్ర పరిశోధకులు విశ్వంలోని పదార్థ నిర్మాణం గురించి అడ్వాన్స్‌డ్ పరిశోధనలు చేస్తుండటం తెలిసిందే. కొన్ని సంవత్సరాల క్రితం బోసాన్‌లు అనే పదార్థ కణాలు కనిపించాయని గొప్ప గోల పుట్టింది. ఈ సంవత్సరంలో డబ్ల్యూ బోసాన్ అనే కణం గురించిన పరిశోధనలు, రంగంలో అందరినీ ఒక అడుగు వెనుకకు కదిపే రకం ఫలితాలనిచ్చాయి. జెనీవాలోని వార్జ్ హోడ్రాన్‌కీవైడర్‌లో ఈ పరిశోధనలు చాలా బలంగా జరుగుతున్నాయి. 2028 నాటికిగానీ, ఈ విషయం గురించి ఏమీ చెప్పలేము అన్నారు అక్కడి వారు.

మైనస్ 12 డిగ్రీలు అంటే... అంటార్కిటికా లాంటి చోట తప్ప మరెక్కడా వీలుగాని వేడిమి. అది అసలు వేడిమి కాదు. చల్లదనం. దక్షిణ ధ్రువం నుంచి 1,600 కిలోమీటర్ల దూరంలోని కన్‌కార్డియా పరిశోధనా కేంద్రంలో ఆ టెంపరేచర్ 2022 సంవత్సరం మార్చిలో గమనించారు. అంటే అక్కడ వేడిమి మొదలయిందని అర్థం అంటున్నారు. సముద్రాలు వేడెక్కుతున్నాయి. కనుక ధృవాలు కూడా వేడెక్కుతున్నాయి. ఇటు గ్రీన్‌లాండ్, అంటే ఉత్తర ధృవంలో ఫియోనా హరికేన్ కారణంగా బిలియన్ టన్నుల మంచు కరుగుతున్నట్టు ఈ సంవత్సరంలో గమనించారు.

2022 సంవత్సరంలో జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ విశ్వంలో అంతకు ముందు చూచి ఎరుగని ప్రాంతాలను పరిశోధకులకు చూపగలుగుతున్నది. భూమి నుంచి రీలుగాలి పద్ధతిలో యంత్రం ఎగ్జో ప్లానెట్‌లను, అక్కడి వాయువులను గురించి సమాచారం అందించింది. టెలిస్కోప్‌లో మరో 25 సంవత్సరాలకు సరిపడా ఇంధనం ఉంది. అంటే మరెంతో సమాచారాన్ని అది అందజేయగలుగుతుంది.

అణు విద్యుత్ కేంద్రాలలో అణువులను విచ్ఛిన్నం చేసి, అంటే పగులగొట్టి శక్తిని పుట్టిస్తారు. అణువుల కలయిక లేదా సంయోజనం ద్వారా కూడా శక్తి ఉత్పాదన వీలవుతుంది. అయితే అందుకు మరో ముప్ఫై సంవత్సరాలు పడుతుందని చాలా కాలంగా అంటున్నారని ఒక జోక్ ఉంది. 2022లో ఆ పరిస్థితి మారింది అంటున్నారు. ఈ ఏడాది యూకేలో ఈ రంగంలో మంచి ఫలితాలు కనిపించాయి. 2025లో అణు సంయోజన కేంద్రం ఒకటి పని మొదలు పెడుతుంది అంటున్నారు పరిశోధకులు.

ప్రపంచంలో చాలా చోట్ల పెద్ద ఎత్తున కరువులు ఈ సంవత్సరంలో కనిపించాయి. ఆఫ్రికా, చైనా, యూఎస్‌లలో నదులు ఎండిపోయినట్లు గమనించారు.

విజ్ఞాన శాస్త్రంలో సమస్యలను, సమస్యలుగా గాక, అవకాశాలుగా భావించి ముందుకు సాగడం అలవాటు. వచ్చే ఏడాది ఏం జరగనుందో వేచి చూడాలి.

వ్యాసకర్త అనువాదకుడు, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.షష్ఠి రా.3.03 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: శతభిషం రా.7.06 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.1.11 నుండి 2.44 వరకు, దుర్ముహూర్తం: ప.11.40 నుండి 12.22 వరకు, అమృత ఘడియలు: ప.12.20 నుండి 11.54 వరకు. : రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు : యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు : సూర్యోదయం 6.33 : సూర్యాస్తమయం 5.30.

పథకాలతో సంతృప్తి వాస్తవమే : టీజీ

కర్నూలు కల్చరల్: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రజల్లో కొంత సంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఏర్పాటు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే తగిన నిర్ణయం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాని మోదీ డిసెంబర్ 2023 వరకు ఉచిత బియ్యం ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్‌లో చదువుతున్నందుకు గర్వపడుతున్నా

- ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆకట్టుకున్న విద్యార్థి ప్రసంగం



మాట్లాడుతున్న విద్యార్థి జ్యోతికృష్ణ

నగరి(చిత్తూరు జిల్లా): 'గతంలో ప్రైవేటు స్కూల్ విద్యార్థులను చూసినప్పుడల్లా బాధపడేవాడిని.. కానీ ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నందుకు చాలా గర్వంగా ఉంది. వారికంటే ఎక్కువ వసతులు, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని చదువుకుంటున్నాం. ఇప్పుడు మమ్మల్ని చూసి ప్రైవేటు స్కూల్ విద్యార్థులు బాధపడుతున్నారు' అంటూ ఓ విద్యార్థి తన అనుభవాన్ని వెల్లడించాడు. చిత్తూరు జిల్లా నగరి పీసీఎన్ హైస్కూల్‌లో మంగళవారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఆర్కే రోజా హాజరైన ఈ సభలో జ్యోతికృష్ణ అనే 8వ తరగతి విద్యార్థి చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధిని కళ్లకుగట్టింది. 'నేను గతంలో ప్రైవేటు స్కూల్ విద్యార్థులను చూసినప్పుడల్లా బాధపడేవాడిని. కానీ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ఒక మేనమామలా మమ్మల్ని చదివిస్తున్నారు. అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన.. ఇలా ఎన్నో పథకాలు పెట్టి మేము ఎంతో సంతోషంగా చదువుకునేలా చేశారు. నాడు-నేడు పథకం ద్వారా మా స్కూల్‌ను కార్పొరేట్ పాఠశాల కంటే గొప్పగా మార్చారు. ప్రైవేటు స్కూళ్లలో కూడా లేనివిధంగా ఆధునిక వసతులు కల్పించారు. టేబుళ్లు, బోర్డులు, ఫ్యాన్లు, లైట్లు, మినరల్ వాటర్, నిరంతర నీటి వసతితో బాత్రూమ్‌లు.. ఇలా అనేక సదుపాయాలు ఇప్పుడు మా పాఠశాలలో ఉన్నాయి. ఉచితంగా షూలు, బెల్టులు, టై, బ్యాగ్, పుస్తకాలిస్తున్నారు. రోజుకొక వెరైటీతో భోజనం పెడుతున్నారు. ఇప్పుడు 8వ తరగతి చదువుతున్న మాకు వేలాది రూపాయల విలువైన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థినైనందుకు ఇప్పుడు నేను చాలా గర్వపడుతున్నా. విద్యార్థులందరి తరఫున థాంక్యూ జగన్ మామయ్యా' అంటూ జ్యోతికృష్ణ కృతజ్ఞతలు తెలిపాడు. విద్యార్థి ప్రసంగానికి ముగ్ధులైన మంత్రి ఆర్కే రోజాతో పాటు స్థానికులు జ్యోతికృష్ణను అభినందించారు.

ప్రశ్న పత్రం లీక్ చేసేందుకు యత్నించిన ముగ్గురు అరెస్టు

పెడన: రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రశ్న పత్రం లీక్ చేయడానికి ప్రయత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న ఈ పరీక్షల్లో భాగంగా కృష్ణాజిల్లా పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో రోజుకు 300 మంది చొప్పున మూడు షిఫ్టులలో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 26వ తేదీన జరిగిన రెండో షిఫ్టు 12.30 నుంచి జరిగే పరీక్షకు గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన పీట మనీష్‌కుమార్ హాజరయ్యారు. తనిఖీ చేసినా కనిపించకుండా లోదుస్తుల్లో (అండర్ వేర్‌లో) సెల్‌ఫోన్‌ను దాచి పరీక్ష హాలులోకి తీసుకుపోయాడు. కంప్యూటర్ ల్యాబ్‌లో పరీక్ష ప్రారంభమయ్యాక కంప్యూటర్‌లో వచ్చిన ప్రశ్నపత్రాన్ని తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి టెలిగ్రామ్ యాప్ ద్వారా తన సోదరుడు వరుణ్‌కుమార్‌కు పంపించాడు. ఫొటో తీసిన విషయాన్ని గుర్తించిన ఇన్విజిలేటర్ కేఎస్‌జేబీ పూర్ణిమ పరీక్ష విధుల్లో ఉన్న అధికారి మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కార్యాలయంలో సూపరిండెంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీఎస్‌వీ ప్రసాద్‌రాజుకు తెలియజేశారు. మనీష్ కుమార్‌ను పెడన పోలీసులకు అప్పగించడంతో పాటు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఫిర్యాదుపై విచారణ నిర్వహించగా మనీష్‌కుమార్ టెలిగ్రామ్ మెసేజ్ ద్వారా వరుణ్‌కుమార్‌కు ప్రశ్నపత్రాన్ని పంపినట్టు, వరుణ్‌కుమార్ దానిని నరసరావుపేటలోని తన స్నేహితుడు అమరాజు నాగరాజుకు పంపినట్లు తేలింది. దీంతో ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

- టీడీపీ సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్ అశోక్ ఘాతుకం
- బాలిక కేకలు వేయడంతో పారిపోయిన దుండగుడు
- కేసు నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు
- పల్నాడు జిల్లా కేసానుపల్లిలో ఘటన


టీడీపీ జెండాతో అశోక్‌బాబు

దాచేపల్లి: తొమ్మిదేళ్ల బాలికపై టీడీపీ సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్ లైంగిక దాడికి ప్రయత్నించాడు. చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి బాలికను ఓ ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. తమ పాఠశాలలో తెలియజేసిన 'బ్యాడ్ టచ్'ను గుర్తించిన బాలిక కేకలు వేయడంతో దుండగుడు పారిపోయాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. బాలిక తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేసానుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రెండో తరగతి బాలిక రాత్రి ఎనిమిది గంటల సమయంలో తన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటోంది. ఆ బాలిక వద్దకు టీడీపీ సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్ వినుకొండ అశోక్‌బాబు(23) వచ్చి చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపించి సమీపంలోని ఓ ఇంట్లోకి తీసుకువెళ్లాడు. బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగికదాడికి ప్రయత్నించడంతో ఆ చిన్నారి కేకలు వేసింది. దీంతో అశోక్‌బాబు పారిపోయాడు. వెంటనే ఈ ఘటన గురించి బాలిక తన తల్లిదండ్రులకు తెలిపింది. మంగళవారం ఉదయం బాధిత బాలికను తీసుకుని ఆమె తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి అశోక్‌బాబు, అతని తల్లిదండ్రులను ప్రశ్నించగా, వారు గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో బాధిత బాలిక తల్లిదండ్రులు సీఐ బిలాలుద్దీన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాలిక నుంచి వివరాలు సేకరించిన పోలీసులు... పోక్సో చట్టం కింద అశోక్‌బాబుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అశోక్‌బాబు టీడీపీ సోషల్ మీడియా గ్రామ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరుడినని చెప్పుకుంటూ ఆ పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు.

బాలికను కాపాడిన గుడ్ టచ్.. బ్యాడ్ టచ్

మహిళలు, బాలికల రక్షణ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'దిశ'తోపాటు వినూత్న కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహిళలు, బాలికలపై లైంగిక దాడుల నివారణ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ క్రమంలో కేసానుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న సదరు బాలికకు కూడా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగింది. నిందితుడు అశోక్‌బాబు తనను బ్యాడ్ టచ్ చేస్తున్నట్లు బాలిక గమనించి కేకలు వేసింది. ఇదే విషయాన్ని పోలీసులకు తెలియజేసింది. పోలీసులు ఆ చిన్నారిని అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో మల్టీలెవల్ బిల్డింగ్స్

- మహామండపం నుంచే ఆలయ ప్రవేశం
- ఆలయానికి ఆగ్నేయంగా ప్రసాదం పోటు
- కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు బ్రిడ్జి
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి


మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ దర్శనం అనంతరం భక్తులు సేదతీరేలా నూతనంగా నిర్మించే మల్టీ లెవల్ బిల్డింగ్‌లో ప్రత్యేకంగా స్థలం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం మాస్టర్ ప్లాన్‌పై తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ఇంజనీరింగ్ అధికారులు, దుర్గగుడి ఈవో భ్రమరాంబతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమైన దృష్ట్యా నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని మంత్రి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా కాకుండా కనకదుర్గ నగర్ మీదగా ఆలయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కనకదుర్గ నగర్‌లో ఏర్పాటు చేసే పార్కింగ్‌లో వాహనాలను నిలుపుకుని అక్కడి నుంచి మహా మండపానికి చేరుకునేలా ఫ్లై ఓవర్‌ను నిర్మాణం చేస్తున్నామన్నారు.

రెండు మల్టీలెవల్ భవనాలు

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మహా మండపం సమీపంలో రెండు మల్టీ లెవల్ భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రసాదం పోటు, అన్నదానం జరిపేందుకు ఒక మల్టీ లెవల్ బిల్డింగ్‌తో పాటు మరో మల్టీ లెవల్ బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వివాహాలు, సెకండ్ ఫ్లోర్‌లో క్లోక్ రూమ్‌లు, లగేజీ భద్రపరుచుకునే కౌంటర్లు, క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆర్జిత సేవలకు రెండు అంతస్తుల భవనం నిర్మించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. కనకదుర్గ నగర్‌లో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సర్వదర్శనంతో పాటు రూ.100, రూ.300 టికెట్లు కొనుగోలు చేసే భక్తులు వేర్వేరు క్యూలైన్ల ద్వారా మహామండపం 7వ అంతస్తుకు చేరుకునేలా నిర్మాణాలు చేయడంతో పాటు అత్యవసర ద్వారాలు, టాయిలెట్స్ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

ఫార్మాసిటీ మృతులకు.. రూ.25 లక్షలు చొప్పున పరిహారం

- ప్రమాదకర పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్..
- ఘటనపై సమగ్ర విచారణ
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశం
- రూ.2.24కోట్లు కూడా ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం


మృతదేహాలను సొంత గ్రామాలకు తరలిస్తున్న దృశ్యం

మధురవాడ (భీమిలి)/పరవాడ (పెందుర్తి)/మహారాణిపేట : అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలో ఫార్మాసిటీ లారస్ ల్యాబ్ పరిశ్రమలో సోమవారం రాత్రి సంభవించిన ప్రమాదంలో మృతులు నలుగురికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఇంతకుముందు కూడా ఇటువంటి ప్రమాదాలు జరిగినా తక్షణమే చర్యలు తీసుకున్నామన్నారు. బహుళ జాతి కంపెనీలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో బ్రాండిక్స్ లాంటి పరిశ్రమల్లో ప్రమాదం జరిగినప్పుడు సైతం అప్రమత్తంగా వ్యవహరించామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటుచేశామని, సేఫ్టీ ఆడిట్స్ చేయాలని ఆదేశించామని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో 80-90 వరకు ప్రమాదకర పరిశ్రమలున్నట్లు గుర్తించామన్నారు. వాటిలో భద్రతాపరమైన ఆడిట్స్ చేయాలని ఆదేశించినట్లు అమర్‌నాథ్ చెప్పారు. పరవాడ ఫార్మాలో ప్రమాద ఘటన ఎందువల్ల జరిగింది? అందులో ఎవరి తప్పిదం ఉందో సమగ్రంగా విచారణ జరిపించాలని అనకాపల్లి కలెక్టర్, ఎస్పీలను ఆదేశించామన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

ఇక ఈ ప్రమాదంలో మృతులు బి. రాంబాబు, రాజేష్‌బాబు, రాపేటి రామకృష్ణ, మజ్జి వెంకట్రావు మృతదేహాలకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించినట్లు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎడ్ల సతీష్ షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మృతుల కుటుంబాలకు రూ.2.24 కోట్ల పరిహారం

మరోవైపు.. దుర్ఘటనలో మరణించిన నలుగురు కార్మికులకుటుంబాలకు రూ.2.24 కోట్ల పరిహారం చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. విశాఖ కేజీహెచ్‌లో ఇరువర్గాల మధ్య మంగళవారం జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరిందన్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన పర్మినెంట్ ఉద్యోగులు ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.70 లక్షలు చొప్పున రూ.1.40 కోట్లు, అలాగే.. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.42 లక్షల చొప్పున రూ.84 లక్షలు పరిహారం ఇవ్వడంతోపాటు బాధిత కుటుంబంలో ఒకరికి పరిశ్రమలో ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు.

వైకుంఠ ద్వార దర్శనం.. సామాన్యులకు ప్రాధాన్యం

- పదిరోజుల దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు
- శ్రీవారి దర్శనానికి టోకెన్ తీసుకునే రండి
- భక్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించి రావాలి
- జనవరి 1, 2 తేదీల్లో సిఫారసు లేఖలు స్వీకరించరు
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు 10 రోజుల పాటు జరిగే స్వామివారి వైకుంఠ ద్వార దర్శనంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, అదనపు ఈవో వీరబ్రహ్మం, జేఈవో సదా భార్గవి, టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి తదితరులతో మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. అనంతరం చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా.. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని 9 ప్రాంతాల్లో దాదాపు 92 కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తారు. జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు 10 రోజులకు గాను జనవరి 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వదర్శనం టోకెన్ల జారీ ప్రారంభిస్తారు. 10 రోజుల కోటా పూర్తయ్యేంత వరకు నిరంతరాయంగా 4.50 లక్షల టోకెన్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు టోకెన్ తీసుకున్నాకే తిరుమలకు రావాలి. టోకెన్లు పొందిన భక్తులు తిరుమలలోని కృష్ణతేజ విశ్రాంతి గృహం వద్ద రిపోర్టు చేయాలి. జనవరి 1, 2 నుంచి 11వ తేదీ వరకు కలిపి మొత్తం 2.05 లక్షల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల చేశారు. జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు రోజుకు 2 వేలు చొప్పున శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. వీరికి కూడా మహా లఘు దర్శనం ఉంటుంది. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దృష్ట్యా ఈ నెల 29 నుంచి జనవరి 3 వరకు వసతి అడ్వాన్స్ బుకింగ్ రద్దు. జనవరి 1, 2 తేదీల్లో ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించరు. గోవింద మాల భక్తులు టోకెన్ తీసుకునే తిరుమలకు రావాలి. భక్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించి రావాలి.

సుశాంత్‌ది హత్యే!

పోస్టుమార్టం బృందం సభ్యుని సంచలన ప్రకటన



ముంబై: రెండేళ్ల కింద అందరినీ కలచివేసిన బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మరణంపై సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2020 జూన్ 14న ముంబైలోని తన ఫ్లాట్లో ఆయన విగత జీవిగా కన్పించడం తెలిసిందే. దాన్ని ఆత్మహత్యగా తేల్చారు. అది అబద్ధమని, సుశాంత్‌ది కచ్చితంగా హత్యేనని మృతదేహానికి పోస్టుమార్టం చేసిన కూపర్ ఆస్పత్రి బృందంలోని సభ్యుడు రూప్‌కుమార్ షా తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. మార్చురీలో పని చేసే షా ఒక మరాఠీ చానల్‌తో ఈ వివరాలు పంచుకున్నారు. ''ఆ రోజు పోస్టుమార్టం కోసం మా దగ్గరికి ఐదు శవాలొచ్చాయి. వాటిలో ఒకటి వీవీఐపీదని ముందే చెప్పారు. తీరా చూస్తే అది సుశాంత్‌ది. ఒంటిపై, ముఖ్యంగా మెడపై కొట్టిన గాయాల గుర్తులున్నాయి. విషయాన్ని వెంటనే పోస్టుమార్టం డాక్టర్ల దృష్టికి తీసుకెళ్లాను. ఇది కచ్చితంగా హత్యేనని చెప్పాను. కానీ వాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం పోస్టుమార్టం ప్రక్రియను వీడియో రికార్డింగ్ కూడా చేయలేదు. హడావుడిగా ఫొటోలు తీసి సరిపెట్టారు. అదేమిటంటే పై నుంచి ఆదేశాలున్నట్టు చెప్పారు. వీలైనంత త్వరగా పోస్టుమార్టం అయిందనిపించి పోలీసులకు అప్పగించాలంటూ తొందర చేశారు. దాంతో అలాగే చేయాల్సొచ్చింది'' అని వివరించారు. సుశాంత్ మరణం వెనక కచ్చితంగా పెద్ద కుట్రే దాగుందంటూ ఆయన లాయర్ వికాస్ సింగ్ కూడా స్పందించారు.

క్లుప్తంగా...

తప్పిన భారీ ఉగ్ర ముప్పు

ఉధంపూర్: కశ్మీర్‌లో అప్రమత్తంగా ఉన్న భద్రతా బలగాలు భారీ ఉగ్ర ప్రమాదాన్ని నివారించాయి. ఉధంపూర్ జిల్లాలో 15 కిలోల బరువున్న ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్(ఐఈడీ)ని బలగాలు పసిగట్టి, నిర్వీర్యం చేశాయి. బసంత్‌ఘర్ ప్రాంతంలో పేలడానికి సిద్ధంగా ఉన్న మందు పాతరను సోమవారం బలగాలు గుర్తించాయి. సిలిండర్ ఆకారంలో ఉన్న ఐఈడీతో పాటు సుమారు 400 గ్రాముల బరువున్న ఆర్‌డీఎక్స్, ఏడు కాట్రిడ్జ్‌లు, ఐదు డిటోనేటర్లను మంగళవారం వెలికితీసి నిర్వీర్యం చేశాయి. లష్కరే తోయిబా పేరుతో ఉన్న లెటర్ కూడా దొరికింది. ఇందుకు సంబంధించి ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

భారత్ బయో ఇంకోవాక్ ధర... ప్రైవేటులో రూ.800

హైదరాబాద్: ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్ ఇంకోవాక్ ధరను దాని తయారీదారు భారత్ బయోటెక్ మంగళవారం ప్రకటించింది. ప్రభుత్వ కోవిన్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉండే ఈ నాసికా వ్యాక్సిన్‌ను రూ.800కు అందివ్వనున్నట్లు తెలిపింది. దీనికి పన్నులు అదనం. కాగా భారీ స్థాయిలో సేకరించి, పౌరులకు అందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.325కు డోస్ చొప్పున (పన్నులు అదనం) విక్రయిస్తామని తెలిపింది. జనవరి నాలుగో వారంలో దీన్ని మార్కెట్లోకి విడుదలచేస్తారు.

ఢిల్లీ మేయర్ బీజేపీ అభ్యర్థిగా రేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ మేయర్ పదవికి బీజేపీ తమ అభ్యర్థిగా రేఖా గుప్తాను ప్రకటించింది. డిప్యూటీ మేయర్ పదవికి కమల్ బగ్రి బరిలో దిగుతారు. జనవరి 6న జరగనున్న మేయర్ ఎన్నికకు ఆప్ తమ అభ్యర్థిగా షెల్లీ ఒబెరాయ్‌ను ప్రకటించడం తెలిసిందే. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లోని 250 స్థానాలకు ఆప్ 134 గెలుచుకుంది.

అస్సాంలో 'డీలిమిటేషన్' షురూ

న్యూఢిల్లీ: అస్సాంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. 2001 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంటున్నట్టు పేర్కొంది. డీలిమిటేషన్ చట్టం–1972 ప్రకారం చివరిసారిగా 1976లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్విభజన జరిగింది. అప్పుడు 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్నారు. అస్సాంలో 14 లోక్‌సభ, ఏడు రాజ్యసభ, 126 అసెంబ్లీ సీట్లున్నాయి.

నిస్సైనికీకరణ చేయండి

లేదంటే మేమే చేసి చూపిస్తాం: రష్యా

కీవ్: దురాక్రమణ, దాడులతో ఉక్రెయిన్‌పై పట్టుకు ప్రయత్నిస్తున్న రష్యా మరోమారు హెచ్చరికలు చేసింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఈ హెచ్చరికలు చేసినట్లు రష్యా అధికారిక టాస్ న్యూజ్ ఏజెన్సీ మంగళవారం వెల్లడించింది. 'ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ఇంకా ఎన్నాళ్లు కొనసాగుతుందనేది ఉక్రెయిన్, దాని మిత్రదేశం అమెరికా వైఖరిపైనే ఆధారపడి ఉంది. ఉక్రెయిన్‌ను నిస్సైనికీకరణ(డీమిలిటరైజ్) చేయండి. నాజీయిజానికి స్వస్తిపలకండి. రష్యాకు సైనిక ముప్పు లేకుండా చూడండి. లేదంటే రష్యా సైన్యమే ఇదంతా చేసి చూపిస్తుంది' అని లావ్రోవ్ హెచ్చరించారు. రష్యా నేరుగా కలగజేసుకోకుండా ఉంటే వచ్చే రెండు నెలల్లోపు ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంలో శాంతి చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రో కులేబా ప్రకటించిన మరుసటి రోజే అందుకు భిన్నమైన వాదన రష్యా లేవనెత్తడం గమనార్హం.

స్పేస్ వాక్

- ఐఎస్ఎస్‌కు సోలార్ ప్యానళ్ల బిగింపు
- అందుకోసం అంతరిక్షంలో 7 గంటలు



వాషింగ్టన్: వయో భారంతో సతమతమవుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) సామర్థ్యం పెంచేందుకు నాసా ఫ్లైట్ ఇంజనీర్లు జోష్ కసాడా, ఫ్రాంక్ రుబియో నడుం బిగించారు. ఏడు గంటలపాటు శ్రమించి దానికి కొత్త సోలార్ ప్యానళ్లు బిగించారు. ఇందుకోసం అంతరిక్షంలో నడిచారు. వీరికిది మూడో స్పేస్ వాక్. కొత్త ప్యానళ్లు ఐఎస్ఎస్ విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని 30 శాతం దాకా పెంచనున్నాయి. ఐఎస్ఎస్‌కు మరమ్మతులు కోసం శాస్త్రవేత్తలు, సిబ్బంది స్పేస్ వాక్ చేయడం ఇది 257వ సారట! ఆర్నెల్ల మిషన్లో భాగంగా వాళ్లు ఐఎస్ఎస్‌లో గడుపుతున్నారు.

మన ముంగిట్లో మరో ఏడు 'భూములు'!

వాషింగ్టన్: ఒకటి కాదు, రెండు కాదు. అచ్చం భూమిలాగే ఉన్న ఏడు గ్రహాలను జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా పూర్తిస్థాయిలో వెలుగులోకి తెచ్చింది! ఇవన్నీ మనకు కేవలం 39 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ట్రాపిస్ట్–1 అనే నక్షత్ర వ్యవస్థలో ఉన్నాయట. రాళ్లు, పర్వతాలమయంగా ఉన్న ఈ గ్రహాల ఉపరితలంపై అపారమైన జల వనరులకు పుష్కలంగా ఆస్కారముందట. మన మహాసముద్రాలన్నింట్లోనూ ఉన్నదాని కంటే ఎక్కువ జలమున్నట్టు తేలినా ఆశ్చర్యం లేదని సైంటిస్టులు అంటున్నారు. వాటిపై జీవం ఉనికికి అనువైన పరిస్థితులున్నాయా అన్నది తేల్చడంలో వారిప్పుడు తలమునకలయ్యారు. ''ఈ గ్రహాలపై నెలకొన్న వాతావరణ పరిస్థితులు తదితరాలపై జేమ్స్ వెబ్ ప్రస్తుతం దృష్టి సారించింది. ఈ విషయమై కొత్త సంవత్సరంలో మనకు పెద్ద శుభవార్తే అందవచ్చు'' అని నాసా చెబుతోంది. ట్రాపిస్ట్ పరిమాణంలో సూర్యునిలో పదో వంతుంటుందట.



వ్యాక్సినే విలన్?

పసలేని చైనా టీకా

- ఏమాత్రమూ లొంగని కరోనా
- తమకొద్దంటున్న పలు దేశాలు

డి.శ్రీనివాసరెడ్డి



కరోనా మహమ్మారి మరోసారి చైనాను కబళిస్తోంది. ప్రజాగ్రహానికి లొంగి కఠిన ఆంక్షలు సడలించి నెలైనా కాకముందే దేశంలో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. 20 రోజుల్లోనే ఏకంగా 40 కోట్ల మంది కరోనా బారిన పడ్డట్టు అంచనా! వచ్చే ఏడాది కరోనా వల్ల చైనాలో కనీసం 20 లక్షల మరణాలు ఖాయమన్నది అంతర్జాతీయ వైద్య నిపుణుల అంచనా. ఆంక్షల సడలింపే ఇంతటి కల్లోలానికి దారి తీసిందని ప్రచారం జరుగుతున్నా చైనా కరోనా వ్యాక్సిన్‌లో పస లేకపోవడమే అసలు కారణంగా కన్పిస్తోంది. ఎందుకంటే దాదాపు 100 కోట్ల మందికి పైగా చైనీయులు ఇప్పటికే కరోనా టీకాలు వేయించుకున్నారు. అయినా కరోనా ఉధృతి తగ్గడం లేదు. సరికదా, రోజుకు కనీసం 10 లక్షల మందికి పైగా దాని బారిన పడుతూనే ఉన్నారు.

టీకాలో రాజకీయం!

కరోనా వ్యాప్తి మొదలవగానే దేశాలన్నీ వ్యాక్సిన్ తయారీలో తలమునకలయ్యాయి. చైనాయే తొలి వ్యాక్సిన్‌ను రూపొందించింది. ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీ రూపొందించిన సినోఫార్మ్ వ్యాక్సిన్‌కు, ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన కరోనావాక్‌కు తొలుత ఆమోదం లభించింది. ఈ రెంటింటిని తమ పౌరులకు వేయడమే గాక పలు దేశాలకు చైనా సరఫరా చేసింది కూడా! వీటి కొనుగోలు నిమిత్తం ఆఫ్రికా దేశాలకు 200 కోట్ల డాలర్లు, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు 100 కోట్ల డాలర్ల రుణం కూడా ఇచ్చింది. ఆసియాలోనూ 30 దేశాలకు చైనా టీకాలందాయి.

సత్తా శూన్యం?

చైనా కరోనా టీకాలు తీసుకున్న వాళ్లు పదేపదే కరోనా బారిన పడుతుండటంతో వాటి సామర్థ్యంపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్నాయి. భారత టీకాలు అన్ని డోసులూ వేసుకున్న వారిలో అవి 99.3 శాతం సమర్థంగా పని చేయగా చైనా టీకాల సామర్థ్యం 79 శాతమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. అది వాస్తవానికి 60 శాతం లోపేనని హాంకాంగ్ వర్సిటీ అధ్యయనం తేల్చింది. జర్మనీ వ్యాక్సిన్ ఫైజర్–బయోఎన్‌టెక్‌తో పోలిస్తే చైనా టీకాలు వాడిన వారిలో మరణించే ఆస్కారం మూడు రెట్లు ఎక్కువని ఆసియాలైట్ పత్రిక పేర్కొంది! కరోనావాక్ వాడిన 40 రోజుల్లోనే వ్యాధి నిరోధక యాంటీ బాడీలు సగానికి సగం పడిపోయాయని థాయ్‌లాండ్ పరిశోధనల్లో తేలింది.

ఎవరేమన్నారు...

చైనా వ్యాక్సిన్ల సామర్థ్యం పాశ్చాత్య దేశాల వ్యాక్సిన్లతో పోలిస్తే చాలా తక్కువగా ఉండటమే చైనాలో ప్రస్తుత విలయానికి కారణం.

– అమెరికా అధ్యక్షుని ప్రధాన వైద్య సలహాదారు ఆంటోనీ ఫౌసి

భారత్‌లో సమర్థమైన టీకాల ద్వారా పరిస్థితిని దాదాపుగా అదుపులోకి తెచ్చి కరోనా ఆంక్షలను ఎత్తేశారు. చైనా మాత్రం నాసిరకం టీకాలతో సమస్యను జటిలం చేసుకుంది.

– బ్రిటిష్ పత్రిక ఆసియాలైట్ ఇంటర్నేషనల్

ఒమిక్రాన్ వైరస్ రకాలను గుర్తించడంలో చైనా టీకాలు విఫలమయ్యాయి.

– ది లాన్సెట్ జర్నల్

చైనాలో ప్రస్తుతం విలయం తొలి దశ వ్యాప్తి మాత్రమేనని అంటువ్యాధుల నిపుణుడు వుజున్ యాంగ్‌ను ఉటంకిస్తూ బీబీసీ పేర్కొంది. ''జనవరి చివరి నాటికి చైనా న్యూ ఇయర్ వేడుకలు తదితరాల పూర్తయ్యాక రెండో వేవ్ వస్తుంది. సెలవులు ముగిసి కోట్లాది మంది చైనీయులు సొంతూళ్లకు మళ్లే క్రమంలో ఫిబ్రవరి చివరి నుంచి మూడో వేవ్ మొదలవుతుంది'' అంటూ హెచ్చరించింది!

మాకొద్దంటున్న దేశాలు

చైనా టీకాలపై ఆధారపడ్డ దేశాల్లో ఇండొనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, టర్కీ, ఇరాన్, ఫిలిప్పీన్స్, మొరాకో, థాయ్‌లాండ్, అర్జెంటీనా, వెనెజువెలా, కాంబోడియా, శ్రీలంక, చిలీ, మెక్సికో, బంగ్లాదేశ్ తదితరాలున్నాయి. వాటిలో పస లేదని తేలడంతో అవన్నీ ఇతర టీకాల కోసం పరుగులు పెడుతున్నాయి. కరోనావాక్ తీసుకున్న తమ పౌరులకు ఆస్ట్రాజెనెకా వేయాలని థాయ్‌లాండ్ గత వారమే నిర్ణయించింది. ఇండొనేసియా కూడా కరోనావాక్ తీసుకున్న తమ వైద్య సిబ్బందికి బూస్టర్ డోస్‌గా మోడెర్నా వేస్తోంది. ఇంకా వాడని 40 లక్షల కరోనావాక్ డోసులను పక్కన పెట్టేస్తున్నట్టు నేపాల్ ప్రకటించింది. బ్రెజిల్, బహ్రైన్, యూఏఈ, ఈజిప్ట్ గతేడాదే చైనా టీకాలపై అనుమానాలు వెలిబుచ్చాయి. కరోనా రోగుల్లో మరణాలను ఆపడంలో వాటి సామర్థ్యం 45 శాతం లోపేనని తేలినట్టు వెల్లడించాయి. జర్మనీ అయితే చైనాలోని తమ దేశస్థులకు బయోఎన్‌టెక్ డోసులిస్తోంది! ఇతర దేశాలూ అదే బాటన నడుస్తున్నాయి.

విలయ తాండవం

చైనాను కుదిపేస్తున్న కరోనా

- జిజెయాంగ్‌లో రోజుకు ఏకంగా 10 లక్షల కేసులు నమోదు
- సరిహద్దులు బార్లా, నిబంధనలు పూర్తిగా ఎత్తేస్తున్న చైనా
- విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు క్వారంటైన్ నిబంధనా రద్దు

బీజింగ్: చైనాలో కరోనా నానాటికీ చుక్కలు చూపుతోంది. రోజూ లక్షలాది మంది దాని బారిన పడుతున్నారు. షాంఘై సమీపంలోని పారిశ్రామిక నగరం జిజెయాంగ్‌లో రోజుకు కనీసం 10 లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. కొద్ది రోజుల్లోనే ఇవి రోజుకు పాతిక లక్షలు దాటొచ్చని చెబుతున్నారు! దేశవ్యాప్తంగా ఆస్పత్రులకు రోగుల వెల్లువ నానాటికీ పెరుగుతోంది. మార్చురీల బయట శవాలు గుట్టలుగా పేరుకుంటున్నాయి. చాలాచోట్ల కనీసం 10 రోజులకు పైగా వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది. ఒకవైపు కేసులు ఇలా కట్టలు తెంచుకుంటుంటే మరోవైపు వాటి కట్టడి ప్రయత్నాలను, నిబంధనలను పూర్తిగా గాలికొదిలేస్తూ చైనా ప్రభుత్వం హఠాత్తుగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశ సరిహద్దులను పూర్తిగా తెరవాలని నిర్ణయించింది. అంతేగాక విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు మూడేళ్లుగా అమలు చేస్తున్న క్వారంటైన్ నిబంధనను కూడా పూర్తిగా ఎత్తేయనుంది. ఇవన్నీ జనవరి 8 నుంచి అమల్లోకి వస్తాని ప్రకటించింది. ఇందుకు వీలుగా కరోనాను డెంగీ తదితర జ్వరాలతో సమానమైన బి కేటగిరీకి తగ్గిస్తూ జాతీయ ఆరోగ్య సంస్థ నిర్ణయం తీసుకుంది. రోజువారీ కరోనా కేసుల సంఖ్య వెల్లడిని కూడా ఆదివారం నుంచి చైనా ఆపేయడం తెలిసిందే.



గ్వాంగ్‌జోయిూ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రయాణికులను క్వారంటైన్ కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం

ప్రమాదంలో ప్రధాని సోదరుడికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



ఆస్పత్రిలో ప్రహ్లాద్ మోదీ

మైసూరు: ప్రధాని మోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ కుటుంబం ప్రయాణిస్తున్న వాహనానికి కర్ణాటకలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రహ్లాద్, ఆయన కుమారుడు, కోడలు, వారి చిన్నారి గాయపడ్డారు. అందరికీ స్వల్ప గాయాలు అయ్యాయని, అందరూ క్షేమంగా ఉన్నారని మైసూరు ఎస్పీ సీమా చెప్పారు. మంగళవారం మైసూరు సమీపంలోని కడకోళ దగ్గర మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బందీపూర్‌కు వెళ్తున్న వీరి కారు రహదారి డివైడర్‌ను ఢీకొట్టడంతో కుడివైపు టైర్ ఊడిపోయింది. కారులోని వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే వీరందరినీ దగ్గర్లోని జేఎస్ఎస్ ఆస్పత్రిలో చేర్పించి ఎక్స్–రే, సీటీస్కాన్ తీయించారు. చిన్నపాటి గాయాలు మినహా ఎవరి ప్రాణానికీ ఏ ప్రమాదమూ లేదని వైద్యులు చెప్పారు. మైసూరు దక్షిణ పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదానికి సంబంధించి కేసు నమోదుచేశారు. ప్రహ్లాద్ కుటుంబం వ్యక్తిగత పర్యటనలో భాగంగా వెళ్తున్నట్లు తెలుస్తోంది.

ఎఫ్ఎంజీఈ అర్హత లేకుండానే వైద్యం

73 మందిని గుర్తించిన సీబీఐ
మిగతా వారి కోసం ముమ్మరంగా వేట

సాక్షి, న్యూఢిల్లీ: విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) అర్హత లేకుండానే దేశ వ్యాప్తంగా మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్న గ్రాడ్యుయేట్‌లపై సీబీఐ నజర్ పెట్టింది. అర్హతలేని విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్లపై కేంద్ర ఆరోగ్య శాఖే నేరుగా ఫిర్యాదు చేయడంతో అలాంటివారి కూపీ లాగుతోంది. ఇప్పటికే 73 మంది విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్లను గుర్తించింది. మిగతా వారి కోసం ఉధృతంగా దర్యాప్తు సాగిస్తోంది. కేంద్ర నిబంధనల ప్రకారం, విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన ఏ విద్యార్థి అయినా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) లేక స్టేట్ మెడికల్ కౌన్సిల్ (ఎస్ఎంసీ)లలో తాత్కాలిక లేక శాశ్వత రిజిస్ట్రేషన్ పొందడానికి తప్పనిసరిగా ఎఫ్ఎంజీఈ స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించాలి. ఆ తర్వాతే వారు దేశంలో ఎక్కడైనా మెడిసిన్ ప్రాక్టీస్ చేసేందుకు అనుమతి ఉంటుంది. అయితే ఈ అర్హత లేకుండానే రష్యా, ఉక్రెయిన్, చైనా, నైజీరియా వంటి దేశాల్లో ఎంబీబీఎస్ చేసిన 73 మంది మెడికల్ గ్రాడ్యుయేట్లు వివిధ రాష్ట్రాల కౌన్సిల్‌లలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. ఇటువంటి మోసపూరిత, నకిలీ రిజిస్ట్రేషన్‌ వైద్యులు పౌరుల ఆరోగ్యం, శ్రేయస్సుకు హానికరంగా మారారంటూ సీబీఐకి ఫిర్యాదు చేసింది. దీనిపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీకి సంబంధించిన ఐపీసీ సెక్షన్‌లతో పాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. 2011–2022 సంవత్సరాల్లో విదేశాల్లో ఎంబీబీఎస్ చేసిన వారే ఎక్కువగా అర్హత లేకుండా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారని గుర్తించి ఆ దిశగా విచారణ సాగిస్తోంది. అర్హత లేకుండానే ఎలా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారన్న దానిపై లోతుగా దర్యాప్తు జరుపుతోంది.

అత్యంత అవినీతిపరులు

సోనియా కుటుంబంపై బీజేపీ ఆరోపణలు

న్యూఢిల్లీ: గాంధీల కుటుంబం దేశ రాజకీయాల్లో అత్యంత అనైతిక, అత్యంత అవినీతిమయ కుటుంబమంటూ బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాపై మనీ ల్యాండరింగ్ కేసును కొట్టి వేసేందుకు రాజస్తాన్ హైకోర్టు గత వారం నిరాకరించడాన్ని ప్రస్తావించారు. వాద్రాపై అవినీతి, మనీ ల్యాండరింగ్ కేసులపై సోనియా, రాహుల్ మౌనం వీడాలన్నారు. ''భారత రాజకీయాల్లో సోనియాది అత్యంత అవినీతిమయ, అనైతిక కుటుంబం. ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు అవినీతి కేసుల్లో బెయిల్‌పై ఉన్నారు. 2008–13 మధ్య రాబర్ట్ వాద్రా రాజస్తాన్‌లో భారీగా భూములను బినామీ పేర్లతో సొంతం చేసుకున్నారు. అప్పుడు కేంద్ర రాష్ట్రాల్లో కాంగ్రెసే అధికారంలో ఉంది. దాంతో రాబర్ట్ కన్నుసన్నల్లో ల్యాండ్ మాఫియా నడిచింది. చట్టానికి అతీతులమని అనుకుంటున్న గాంధీల కుటుంబం.. ఇప్పుడు అదే చట్టం ముందు నిలబడేందుకు వణికిపోతోంది'' అన్నారు.

కోవిడ్ సన్నద్ధతపై మాక్ డ్రిల్

సాక్షి, న్యూఢిల్లీ: చైనా సహా కొన్ని దేశాల్లో కరోనా కేసులు ఒక్కసారిగా పెరిగిన నేపథ్యంలో కోవిడ్ సన్నద్ధతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు మంగళవారం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు మాక్‌డ్రిల్‌లు నిర్వహించాయి. ఒకవేళ కోవిడ్ రోగులు పెద్ద ఎత్తున ఆస్పత్రులకు పోటెత్తితే, కోవిడ్ కేసులు విజృంభిస్తే అందుకు తగ్గట్టు అన్ని జిల్లాల ఆసుపత్రుల్లో ఆరోగ్య సౌకర్యాలు, పడకలు, సిబ్బంది లభ్యత, మౌలిక సదుపాయాలుసహా వాటి సంసిద్ధతను అంచనా వేసేందుకు మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. ఐసొలేషన్ పడకలు, ఆక్సిజన్, ఐసీయూ, వెంటిలేటర్ వ్యవస్థలు ఉన్న పడకలు ఎన్ని ఉన్నాయి ఎంతమందికి సదుపాయం కల్పించగలం, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, ఆషా, అంగన్‌వాడీ వర్కర్ల అందుబాటు వంటిపైనా మాక్‌డ్రిల్‌చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం ఢిల్లీలో నడిచే సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిని సందర్శించి మాక్ డ్రిల్‌ను సమీక్షించారు.



సన్నద్ధతకు ఆటంకం కల్గించొద్దు

''దేశంలో కోవిడ్ విజృంభణ లేదని నిర్ధారించుకొనేందుకు సిద్ధంగా ఉండాలన్న ప్రధాని మోదీ సూచనల మేరకు దేశంలోని ఆస్పత్రుల్లో రోగులు సరైన చికిత్స పొందేలా మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఆసుపత్రుల్లో క్లినికల్ సంసిద్ధత కీలకం. నిజమో కాదో నిర్ధారించుకోకుండా ఎలాంటి సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయకండి. అనవసర భయాలతో ముందే ఆస్పత్రుల్లో చేరితే ప్రభుత్వ ముందస్తు వైద్య సదుపాయాల సన్నద్ధత ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడే వీలుంది' అని మంత్రి అభిప్రాయపడ్డారు.

రాహుల్ రాముడంతటి వాడు: ఖుర్షీద్

మొరాదాబాద్/న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ రామునితో పోలుస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ పొగడ్తలతో ముంచెత్తారు. కాంగ్రెస్ కార్యకర్తలను భరతునితో పోల్చారు. మొరాదాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ''మేం చలికి గజగజ వణుకుతుంటే రాహుల్ కేవలం టీషర్టు ధరించి జోడో యాత్ర కొనసాగిస్తున్నారు. ఆయన నిజంగా సూపర్‌మ్యాన్. తదేక లక్ష్యం కోసం తపస్సు చేస్తున్న యోగి'' అన్నారు. ''రాముడి పాదుకలు చాలా దూరం వెళ్లాయి. వాటిని భరతుడు (కాంగ్రెస్ కార్యకర్తలు) ఉత్తరప్రదేశ్ అంతటికీ చేరవేస్తారు' అన్నారు.



మనోభావాలు దెబ్బతీశారు: బీజేపీ

ఖుర్షీద్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ''వేలకోట్ల నేషనల్ హెరాల్డ్ అవినీతి కేసులో బెయిల్ మీద బయటికొచ్చిన రాహుల్‌ను రాముడితో పోల్చడం దారుణం. దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసినందుకు కాంగ్రెస్ కుటుంబం క్షమాపణ చెప్పాల్సిందే. కాంగ్రెస్ నేతలు కుటుంబ ఆరాధనకు అంకితమై అది దైవభక్తి, దేశభక్తి కంటే మించినదనే భ్రమల్లో బతుకుతున్నారు'' అని బీజేపీ అధికార ప్రతినిధులు గౌరవ్ భాటియా, షెహజాద్ పూనావాలా అన్నారు.

అమెరికాలో కొనసాగుతున్న మంచు విలయం



న్యూయార్క్ రాష్ట్రంలోని ఎల్మ్‌వుడ్‌లో మంచుమయమైన రహదారి

బఫెలో: అమెరికాలో మంచు తుఫాను విలయం కొనసాగుతూనే ఉంది. ఈ శతాబ్దంలోనే ఎన్నడూ ఎరగనంతటి చలి గాలులు, తుఫాన్లు, మంచు ధాటికి మంగళవారం కూడా దేశమంతా అతలాకుతలమైంది. 4,000 పై చిలుకు దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల దేశవ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 60 దాటింది. ఒక్క న్యూయార్క్ రాష్ట్రంలోనే కనీసం 30 మంది దాకా చనిపోయారు. ఇక్కడి బఫెలో కౌంటీలో పరిస్థితి దారుణంగా ఉంది. ఎటు చూసినా కనీసం 50 అంగుళాల మేర మంచు పరుచుకుపోయింది. 1880ల తర్వాత ఈ ప్రాంతం ఈ స్థాయిలో హిమపాతాన్ని చూడటం ఇదే తొలిసారి! నిత్యావసరాల కొరత పలుచోట్ల లూటీలకు కూడా దారితీస్తోంది. అయితే గత ఆరు రోజులతో పోలిస్తే మంగళవారం పరిస్థితి కాస్త మెరుగైందని, పలు ప్రాంతాల్లో చలి తీవ్రత తగ్గుతోందని వాతావరణ శాఖ పేర్కొంది.

పొంచి ఉన్న వరద ముప్పు

ఉష్ణోగ్రతలు పెరిగితే ఇప్పటిదాకా పేరుకుపోయిన అపారమైన మంచు ఒక్కసారిగా కరిగి ఆకస్మిక వరదలకు దారితీసే ప్రమాదం పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా బఫెలో వంటి ప్రాంతాలకు ఈ ముప్పు చాలా ఎక్కువని పేర్కొంది. దాంతో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని ఇప్పట్నుంచే సిద్ధం చేస్తున్నారు.



బఫెలో సిటీలో దుకాణాల ముందు భారీగా పేరుకున్న మంచు గుండా వెళ్లి నిత్యావసరాలు కొనుక్కుంటున్న జనం

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 28 । డిసెంబర్ । 2022



ఆధ్యాత్మిక సేవలు కొనసాగాలి

తేజోమూర్తుల బాలభాస్కర శర్మకు శ్రీవిద్యా సుధాకర బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. -8లో▸



కృష్ణలంక రైతుబజార్ ప్రారంభం

కృష్ణలంక: బందరు కాలువ గట్టున రూ.98.24లక్షల వ్యయంతో నిర్మించిన కృష్ణలంక రైతుబజార్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు.



శిల్ప కళా నైపుణ్యం!

మచిలీపట్నంలో నూతనంగా నిర్మించే ఆలయాలపై శిల్పాలు ఏర్పాటు చేసే పనులను పలువురు శిల్పులు చేస్తున్నారు. వారిలోని శిల్పకళా నైపుణ్యం అబ్బురపరుస్తోంది. -8లో▸

న్యూస్‌రీల్

మార్కెట్లోకి దుర్గగుడి క్యాలెండర్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి సంబంధించిన ఇంద్రకీలాద్రి-2023 క్యాలెండర్లు మార్కెట్లోకి వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. క్యాలెండర్ ధర రూ.60గా నిర్ణయించారు. దేవస్థానంలోని కనకదుర్గప్రభ కౌంటర్, పూజ సామగ్రి విక్రయించే కౌంటర్లలో ఈ క్యాలెండర్లను విక్రయించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భ్రమరాంబ, ఈఈ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఫర్చునా సంస్థ తరఫున సురేష్ మంగళవారం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి రూ. 1,01,116 విరాళాన్ని అందించారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను దాతకు బహూకరించారు.

రైల్వేకు రూ. 4.19 కోట్ల ఆదాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ విభాగంలోని టికెట్ చెకింగ్ సిబ్బంది నవంబర్‌లో చేపట్టిన డ్రైవ్‌ల ద్వారా రూ.4.19 కోట్ల ఆదాయం సమకూరినట్లు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు మంగళవారం తెలిపారు. టికెట్ లేని ప్రయాణికులు, అనధికార లగేజీలను తరలిస్తున్న వారిని గుర్తించి 67,879 కేసులు నమోదు చేశామన్నారు. దీని నుంచి రూ.4.19 కోట్లు అపరాధ రుసుం వసూలు చేసినట్లు పేర్కొన్నారు. గత ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన టికెట్ చెకింగ్ సిబ్బంది ఎంకే కిశోర్‌బాబు, ఎంజే మాథ్యుస్, కేబీజీ తిలక్, డి.జనార్దన్, టి.ఉమా మహేశ్వరికి ఏసీఎం వి.రవివర్మతో కలిసి మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించినట్లు వివరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారు ఆలయ ప్రదక్షిణ అనంతరం పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. స్వామివారికి ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, బాలకృష్ణ శర్మ అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్.ఎస్.చంద్రశేఖరరావు స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించారు.

32,193 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 32,603 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 32,193 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,500 వరకు పలికింది.

జంక్షన్ ఇక క్లియర్

బెజవాడలో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ

- గంటల తరబడి వాహనాలు నిలబడకుండా ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం
- రూ. 15 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన
- మొదటి విడతలో నగరంలోని 17 కూడళ్లల్లో ఏర్పాటు
- ఇప్పటికే టెండర్లు పిలిచిన పోలీస్ శాఖ
- కాంట్రాక్టు సంస్థల నమూనాల పరిశీలన
- త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం



విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో ట్రాఫిక్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం) ప్రాజెక్టు అమలు దిశగా చర్యలు తీసుకుంటోంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 15 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే వీఎంసీకి వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ. 5కోట్లు కేటాయించింది. ఈ మొత్తంతో మొదటి విడత పనులకు శ్రీకారం చుడుతున్నారు. నగరపాలక సంస్థ, పోలీసు శాఖ సంయుక్తంగా ఈ పనులను చేపడుతున్నాయి.

ప్రధాన కూడళ్లలో..

ఇటీవల నగరపాలకసంస్థ, పోలీస్ ఏజెన్సీలు ఉమ్మడిగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో సర్వే నిర్వహించాయి. ప్రాధాన్యత క్రమంలో నగరంలోని 17 ముఖ్య కూడళ్లను ఎంపిక చేశాయి. వీటిలో బెంజి సర్కిల్, నిర్మలాజంక్షన్, రమేష్ ఆస్పత్రి, మహానాడు, చల్లపల్లి బంగ్లా, పోలీస్ కంట్రోల్ రూమ్, డీసీపీ బంగ్లా, ఆంజనేయ స్వామి కూడలి, శారద కళాశాల, సీతారాంపురం, సీతన్నపేట గేట్, పడవలరేవు, అప్సర, ఫుడ్ జంక్షన్, మధురానగర్‌లో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని నిర్ణయించాయి.


ఇప్పటికే పలు నగరాల్లో..

ఇప్పటికే దేశంలోని పలు నగరాల్లో ఐటీఎంస్ ప్రాజెక్టు సత్ఫలితాలనిస్తోంది. కోల్‌కతా, పుణే, జైపూర్, అహ్మదాబాద్, గాంధీనగర్‌లో ఈ వ్యవస్థ ఇప్పటికే అమలులో ఉంది. ఇది అందుబాటులోకి వస్తే నగర వాహనదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఎలా పనిచేస్తుందంటే..

ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంను ఆయా కూడళ్లలో ఏర్పాటు చేసి.. ఆ తర్వాత అన్నింటిని ఒకదానికొకటి అనుసంధానిస్తారు. వీటికి ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాల్లో ఉండే సెన్సార్లు వాహనాల రద్దీని గుర్తిస్తాయి. ఎక్కువ వాహనాలు ఉండే మార్గంలో ట్రాఫిక్ క్లియర్ చేయడానికి అధిక సమయం ఆకుపచ్చ లైట్ వెలిగి ఉండేలా సెన్సార్‌లు పనిచేస్తాయి. వాహనాలు లేని మార్గంలో ఎరువు సిగ్నల్ పడుతుంది. ఈ వ్యవస్థ ఏర్పాటుతో సగటు ప్రయాణవేగం 10శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణంలో జాప్యం కూడా 15 శాతం మేర తగ్గనుంది. కూడళ్ల వద్ద సిగ్నళ్ల కోసం ఎదురు చాడాల్సిన అవసరం ఉండదు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం...



విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటున్నాం. ఇందులో భాగంగా ఐటీఎంఎస్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టాం. తొలి దశలో రూ. 5 కోట్లతో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. నగరంలో 17 ముఖ్య కూడళ్లలో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తోంది.

– టి.కె రాణా, సీపీ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్

ఇప్పటికే పనులకు టెండర్లు..

ఇప్పటికే ఐటీఎంఎస్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ సీపీ టి.కె. రాణా టెండర్లు పిలిచారు. టెండర్ల గడువు సైతం ముగిసింది. ప్రస్తుతం ప్రీ క్వాలిఫికేషన్ దశ దాటింది. మొత్తం నాలుగు సంస్థలు బిడ్లు వేశాయి. వీటికి సంబంధించిన సాంకేతిక అంశాలను కమిటీ పరిశీలించింది. ఈ సంస్థలు రూపొందించిన నమూనాలను సైతం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నగర అవసరాలకు సరిపోయే నమూనాను ఎంపిక చేయనున్నారు. త్వరలో ప్రక్రియ పూర్తి చేసి, పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ ప్రారంభం

విజయవాడ జీజీహెచ్‌లో ఇంటర్నేషనల్ వ్యాక్సినేషన్ కేంద్రం



వ్యాక్సిన్ వేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాలకు వెళ్లే వారి కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ వ్యాక్సినేషన్ కేంద్రంలో ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్‌లు వేయడాన్ని మంగళవారం ప్రారంభించారు. తొలుత విదేశాలకు వెళ్లే విద్యార్థికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి వ్యాక్సిన్ వేసి, కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు 8 మందికి వ్యాక్సిన్‌లు వేశారు. రాష్ట్రానికి చెందిన ఎవరైనా విదేశాలకు వెళ్లే వారు ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ కోసం తొలుత రిజిస్ట్రేషన్ చేయించుకుని, నిర్దేశిత మొత్తం రూ.500 చెల్లించి, వ్యాక్సిన్ వేయించుకోవచ్చని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వ్యాక్సినేషన్ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. విదేశీ ప్రయాణాలు చేసేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు. శోభ, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె. నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 27 ఇసుక రీచ్‌లు

ఆమోదం తెలిపిన శాండ్ కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గృహ నిర్మాణ లబ్ధిదారులకు, ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లాలో పర్యావరణ, వివిధ అనుమతులు పొందిన 27 కొత్త రీచ్‌లను కమిటీ సమావేశంలో ఆమోదించామన్నారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు ముఖ్యంగా మనబడి నాడు-నేడు, గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచిందన్నారు. జిల్లాలో కొత్తగా 5 వేల క్యూబిక్ మీటర్ల కంటే తక్కువ సామర్థ్యం గల 8 వాగులలో ఇసుకను అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటిలో వీరులపాడు మండలం దొడ్డదేవరపాడులో రెండు, నందిగామ మండలం సోమవరంలో నాలుగు, తిరువూరు మండలం గానుగపాడులో ఒకటి, గంపలగూడెం మండలం, కనుమూరులో ఒక దానిలో ఇసుకను స్థానిక అవసరాలకు వాడేందుకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు, పేదల ఇళ్ల నిర్మాణాలకు, ఇతర అవసరాలకు, సామాన్య ప్రజలకు ఇసుక సరఫరా ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

ఉల్లంఘనలపై కఠిన వైఖరి..

కాల పరిమితి ముగిసిన, అనుమతులు లేని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరపకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమాలు ఉల్లఘించి ఇసుక తవ్వకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇసుక నిల్వలు ఇలా..

సమావేశం ఆమోదించిన 27 రీచ్‌లలో వత్సవాయి మండలంలో ఇందుగపల్లి, కన్నెవీడు, అల్లూరుపాడు, కంచికచర్ల మండలం చెవిటికల్లు, కునికనపాడు,పెండ్యాల, వేములపల్లి, గనిఆత్కూరు, నందిగామ మండలం మాగల్లు, జగ్గయ్యపేట మండలం మల్కాపురం, చందర్లపాడు మండలం పొక్కునూరు, ఉస్తేపల్లి, కాసరబాద,ఏటూరు, పెనుగంచిప్రోలు మండలం వెంగనాయకునిపాలెం, శనగపాడు, పెనుగంచిప్రోలు రీచ్‌లలో 129.37 హెక్టార్లలో 12.93 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. జగ్గయ్యపేట మండలం రావిరాల రీచ్‌లో డీసిల్టేషన్ నిర్వహించుకునేందుకు 5 బోట్స్‌మెన్ సొసైటీలు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. వీటిలో టన్నుకు రూ. 625గా ప్రభుత్వం ధర నిర్ణయించిందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు డిపోలలో 1.49 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, గనుల భూ గర్భ శాఖ డెప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కేసీ డివిజన్ ఈఈ కృష్ణారావు, జలవనరులు, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం

- వైద్యులకు ఆరోగ్య, కుటుంబ, సంక్షేమశాఖ కమిషనర్ నివాస్ ఆదేశం
- విజయవాడ జీజీహెచ్‌లో అధికారులతో సమీక్ష సమావేశం
- 750 పడకలు సిద్ధంగా ఉన్నాయన్న అధికారులు



అధికారులతో సమీక్ష చేస్తున్న కమిషనర్ నివాస్, చిత్రంలో డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్-19 ఒమిక్రాన్ బీఎఫ్ 7 రూపంలో మరోసారి విరుచుకుపడేందుకు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె. నివాస్ వైద్యాధికారులను ఆదేశించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి అధికారులతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఆక్సిజన్ నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విపత్తు ముంచుకొచ్చినా వైద్య సేవలు అందించేందుకు సమాయత్తం కావాలన్నారు. కోవిడ్ మొదటి, రెండో వేవ్‌లో సమర్థంగా వైద్య సేవలు అందించిన స్ఫూర్తితో మరోసారి సిద్ధం కావాలని సూచించారు. అవసరమైన మందులు, ఆక్సిజన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

సర్వ సన్నద్ధం..

కాగా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి ఇక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను నివాస్‌కు వివరించారు. ప్రస్తుతం 750 పడకలు అందుబాటులో ఉన్నాయని, వాటిలో 90 వెంటిలేటర్స్‌తో కూడిన ఐసీయూ బెడ్స్ అని తెలిపారు. అన్ని బెడ్స్‌కు ఆక్సిజన్ సౌకర్యం ఉన్నట్లు వివరించారు. మందులు, ఆక్సిజన్ కొరత లేదని, అన్నీ సమృద్ధిగా ఉన్నాయన్నారు. కొత్త ప్రభుత్వాస్పత్రిలో 340 మంది స్టాఫ్‌నర్సులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ కోవిడ్ సేవలు అందించాల్సి వస్తే అదనంగా ఎంఎన్‌ఓల నియామకాలు చేయాల్సి ఉందని ఆమె నివాస్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ నివాస్ ఎలాంటి అదనపు సౌకర్యాలు, సదుపాయాలు కావాలన్నా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ యు. శోభ, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె. నరసింహనాయక్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వెంకటకృష్ణతో పాటు, పలు విభాగాలకు చెందిన వైద్యులు, పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

- ఏ ఒక్కరూ నష్టపోకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలకు అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు అందని వారందరికీ నవరత్నాలతో తిరిగి లబ్ధి చేకూర్చుతున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేశారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు లబ్ధిదారులకు నగదు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి మరలా ఆర్థిక సాయం మంజూరు చేశామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 21,597 మంది లబ్ధిదారులకు రూ.33.44 కోట్లు ఆర్థిక సాయం అందించామన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు నేరుగా జమ చేశామన్నారు. ఏవైనా కారణాలతో పథకాలు అందని వారు తమ సమీపంలోని సచివాలయాల్లో సంప్రదించాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమలపూర్ణమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	జమ చేసిన మొత్తం (రూ. లక్షల్లో)
జగనన్న అమ్మఒడి	1,488	193.44
జగనన్న చేదోడు	31	3.10
జగనన్న వసతి దీవెన	663	56.414
జగనన్న విద్యా దీవెన	7,820	1407.00
వైఎస్సార్ కాపు నేస్తం	1,104	165.61
వైఎస్సార్ నేతన్న నేస్తం	03	0.72
వైఎస్సార్ చేయూత	1370	256.87
వైఎస్సార్ వాహన మిత్ర	440	44
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	32	4.80
వైఎస్సార్ మత్స్యకార భరోసా	8	0.80
వైఎస్సార్ పెన్షన్ కానుక	7,535	2.08(రూ.కోట్లలో)
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1043	10.04(రూ.కోట్లలో)

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల డెప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను శూన్యం చేసుకోవద్దని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఏపీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎన్టీఆర్ జిల్లా డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'యాంటీ డ్రగ్ డ్రైవ్' అంశంపై సదస్సు ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. ఈ దశలో మత్తుకు అలవాటు పడితే ఆ జీవితం చెడుబాట పడుతుందన్నారు. మత్తు కలిగించే ఏ పదార్థాన్ని కూడా రుచి చూడాలని భావించవద్దని, ఒకసారి దానికి అలవాటు పడితే జీవితాంతం దానిని వదలలేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా ఏఈఎస్ డి. ప్రభాకరరావు మాట్లాడుతూ యువత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన ఉపాధిని పొందాలన్నారు. ఆ దిశగా తమ ప్రయాణం కొనసాగాలని సూచించారు. ఎస్ఈబీ భవానీపురం సీఐ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి తప్పుడు అడుగులు వేసినా వారి జీవితం తీవ్రంగా ప్రభావితమవుతుందన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి. శేషగిరిరావు, డి. పవన్‌కుమార్, ఎన్. సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డీసీ శ్రీనివాసరావు

ఆంధ్రా గిరిజన సంప్రదాయంలో వానదేవుడా నృత్యం చేస్తున్న కళాకారులు



నృత్యోత్సాహం



మణిపూర్ సంప్రదాయంలో ఫోక్ డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

భారతీయ నృత్య సంప్రదాయాలు కనువిందు చేశాయి. కళాకారుల ప్రదర్శనలు భారతీయ సమైక్యతను చాటాయి. ముమ్మనేని సుబ్బారావు కళాపీఠం(సిద్ధార్థ అకాడమీ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో విజయవాడ మొగల్రాజపురంలోని కళాశాల కళావేదికపై మంగళవారం విశాఖపట్నానికి చెందిన స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాగరాజు పట్నాయక్ బృందం పలు భారతీయ నృత్య సంప్రదాయ రీతులను ప్రదర్శించింది. కేరళ సంప్రదాయ నృత్యం మోహినీ అట్టం, అస్సామీ గ్రామీణ ప్రాంతంలో ప్రదర్శించే బిహూ, మణిపూర్ సంప్రదాయ నృత్యం మణిపూరి, ఒడిశా జానపద నృత్యం పోకనో, పంజాబీ రాష్ట్ర అధికారిక నృత్యం భాంగ్రా, రాజస్థానీ గుమర్, బెంగాలీ, నేపాలీ నృత్యాలు అలరించాయి. అలాగే ఆంధ్రా గిరిజన నృత్యరీతులు ఆకట్టుకున్నాయి.

– విజయవాడ కల్చరల్

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న వాహనం స్వాధీనం



నందిగామ:గంజాయి తరలిస్తున్న పలువురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం ఏరియా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో కీసర వద్ద పోలీసులు తనిఖీ చేయగా 50 కిలోల గంజాయి దొరికింది. నిందితులు గంజాయిని హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడి నుంచి రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కారులో దొరికిన ఇద్దరు వ్యక్తులతో పాటు మరికొందరి గోసం గాలిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్‌హెచ్‌ఓ సతీష్‌ను వివరణ కోరగా విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విలక్షణ నటుడు కైకాల

గుడివాడరూరల్: ఏఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి, సినీ నటుడు కైకాల సత్యనారాయణ తెలుగు నాటక, సినీ రంగాల్లో ఎన్నో అద్భుతమైన పాత్రలకు ప్రాణం పోసిన విలక్షణ నటుడు అని ఏఎన్ఆర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు తెలిపారు. ఏఎన్ఆర్ కళాశాల యూజీ సెమినార్ హాల్లో కైకాల సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడలో ప్రభాకర నాట్యమండలి వారితో ఎన్నో నాటికలను ఆయన ప్రదర్శించారని చెప్పారు. ఆ బంధంతోనే నాటక కళాకారుల కోసం గుడివాడలో కైకాల కళా మందిరం నిర్మాణానికి సహకరించారన్నారు. నేడు పురపాలక సంఘ కార్యాలయం వారు నిర్మించిన కైకాల కళా మందిరం నాటకాలకు అనుకూలంగా లేదని దాన్ని సౌండ్‌ప్రూఫ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిజీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ దాదాపు 777 చిత్రాల్లో నటించి యముడిగా, దుర్యోధనుడిగా, ఘటోత్కచుడుగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.

శిల్ప కళా నైపుణ్యం!

- నగరంలో నూతనంగా నిర్మిస్తున్న పలు ఆలయాలు
- దేవతామూర్తుల విగ్రహాలు, డిజైన్లు చెక్కుతున్న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శిల్పులు



నిర్మాణంలో ఉన్న గొడుగుపేట వెంకటేశ్వరస్వామి ఆలయం



రామాలయం గోడపై కృష్ణార్జునుల రథంపై యుద్ధం చిత్రం



శిల్పానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలు వివిధ ఆకారాల్లో కనిపించటం పరిపాటి. జీర్ణోద్ధరణకు గురైన పురాతన ఆలయాలను తొలగించి ఇటీవల కొత్తవి నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ నాటి విగ్రహాలను నూతనంగా నిర్మించే ఆలయాలపై ఏర్పాటు చేసే పనులు పలువురు శిల్పులు చేస్తున్నారు. వీరు ఆలయాలపై దేవతామూర్తుల విగ్రహాలను తయారుచేస్తున్నారు. శిల్పులు వారిలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాలకు ఈ శిల్పులు వారి కళను రంగరిస్తున్నారు.

నగరంలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం పూర్తిగా జీర్ణోద్ధరణకు గురై కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కృషితో రూ. 90 లక్షల నిధులతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. గాలిగోపురం, గర్భగుడి, మండపం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఐదు నెలలుగా 20 మంది శిల్పులు...

దేవతామూర్తుల విగ్రహాలు, డిజైన్లు చెక్కేందుకు తూర్పుగోదావరి జిల్లా కొమరపాలెంకు చెందిన 20 మంది శిల్పులు ఐదు నెలలుగా పనిచేస్తున్నారు. ఈ కట్టడాలకు వీరి శిల్పకళా నైపుణ్యంతో ఆకట్టుకునేలా పనితనాన్ని చూపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశకు చేరాయి. బందరుకోటలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కంచికామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయాల వద్ద ఆలయాలు, మండపాలపై శిల్పాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆలయాల వద్ద నరసింహస్వామి, భూదేవి, విష్ణుమూర్తి, ఆంజనేయ స్వామి తదితర దేవతా విగ్రహాలు తయారు చేశారు.

ఆలయాలను చూడగానే శిల్పులు తయారుచేసిన విగ్రహాలు, డిజైన్లు కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. నిజాంపేటలో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన సీతారామాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఇక్కడ కూడా శిల్పులు వారి శిల్పకళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ఆలయం వద్ద కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణార్జునులు రథంపై పయనిస్తున్న చిత్రాన్ని శిల్పులు అందంగా తీర్చిదిద్దారు.

చాలా రాష్ట్రాల్లో పనులు చేశాం



తమ గ్రామంలో ఎక్కువగా శిల్పులే ఉన్నారు. దేవాలయాలపై దేవతామూర్తుల విగ్రహాలు, డిజైన్లు తయారు చేసే పనులకు వెళతాం. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పలు ఆలయాలకు పనిచేశాం. తాము నేర్చుకున్న శిల్ప కళను ఆలయాల వద్ద ప్రదర్శిస్తున్నాం. ఈ కళను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

– తనారి రవి, శిల్పి

స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారుల సత్తా



కె.లాస్యశ్రీ



తీర్థుసామ్‌దేవ్

విజయవాడ స్పోర్ట్స్: సౌత్ జోన్ నేషనల్ 32వ స్విమ్మింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు కె.లాస్యశ్రీ, తీర్థుసామ్ దేవ్ సత్తా చాటారు. కేరళలోని త్రివేండ్రంలో మంగళవారం ప్రారంభమైన ఈ పోటీలకు రాష్ట్రానికి వీరిద్దరూ ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. లాస్యశ్రీ 200 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాన్ని 2.29 నిమిషాల్లో చేధించి గోల్డ్ మెడల్‌ను, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగాన్ని 1.17 నిమిషాల్లో చేధించి సిల్వర్ మెడల్‌ను సాధించింది. తీర్థుసామ్‌దేవ్ 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాన్ని 17.17 నిమిషాల్లో చేధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగే ఈ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు.

30న సీజ్ చేసిన వాహనాల వేలం

మైలవరం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 28 వాహనాలను ఈ నెల 30న ఉదయం 9 గంటలకు మైలవరం ఎస్ఈబీ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ గిరిజ సత్యకుమారి మంగళవారం తెలిపారు. ఈఎమ్‌డీ (రిఫండబుల్) ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, ఆటోలు, కార్లకు రూ.10 వేలు చొప్పున చెల్లించి వేలంలో పాల్గొనాలని చెప్పారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కోసం జి. అనిల్‌బాబు, సబ్‌ఇన్‌స్పెక్టర్ 8897770007, కె.రాము కానిస్టేబుల్ 9492481841ను సంప్రదించాలన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

పామర్రు: ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలైన ఘటన పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. చాట్లవానిపురానికి చెందిన ఆటో గుడివాడ నుంచి పామర్రుకు ప్రయాణికులతో వెళ్తుంది. శ్రీనివాస రెసిడెన్సీ వద్దకు ఆటో చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా ఒక కుక్క వచ్చింది. ఆటో డ్రైవర్ దానిని తప్పించబోయి సడన్ బ్రేకు వేశారు. దీంతో ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, డ్రైవర్, మరొక వ్యక్తి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయ పడిన మహిళలను స్థానిక శృతి వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

రాష్ట్ర కబడ్డీ జట్టు శుభారంభం

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ 32వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు శుభారంభం చేసింది. జార్ఖండ్‌లోని బకారోలో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణతో తలపడి 10 పాయింట్ల తేడాతో గెలిచింది. 40 నిమిషాల నిడివి గల ఈ మ్యాచ్ తొలి 20 నిమిషాల్లో రెండు జట్లు హోరాహోరీగా తలపడి 21–21 స్కోరు నమోదు చేశాయి. తుది 20 నిమిషాల్లో ఆంధ్రా జట్టు కెప్టెన్, రైడర్ తరుణ్, డిఫెన్స్ క్రీడాకారుడు సాయి అద్భుతమైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించారు. దీంతో ప్రత్యర్థి తెలంగాణ జట్టు 37 పాయింట్లకే పరిమితం కాగా రాష్ట్ర జట్టు 47 పాయింట్లను సాధించింది. బుధవారం జరిగే రెండో మ్యాచ్‌లో రాష్ట్ర బాలుర జట్టు కేరళ జట్టుతో తలపడనుంది.

ఉర్దూ భాష అభివృద్ధికి చర్యలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉర్దూ లైబ్రరీలు, కంప్యూటర్ సెంటర్లు, ఉర్దూ భాష అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమి కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ చైర్మన్ హెచ్ నదీమ్ అహ్మద్, డైరెక్టర్/సెక్రటరీ డాక్టర్ అయూబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్ల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఉర్దూ భాషను రెండవ అధికారిక భాషగా గుర్తిస్తూ ఉర్దూ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చైర్మన్ నదీమ్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్య అయిన రెగ్యులరైజేషన్‌పై బోర్డులో తగిన నిర్ణయం తీసుకుని ప్రభుత్వం ద్వారా సమస్యను పరిష్కరిస్తామన్నారు. డైరెక్టర్ అయూబ్ హుస్సేన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంజాద్ బాష మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి పదవిని అలంకరించిన తరువాత ఆ శాఖ అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందన్నారు. ఉర్దూ భాష అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను తక్షణమే అమలు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

బాల భాస్కర శర్మ ఆధ్యాత్మిక సేవలు కొనసాగాలి



బ్రహ్మశ్రీ తేజోమూర్తుల బాల భాస్కర్ శర్మ దంపతులను సత్కరించి అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, చిత్రంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు తదితరులు

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: ఆధ్యాత్మికవేత్త తేజోమూర్తుల బాలభాస్కర శర్మ సేవలు నిరంతరం సాగాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీ మాతృశ్రీమండలి, విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో మంగళవారం బాలభాస్కర శర్మకు శ్రీవిద్యా సుధాకర బిరుదు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లాది విష్ణు మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. బాల భాస్కర శర్మ నిత్యం ప్రకాశించే భాస్కరుడని ఆయన తన ప్రసంగాల ద్వారా లక్షలాది మందిని ఆధ్మాత్మిక మార్గం వైపు నడిపిస్తునట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు యాబలూరి లోకనాథ శర్మ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో వెయ్యికుపైగా శ్రీ చక్రాలను ఒకే చోట ప్రతిష్ఠించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రసంగించారు. అతిథుల చేతులమీదుగా బాలభాస్కర శర్మకు శ్రీవిద్యా సుధాకర బిరుదు ప్రదానం చేశారు. బాల త్రిపురసుందరి బాలభాస్కర శర్మ ఆధ్యాత్మిక సేవలను వివరించారు. ధారా రామనాథశర్మ, దోగిపర్తి శంకరరావు, ఆనంద దుర్గ పాల్గొన్నారు. భరత నాట్యాచార్యుడు ఎ.సంతోష్ బృందం పలు అంశాలను ప్రదర్శించారు. నిర్వాహకులు బాలభాస్కర శర్మకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పురవీధుల గుండా ఊరేగించారు. స్వామిజీ ప్రసంగం సందేశాత్మకంగా సాగింది, శ్రీ చక్రోపాసన, లలిత సహస్రానామం అంశంగా ప్రసంగించారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్, సీఐ ఎల్. రమేష్, ఎస్సైలు

మైలవరం: చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేశామని మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. మైలవరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అమలాపురం జిల్లా పి. గన్నవరం గ్రామానికి చెందిన చీకట్ల లక్ష్మణ్ గత కొంత కాలంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కవులూరులో గత నెల 10వ తేదీన బుద్ది రాంబాబు ఇంట్లో పగలు ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి బంగారు నగలు, రూ. 52 వేలు నగదు దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీపీ మేరీ ప్రశాంతి, మైలవరం ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో నిందితులను పట్టుకోవడానికి సీఐ ఎల్. రమేష్ ఆధ్వర్యంలో టీమ్‌లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మైలవరం సీఐ రమేష్, జీ.కొండూరు ఎస్ఐ ధర్మరాజు సిబ్బందితో మైలవరం బస్టాండ్ దగ్గర ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నల్లపూసల గొలుసు, ఆరు బంగారు గాజులు, ఒక ఉంగరం, రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి, తెలంగాణ రాష్ట్రం ఎర్రుబాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసిన బంగారం సైతం స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారం 150 గ్రాములు విలువ సుమారు రూ.6.75 లక్షలు ఉంటుందని ఏసీపీ వెల్లడించారు. నిందితుడికి ప్రస్తుతం బొర్రగూడెంలో ఉంటున్న గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంకు చెందిన పెద్దగమళ్ళ విజయలక్ష్మి సహకరిస్తుందని వివరించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్స్‌ను అభినందించి రివార్డు అందించారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

పామర్రు: మండల పరిధిలోని పలు చోట్ల బైక్‌ల చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని ఎస్ఐ అవినాష్ మంగళవారం తెలిపారు. స్థానిక స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో పామర్రులోని గఫార్ సెంటర్‌లో ఒకటి, కూడలి వద్ద రెండు, కురుమద్దాలి సెంటర్‌లో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ అయ్యాయని చెప్పారు. ఇంతే కాకుండా ఈ నెల 8వ తేదీన నిమ్మకూరులో మచిలీపట్నానికి చెందిన సర్వ రామ్మోహన ప్రసాద్‌కు చెందిన వాహనం సైతం అపహరణకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ సత్యానంద్, పామర్రు సీఐ వెంకటనారాయణ పర్యవేక్షణలో వరుస మోటర్ సైకిళ్ల దొంగతనాలను ఛాలెంజ్‌గా తీసుకుని ప్రత్యేక తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. చోరీలకు పాల్పడుతున్న పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం దీవ గ్రామానికి చెందిన భట్నువల్లి ప్రసాద్, విజయవాడ టైలర్ పేటకు చెందిన జామి కిరణ్‌రెడ్డి అనే వ్యక్తులను చాకచక్యంగా పట్టుకున్నామన్నారు. నిందితులను ఈ నెల 26 న నిమ్మకూరు వద్ద ఉన్న విజయవాడ–మచిలీపట్నం హైవే రోడ్డుపై అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వారి నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని పేర్కొన్నారు.

నిర్దేశించిన సమయానికి రీ–సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): రీ–సర్వే ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో రెవెన్యూ అధికారులతో రీ–సర్వే ప్రక్రియ పురోగతిపై మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేటగిరీ–1 కింద 17 గ్రామాలు, కేటగిరీ–2 కింద 83 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్ ఇవ్వటం ద్వారా రీ–సర్వే ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. కేటగిరీ–3 కింద 64 గ్రామాల్లో చేపట్టిన రీ–సర్వే ప్రక్రియ వివిధ దశల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు చేసిన రీ–సర్వే పనులను బట్టి ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ–సర్వే చేసే ముందు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రైతులకు హద్దులు చూపించాలని స్పష్టం చేశారు. తక్కువ విస్తీర్ణం కలిగిన వారికి 90 రోజుల్లోపు రీ–సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రీ–సర్వే ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని ఏ రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన వారిని అదే డివిజన్‌లో నియమించుకోవాలని పేర్కొన్నారు. దీనికి ఆర్డీవోలు అథారిటీగా వ్యవహరిస్తారని, రెవెన్యూ డివిజన్ పరిధి దాటే వారికి జాయింట్ కలెక్టర్ నుంచి అనుమతి పొందాలన్నారు. మొబైల్ మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్న డెప్యూటీ తహసీల్దార్లకు రీ–సర్వే ప్రక్రియలో వారు నిర్వహిస్తున్న విధులపై త్వరలో శిక్షణ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు ఐ.కిషోర్, టి. పద్మావతి, విజయకుమార్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

గల్లంతైన వివాహిత మృతదేహం లభ్యం



పర్వీన్ మృతదేహం

పెనమలూరు: బందరు కాలువలో పడి గల్లంతైన వివాహిత మృతదేహాన్ని పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మెకానిక్ షేక్ బాషా కొద్ది సంవత్సరాల క్రితం పర్వీన్ (26)ను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా పర్వీన్ ఈ నెల 25వ తేదీన యనమలకుదురు లాకుల వద్ద ప్రమాదవశాత్తు బందరు కాలువలో పడి గల్లంతయింది. ఆమె కోసం గత ఈతగాళ్లు బందరు కాలువలో గాలించగా మృతదేహం లభ్యమయింది. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

కంకిపాడు: రైవస్ కాలువలో గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యమైంది. పమిడిముక్కల మండలం మంత్రివాడ వంతెన వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గుర్తించి వెలికితీశాయి. ఎస్ఐ వై.దుర్గారావు కథనం మేరకు... మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన నల్లమోతు రాజబాబు (22) అలియాస్ ఏసుబాబు కుటుంబంలో ఏర్పడిన కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఈ నెల 25న ఉప్పలూరు వంతెనపై నుంచి రైవస్‌కాలువలోకి దూకి గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం అందించారు. ఈ నెల 26న 20 మంది సభ్యులతో కూడిన రెండు బృందాలు రైవస్‌కాలువలో విస్తృతంగా గాలించింది. మంగళవారం ఉదయం గాలింపులు కొనసాగించటంతో పమిడిముక్కల మండలం మంత్రివాడ వంతెన వద్ద మృతదేహం ఉన్నట్లు గుర్తించి వెలికితీయగా నల్లమోతు రాజబాబు మృతదేహంగా బంధువులు నిర్ధారించారు. ఈ మేరకు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దుర్గారావు తెలిపారు.

క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధి శిక్షణలో కేఎల్ యూకి జాతీయ స్థాయి ర్యాంక్


జాతీయ స్థాయిలో అవార్డును చూపుతున్న వైస్ చాన్సలర్ సారథి వర్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడంలో అత్యుత్తమ పనితీరు కనపరిచిన కేఎల్ యూనివర్సిటీకి ఏఐసీటీఈ నుంచి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ లభించిందని వర్సిటీ ఉపకులపతి జి.పార్థసారథివర్మ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ వచ్చేలా, అలాగే ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించేలా ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా గత విద్యా సంవత్సరంలో ప్లేస్‌మెంట్స్‌కోసం శిక్షణ పొందిన విద్యార్థులు వంద శాతం ఉద్యోగాలను పొందారన్నారు. తమ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అనేకమంది అధ్యాపకులకు, మెంటార్లకు కూడా ఆయా రంగాల్లో ఎక్స్‌లెన్స్ అవార్డులు రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ నెల 23న న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేఎల్ విశ్వవిద్యాలయానికి ఆలిండియా మొదటి ర్యాంకును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పండ్లు, దుప్పట్ల పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): అనాథలు, పేద విద్యార్థులకు సేవ చేయాలనే ఉద్దేశంతో సర్వింగ్ సోల్జర్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించామని ఆ సంస్థ వ్యవస్థాపకులు పెంటి వంశీ, పోడూరి పవన్‌కుమార్ అన్నారు. కృష్ణలంక నిర్మల శిశుభవన్‌లోని అనాథ పిల్లలకు మంగళవారం సంస్థ సభ్యులు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అద్దంకి ఉమామహేష్, నిమ్మకూరి సన్ని, తోట సాయి, లీలాకుమార్, కొడాలి సన్ని, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ ముగింపు ఉత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలు ముగింపు ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నవంబర్ 17న ప్రారంభమైన మండల పూజ మంగళవారం ముగిసింది. ఉత్సవంలో భాగంగా ఉదయం ఐదు గంటలకు గణపతి హోమంతో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వివిధ ద్రవ్యాలతో అయ్యప్పకు అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉష పూజను రుత్విక్కులు నిర్వహించారు. అనంతరం కలశ పూజ, తదుపరి తులసిదళాలతో లక్షార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వాములకు, భక్తులకు అన్నసమారాధన జరిగింది.

నేత్రపర్వంగా కలశజ్యోతుల ఊరేగింపు

సాయంత్రం కొత్తపేట రామాలయం నుంచి స్వామి కలశజ్యోతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుడ సేవ, మేళ తాళాలతో అయ్యప్ప స్వామి దీక్షపరులచే జ్యోతులతో స్వామి ఊరేగింపు నిర్వహించారు. నృత్యాలు, వివిధ రకాల వేష ధారణతో ఊరేగింపు ముందుకు సాగింది. కార్యక్రమాలను అయ్యప్ప ఆలయ అర్చకస్వాములు కే మురళీధరన్ నంబూద్రి అధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వ నిర్ణయాలకు కట్టుబడి ఉంటాం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని ఏపీ కమర్షియల్ ట్యాక్సెస్ జీఓ, ఎన్జీఓస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి అన్నారు. మంగళవారం సాయంత్రం కమర్షియల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. అంతే కాకుండా బదిలీల విషయంలో కూడా ఉద్యోగులకు అనుగుణంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. ఏపీ కమర్షియల్ ట్యాక్సెస్ జీఓ, ఎన్జీఓస్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తగా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు పి.మోహన్‌దాస్, ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, వెంకటశ్రీనివాసరావు, కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోటలోని 17వ డివిజన్, 80వ వార్డు సచివాలయం పరిధిలో మసీద్ రోడ్డు, పుట్ట రోడ్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి అవినాష్ ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరును, సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇచ్చి పేదవారి సొంతింటి కలను సాకారం చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి స్టే తీసుకురావడం చాలా దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు ఇస్తూ ఉంటే వాటిని తొలగిస్తున్నారని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నానరు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని పెన్షన్లు ఇచ్చారు, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఎన్ని పెన్షన్లు ఇచ్చారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి, మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్ నాయకత్వాన్ని కోట్లాది మంది ప్రజలు సమర్థిస్తున్నారన్నారు. రాబోయే 30 ఏళ్లు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు డి.వెంకటేశ్వరరావు, బుచ్చిబాబు, దామోదర్, బాలరాజు, తిరుపతిరెడ్డి, సుజాత, జయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషా దినోత్సవం వేడుకలు


విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న అతిథి ఖాశింబీ, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్


ఖాశింబీని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భాషా వికాసం ద్వారా భారతీయుల మధ్య ఐకమత్యం, సంస్కృతి పెంపొందించుకోవచ్చని విశ్రాంత హిందీ అధ్యాపకురాలు షేక్ ఖాశింబీ పేర్కొన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగు, హిందీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో భాషా దినోత్సవ వేడుకలు కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఖాశింబీ అతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ భాషల సాహిత్యాన్ని వివిధ దేశాల్లోని ప్రజలు అనువాదం ద్వారా తెలుసుకోవడం శుభ పరిణామమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా కళాశాల డీన్ రాజేష్ సి జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు హాజరయ్యారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలుగు వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారిని అభినందించారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయల వేషధారణతో పాటుగా గేయాలాపన, భాష ఔన్నత్యాన్ని తెలియజేసేలా నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల అనంతరం ఖాశింబీని విద్యార్థులు, అధ్యాపకులు సత్కరించారు. హిందీ విభాగాధిపతి జయలక్ష్మి, తెలుగు విభాగాధిపతి శివకుమార్, అధ్యాపకులు ఎం.భవ్య, శారద, జితేంద్రకుమార్, అనిల్ బాబు, నీరజ పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, వేదికమీద గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని, వారి సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి అన్నారు. నిర్మాత కాంతారావు అని శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీకళాభారతి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో మంగళవారం సినీ నటుడు కాంతారావు శత జయంతి వేడుకలు, శ్రీ కళాభారతి క్యాలెండర్ ఆవిష్కరణ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ తన నటన ద్వారా ఎందరో నటులకు స్ఫూర్తిగా నిలిచినట్లు తెలిపారు. ప్రభుత్వం కళాకారుల సంక్షేమకోసం కృషి చేస్తోందన్నారు. నవరత్నాలతో నవోదయం కలుగుతోందని తెలిపారు. 2023 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ఆయన అనేక విజయవంతమైన చిత్రాలలో నటించారని కొన్ని సినిమాలను నిర్మించినట్లు తెలిపారు. శ్రీకళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ కాంతారావు జీవిత విశేషాలను వివరించారు. వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, డేవిడ్‌రాజు, ఝాన్సీ, మల్లాది స్వాతి, కే దుర్గానాగమణి, విజయశ్రీ గుప్తా ప్రసంగించారు. గాయనీ గాయకులు పలు క్లాసికల్ చిత్రాలలోని గీతాలను ఆలపించారు.

పందుల పెంపకం దారులపై చార్జిషీట్లు దాఖలు చేయాలి


కేసులను విచారిస్తున్న మున్సిపల్ న్యాయమూర్తి రామ్మోహన్

పటమట(విజయవాడతూర్పు): నగర వీధులలో జనావాసాలలోకి వస్తున్న పందులపై చర్యలలో భాగంగా పందులపెంపకం దారులపై చార్జిషీట్లను మొబైల్ కోర్టులో దాఖలు చేయాలని మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి యూ రామ్మోహన్ అధికారులకు సూచించారు. సర్కిల్-3 పరిధిలో మంగళవారం మొబైల్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై చెత్త వేస్తున్న, జనావాసాలకు అసౌకర్యం కలిగించే వ్యక్తులు, సంస్థలు, ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులుపై దాఖలైన 26 కేసుల విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆయా కేసుల్లో నిందితులకు రూ.11,140 జరిమానా విధించి మరోమారు ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు నిత్యం ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ అమ్మే షాపులను తనిఖీ చేసి కఠినంగా నిషేధాన్ని అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ డాక్టర్ ఏ రవిచంద్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడంలో ముందంజ

ఘనంగా కోస్టల్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం


చెక్కును అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, రామన్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలోనూ తమ బ్యాంకు ముందంజలో ఉంటుందని కోస్టల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ బి.వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. గాయత్రీనగర్‌లోని బ్యాంకు ప్రధాన కార్యక్రమంలో మంగళవారం కోస్టల్ బ్యాంకు 23వ వ్యవస్థాపక దినోత్సవ ఘనంగా జరిగింది. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ బోర్డుకు రూ.1,69,500ను విరాళంగా కోస్టల్ బ్యాంకు సీఈఓ అందజేశారు. బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ రామన్, బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.మదన్‌మోహన్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కోచ్

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) లీగ్ తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో గుణదలలోని రాజా రామ్మోహన్‌రాయ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గొల్లపూడిలో ఇటీవల జరిగిన పోటీలకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాల క్రీడాకారులు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అండర్-17 బాలుర విభాగంలో భిస్వాజిత్‌బాగ్, బి.నిశాంత్, డి.జయసత్య స్వర్ణ పతకాలు సాధించారు. జి.కార్తికేయ, ఐ.సాయివిఘ్నేష్, జె.పృధ్వీరాజ్ రజిత పతకాలు, బాలికల విభాగంలో పి.కృష్ణప్రియ, ఎం.సిరివల్లి స్వర్ణ పతకాలు సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో కె.విష్ణుప్రణతి స్వర్ణం, కె.తను రజితం, బాలుర విభాగంలో జి.భువనేష్, ఆర్.నీరజ్‌కుమార్ కాంస్యం సాధించారు. స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికై ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపల్ వై.మదన్‌మోహన్‌రావు, కోచ్ అంకమ్మరావు పాఠశాలలో మంగళవారం అభినందించారు.

హడావుడి చేసింది మతిస్థిమితం లేని వ్యక్తే

ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాసరావు


మీడియాతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఓ ఇంటిలోకి చొరబడేందుకు ప్రయత్నించింది మతిస్థితిమితం లేని వ్యక్తేనని పోలీసులు తేల్చారు. సింగ్‌నగర్‌లో ముగ్గురు దొంగలు హల్‌చల్ అని.. వచ్చిన వారు చడ్డీగ్యాంగ్ కానీ, అంతరాష్ట్ర దొంగలై ఉండొచ్చని స్థానిక ప్రజలు పడిన అపోహలను వారు నివృత్తి చేశారు. ఇన్‌చార్జి డీసీపీ కె.శ్రీనివాసరావు ఆ వివరాలను మంగళవారం మీడియాకు వివరించారు. సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో సోమవారం తెల్లవారుజామున అంతరాష్ట్ర దొంగలు, చడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేశారంటూ స్థానిక ప్రజలు భయాందోళనకు గురైన సంగతి తెలిసిందే. సమాచారం అందుకున్న ఆయన మంగళవారం సంఘటనా స్థలాన్ని పోలీసు బృందాలతో పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగ్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో చడ్డీ గ్యాంగ్ కానీ, ఇతర దొంగలు కానీ ఎవరూ లేరన్నారు. అస్సాంకు చెందిన ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రైలు దూకి ఇటుగా వచ్చి ఆ ఇంటిలోకి చొరబడినట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో సీసీ ఫుటేజ్‌లు, అతడి వేలిముద్రలు, పరిశీలించామన్నారు. ఏమైనా నేర చరిత్ర కలిగిన వ్యక్తా అని అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అస్సాం భాష మాట్లాడే వారితో కూడా అతనితో మాట్లాడించామని పేర్కొన్నారు. తమ విచారణలో అతను మతిస్థిమితం లేని వ్యకి అనిని తేలినట్లు స్పష్టంచేశారు. ప్రజలెవరూ ఇటువంటి పుకార్లు నమ్మి భయపడాల్సిన పనిలేదన్నారు. ఏసీపీలు రవికాంత్, రమణమూర్తి, సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ వ్యక్తి అదృశ్యంపై కృష్ణలంక పోలీసస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు కృష్ణలంక, సత్యనారాయణనగర్‌కు చెందిన ఆర్.కిషోర్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈయనకు వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో 12 సంవత్సరాలుగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో నవంబర్ నాల్గో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టపక్కల, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి గంగాధరరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్షన్లపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక పెన్షన్లపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదని వైఎస్సార్ సీపీ వికలాంగుల విభాగం అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షన్లు తీసేస్తున్నారంటూ టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉండగా పెన్షన్ల తీసుకోవడానికి వృద్ధులు, వికలాంగులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ఏ ఒక్కరి పెన్షన్ రద్దు కాదని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచుతూ పోతున్నారని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్బయ్య స్వామికి ప్రీతికరమైన సింధూరం, ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ధనుర్మాస ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రైతుల సంక్షేమానికి, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సమీపంలో బందరు కాలువ గట్టున మార్కెటింగ్ శాఖ అధ్వర్యంలో రూ.98.24 లక్షల వ్యయంతో నిర్మించిన కృష్ణలంక రైతుబజార్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు రైతుబజార్ల ద్వారా గిట్టుబాటు ధర కల్పించి వారిని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినియోదారులకు అందుబాటులో ఉండేలా కొత్త రైతుబజార్లను ఏర్పాటు చేయడం, విస్తరించడం, నాడు నేడు కార్యక్రమం ద్వారా ఆధునికీకరించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతుబజార్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని, రూ.5 కోట్లతో 38 రైతుబజార్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వీటికి అదనంగా రూ.38 కోట్లతో 58 రైతుబజార్ల నిర్మాణం చేపట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 11 రైతుబజార్లకు అదనంగా కృష్ణలంక రైతుబజార్‌తో 12 రైతుబజార్లు ఉన్నాయన్నారు. జిల్లాలో మరో మూడు రైతుబజార్లు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రైతుల సంక్షేమాన్ని, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వినియోగదారులపై భారం పడకుండా రైతులకు నష్టం జరగకుండా వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇటీవల టమాటా ధర రూ.70 ధర ఉన్నప్పుడు వినియోగదారులపై భారం పడకుండా రూ.40కే అందించామని గుర్తు చేశారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోను ఒక ప్రైమరీ ప్రోసెసింగ్ సెంటర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారుల అవసరాలకు పోను మిగిలిన ఉత్పత్తులను ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ నిధులతోనే పూర్తి చేసి, కేవలం నిర్వహణను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ రైతుబజార్ల ద్వారా అవకాశం కల్పించావన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నూపూర్ అజయ్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, రైతుబజార్ల సీఈఓ ఎం.నందకిషోర్, మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ దివాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్, ఈఓ విక్టర్, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి పాల్గొన్నారు.


రైతుబజార్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో దేవినేని అవినాష్, అడపా శేషు, గౌతమ్‌రెడ్డి, జేసీ నుపూర్ అజయ్‌కుమార్ తదితరులు

ప్రభుత్వ పనితీరును వివరించే బాధ్యత వార్డు కన్వీనర్లదే


సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించే బాధ్యత ఆయా వార్డు కన్వీనర్లదేనని విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పేర్కొన్నారు. స్థానిక పరిటాల ఓంకార్ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని 2, 3, 4, 5, 6, 7, 8 వార్డు కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు గుబ్బా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు ప్రజల వద్దకే పాలనంటూ ప్రచార్భాటాలు చేశాయన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజల చెంతకే పాలనను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా అర్హులకే అందిస్తున్నారన్నారు. సచివాలయాలు ఏర్పాటుతో అవినీతి గణనీయంగా తగ్గిందన్నారు. పేదల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి, ప్రజలను పార్టీకి దగ్గర చేయాలని వార్డు కన్వీనర్లకు సూచించారు. పార్టీ నాయకులు, వలంటీర్లు, అధికారులు సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడే కడియాల బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇమామ్‌బాషా

పటమట(విజయవాడతూర్పు): ఉర్దూ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించామని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.ఎస్.ఇమామ్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. పటమటలోని సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్రా కార్యాలయంలో ఆయన్ను కలిసి తమ సమస్యలను విన్నవించామని పేర్కొన్నారు. ఉర్దూ స్కూళ్లలో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల్లో ఉర్దూ విషయ పరిజ్ఞానం ఉన్న టీచర్లనే నియమించాలని, క్రమబద్ధీకరణలో భాగంగా ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:15గా పరిగణించాలని వినతి పత్రంలో పేర్కొన్నామన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రూట స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్లు అబ్దుల్ మునాఫ్, ముస్తాక్ హుస్సేన్, అసిస్టెంట్ ఫైనాన్స్ సెక్రెటరీ ఎండీ రఫీ, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సమి ఉల్లా, ఏలూరు జిల్లా నాయకుడు షేక్ ఇస్మాయిల్ ఉన్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని జవహర్ ఆటోనగర్ మురుగునీటిని శుద్ధి చేసే 10 ఎం.ఎల్.డి. సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఈ ప్లాంట్‌ను మంగళవారం పరిశీలించి అభివృద్ధి పనులల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్లాంట్ ఆవరణలో ఆహ్లాదకరంగా ఇండస్ట్రియల్ వాతావరణ ప్రతిబించేలా గ్రీనరీని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈఈ కె.వెంకటేశ్వర రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు ఆంధ్రాలో తిరుగుతారు.. హైదరాబాద్‌లో నిద్రపోతారు

- రాజధాని నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.7 వేల కోట్లు ఇచ్చినా ఏమీ జరగలేదు
- దళితుల అభివృద్ధికి కేంద్రం రూ.32 వేల కోట్లిచ్చింది
- డబ్బులు కేంద్రానివి.. స్టిక్కర్లు రాష్ట్రానివా!
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

గుంటూరు (వెస్ట్): ప్రతిపక్ష నేత చంద్రబాబు పగలు ఆంధ్రాలో తిరుగుతూ.. రాత్రికి మాత్రం హైదరాబాద్ వెళ్లి నిద్రపోతుంటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌లో తొలగించిన 26 పథకాలు అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న 48 గంటల నిరసన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం రూ.7 వేల కోట్లు ఇస్తే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క భవనం కూడా పూర్తి చేయకుండా చేతులెత్తేశారని విమర్శించారు. 2014 నుంచి దళితుల అభివృద్ధికి కేంద్రం రూ.32 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. జాతీయ ఎస్సీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా దళితులకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలిచ్చే పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఇందులో 50 శాతం సబ్సిడీని కేంద్రమే భరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని నీరు గార్చేశారని ఆరోపించారు. దీంతోపాటు రాష్ట్రంలో ఉన్న లక్ష బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీని చేయకుండా దళితులపై సీఎం జగన్ చిన్నచూపు చూస్తున్నారన్నారు. కేంద్రం మన రాష్ట్రంలో రూ.3 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని, రూ.65 వేల కోట్లతో రోడ్లు నిర్మించిందని చెప్పారు. అయితే డబ్బులు కేంద్రానివి.. స్టిక్కర్లు మాత్రం రాష్ట్రానివి అన్నట్టుగా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. కుటుంబ పాలన కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అసత్యాలను ప్రచారం చేస్తూ అభివృద్ధిని పక్కన పెట్టేశారని విమర్శించారు. ఓట్లకోసం సంక్షేమ బాటపట్టిన ముఖ్యమంత్రికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, మాగంటి సుధాకర్ యాదవ్, యామిని శర్మ తదితరులు పాల్గొన్నారు.

2022 రౌండప్

అభివృద్ధిలో అగ్రగామి



2021-22లో దేశంలోనే అత్యధిక వృద్ధి సాధించిన ఘనత ఏపీకి

- స్థిర ధరల ఆధారంగా 11.43 శాతం ఏపీలో అత్యధిక వృద్ధి
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు మంత్రిత్వ శాఖతో పాటు ఆర్‌బీఐ వెల్లడి
- వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో రెండంకెల వృద్ధి
- కోవిడ్ సంక్షోభంలోనూ వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ఏపీలో అత్యధిక ప్రాధాన్యత
- ఆదాయం తగ్గినా ప్రజల జీవనోపాధి కోసం నిరాటంకంగా 'నవరత్నాలు' అమలు
- ప్రజల కొనుగోలు శక్తి పెరగడంవల్లే వృద్ధిలో ఏపీ నంబర్ వన్
- 2021–22లో 12.78 శాతం మేర ఏపీలో పారిశ్రామిక రంగం వృద్ధి
- బాబు హయాంలో ఏనాడు ఈ రంగంలో రెండంకెల వృద్ధిలేదు

2021-22లో కేంద్రం విడుదల చేసిన నివేదిక మేరకు స్థిర ధరల ఆధారంగా రాష్ట్రాల జీఎస్‌డీపీల శాతం ఇలా..

రాష్ట్రం	2021-22
ఆంధ్రప్రదేశ్	11.43
రాజస్థాన్	11.04
బిహార్	10.98
తెలంగాణ	10.88
ఢిల్లీ	10.23
ఒడిశా	10.19
మధ్యప్రదేశ్	10.12
హరియాణా	9.80
కర్ణాటక	9.47
త్రిపుర	8.69
సిక్కిం	8.57
హిమాచల్‌ప్రదేశ్	8.35
మేఘాలయ	8.19
జార్ఖండ్	8.15
తమిళనాడు	7.99
కేరళ	7.10
పంజాబ్	6.94
ఉత్తరాఖండ్	6.13
ఉత్తరప్రదేశ్	4.24

పారిశ్రామిక వృద్ధి ఇలా..


ఇక పారిశ్రామిక రంగం విషయానికొస్తే.. 2018–19లో చంద్రబాబు హయాంలో 3.17 శాతమే వృద్ధి నమోదు కాగా అదే 2021–22లో 12.78 శాతంతో రెండంకెల వృద్ధి నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం అవలంబించిన విధానంతో పాటు పారిశ్రామిక రాయితీలను సకాలంలో విడుదల చేసింది. 2021–22లో సాధారణ కేటగిరిలో 1,046 ఎంఎస్‌ఎంఈలకు రూ.191.10 కోట్ల రాయితీలను విడుదల చేసింది. ఓబీసీ కేటగిరిలో 479 ఎంఎస్‌ఎంఈలకు రూ.101.31 కోట్ల రాయితీలను విడుదల చేసింది. వైఎస్సార్ నవోదయం పేరుతో ఒకసారి ఎంఎస్‌ఎంఈ రుణాల పునర్వ్యవస్థీకరణ అమలుచేశారు. ఏకంగా 1,78,919 ఖాతాలకు సంబంధించిన రుణాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. దీంతోపాటు 2021–22లో రూ.1,762.31 కోట్ల పెట్టుబడితో 5,907 ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటవ్వడంతో 37,604 మందికి ఉపాధి లభించింది. అలాగే, కోవిడ్ కష్టాల్లోనూ పాక్షిక ఆంక్షలు, నిబంధనలు అమలుచేయడంతో సేవా రంగంలో కూడా 2021–22లో 9.73 % వృద్ధి నమోదైంది. అదే 2018–19 బాబు హయాంలో కేవలం 4.84 శాతమే.

సాక్షి, అమరావతి

వృద్ధి రేటు పరంగా 2022లో ఆంధ్రప్రదేశ్ రికార్డు నెలకొల్పింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు నమోదు చేసిన రాష్ట్రంగా నిలిచింది. కోవిడ్ సంక్షోభంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబించిన విధానాలు, ప్రోత్సాహకాల కారణంగా 2021–22లో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో భారీ వృద్ధి నమోదైంది. కోవిడ్‌కు ముందు 2018–19 చంద్రబాబు హయాంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వృద్ధి కేవలం సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. అయితే, 2021–22లో స్థిర ధరల ఆధారంగా వ్యవసాయ రంగంలో 11.27 శాతంతో రెండంకెల వృద్ధి నమోదు కాగా.. పారిశ్రామిక రంగంలో ఏకంగా 12.78 శాతంతో రెండంకెల వృద్ధి నమోదైంది. సేవా రంగంలో కూడా 2018–19 కన్నా 2021–22లో 9.73 శాతం వృద్ధి నమోదైంది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 11.43 శాతం వృద్ధి

మరోవైపు.. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధి సాధించినట్లు ఆర్‌బీఐతో పాటు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదికలు ఇటీవలే వెల్లడించాయి. ఇదే 2018–19 చంద్రబాబు హయాంలో 5.36 శాతమే వృద్ధి నమోదైంది. కోవిడ్ సంక్షోభంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు అండగా నిలవడంవల్లే సాధారణ పరిస్థితులకు మించి రెండంకెల వృద్ధి నమోదవ్వడానికి కారణమని తేలింది. కోవిడ్ కారణంగా రాష్ట్ర సొంత ఆదాయంతో పాటు కేంద్రం నుంచి వచ్చే నిధుల వాటాలో తగ్గుదల ఉన్నప్పటికీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుంటుపడకుండా అవసరమైన ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించడంతోనే ఈ రంగాలు నిలదొక్కుకుని దేశంలోనే అత్యధిక వృద్ధి సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలబడింది. ఆదాయ వనరులు తగ్గినప్పటికీ కూడా ప్రజల జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు' పథకాలను నిరాటంకంగా అమలుచేసింది. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో ఆ ప్రభావం రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధిపైన స్పష్టంగా కనిపించింది. అలాగే, కోవిడ్ ఆంక్షలున్నప్పటికీ వ్యవసాయ, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. రైతులకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని చెప్పిన తేదీకి ఇవ్వడమే కాకుండా రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం, రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించడం వంటి చర్యలను ప్రభుత్వం పక్కాగా అమలుచేసింది. దీనివల్లే.. 2021–22లో వ్యవసాయ రంగం వృద్ధి 11.27శాతంగా నమోదైంది. అదే 2018–19లో కేవలం 3.54కు పరిమితమైంది.



షాపుల కేటాయింపులో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించలేదు

- ఆ షాపుల యజమానులే వేలం ప్రక్రియలో పాల్గొనలేదు
- హైకోర్టుకు స్వయంగా హాజరై నివేదించిన శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న

సాక్షి, అమరావతి: శ్రీశైలంలోని వ్యాపారులకు లలితాంబిక వ్యాపార సముదాయంలో షాపులు కేటాయించే వ్యవహారంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏ దశలోనూ ఉల్లంఘించలేదని శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న మంగళవారం హైకోర్టుకు నివేదించారు. కోర్టు ఉత్తర్వులంటే తమకు ఎనలేని గౌరవం అని లవన్న తరఫు న్యాయవాది అశోక్ రామ్ కోర్టుకు విన్నవించారు. షాపుల కేటాయింపుపై రాద్ధాంతం చేస్తున్న పిటిషనర్లు, అసలు షాపుల వేలం ప్రక్రియలో పాల్గొనలేదని, అందువల్ల వారు షాపులు పొందలేకపోయారని తెలిపారు. షాపుల కేటాయింపు కోసం వారు వినతిపత్రం సమర్పిస్తే, దానిని పరిగణనలోకి తీసుకుని మరోచోట షాపులు కేటాయిస్తామన్నారు. 8 నెలల కాలంలో 24 పిటిషన్లు దాఖలు చేసి, షాపుల కేటాయింపు విషయంలో ముందుకెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. షాపుల కేటాయింపు కోసం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.24 లక్షలకు చేరిందని తెలిపారు. పిటిషనర్లు కోర్టును ఆశ్రయించే నాటికే షాపుల కూల్చివేత పూర్తయిందన్నారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది ఎం.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాలున్నా ఈవో ఆదేశాల మేరకు పిటిషనర్ల షాపులను అధికారులు కూల్చేశారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్.. షాపుల కేటాయింపు కోసం ఈవోకు వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించారు. ఆ వినతి ఆధారంగా షాపుల కేటాయింపులో నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవాలని ఈవోకు స్పష్టం చేశారు. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

రక్షిత మంచినీటి పథకాల నిర్వహణలో భాగస్వామ్యం పెంచండి

జలజీవన్ మిషన్‌పై వర్క్‌షాప్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణలో స్థానికుల భాగస్వామ్యం పెరిగినప్పుడే ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా తాగునీటి సరఫరాకు అవకాశం ఉంటుందని గ్రామీణ మంచినీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) ఉన్నతాధికారులు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్, యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాల అధికారులు, ఎన్జీవో ప్రతినిధులతో రెండు రోజుల వర్క్‌షాప్ విజయవాడలో ప్రారంభమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి, జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరేరామ్ నాయక్, సీఈలు గాయత్రిదేవి, సంజీవరెడ్డి, రవికుమార్ అధికారులు, ఈ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఎన్జీవో ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు 40 ఎన్జీవో సంస్థలకు చెందిన 600 మంది ప్రతినిధులకు బాధ్యత అప్పగించింది.

జిల్లా వార్తలు

అల్లుకుపోతున్న చిన్నారులు

- చదువుతోపాటు క్రాఫ్ట్స్ కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ
- వ్యర్థానికి సరికొత్త అర్థం చెప్పి అందమైన కళాకృతులను రూపొందిస్తున్న బాలలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుట్లు, అల్లికల్లో పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఒక వైపు చదువుకుంటూనే క్రాఫ్ట్స్‌లోనూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వ్యర్థాలకు సరైన అర్థం చెప్పి అందమైన కళాకృతులను రూపొందిస్తున్నారు. గృహోపకరణాలు, అలంకరణ వస్తువులను తయారు చేసి అబ్బురపరుస్తున్నారు.

చదువుతోపాటు శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు వృత్తివిద్యలోనూ శిక్షణ ఇచ్చేందుకు గతంలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి టైలరింగ్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేవారు. ఆయా కోర్సుల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు శిక్షణనిచ్చేవారు. కాలానుగుణంగా చాలా చోట్ల ఈ కోర్సులు కనుమరుగయ్యాయి. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల స్థానాలను తిరిగి భర్తీ చేయలేదు. అయితే ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ, వీరులపాడు, నున్న పాఠశాలల్లో ఈ కోర్సులు కొనసాగుతున్నాయి. విజయవాడ నగరంలోని ఏకేటీపీఎం ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్‌లో విద్యార్థులు శిక్షణ నిస్తున్నారు. టైలరింగ్‌లో ప్రత్యేకంగా హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఊలుతో అల్లికలు నేర్పిస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా చిన్నారులకు క్రాఫ్ట్స్ నేర్పిస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల శిక్షణలో విద్యార్థులు రాటు తేలుతున్నారు. తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటున్నారు. వారి చేతిలో అద్భుతమైన కళాకృతులు రూపుదిద్దుకుంటున్నాయి. చదువులో పోటీ పడుతూనే వివిధ అంశాల్లో వారి సృజనను నిరూపించుకుంటున్నారు.



విజయవాడ ఏకేటీపీఎం ఉన్నత పాఠశాలలో ఊలుతో వివిధ వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్న క్రాఫ్ట్ టీచర్ లక్ష్మీకుమారి

6 నుంచి 9 తరగతి విద్యార్థులకు శిక్షణ

ఏకేటీపీఎం పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్రాఫ్ట్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. హ్యాండ్ ఎంబ్రాయిడరీ, వాల్ డెకరేషన్, ఇయర్ రింగ్స్, వ్యర్థాలతో వాల్ డెకరేషన్, వాడేసిన బాటిళ్లతో పూలకుండీల తయారీ, కుక్కర్ రబ్బరుతో వాల్ అలంకరణలు, పేపర్ కటింగ్స్‌ను అందంగా తయారు చేస్తున్నారు. శిక్షణతో తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటున్నారు. చిన్నారులు తయారు చేసిన గాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



విద్యార్థులు తయారుచేసిన గాజులు, చెవిబుట్టలు, హారం

దారాలతో పూసలు జత చేసిన తయారు చేసిన గాజులు అబ్బురపరుస్తున్నాయి. హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్‌లో మిషన్ వేగం ప్రదర్శిస్తున్నారు. దుస్తులపై చక్కటి పూలు, బొమ్మలను ఎంబ్రాయిడరీ చేసి ఆకట్టుకుంటున్నారు.

అల్లికలు నేర్చుకుంటున్నా



పాఠశాలల్లో క్రాఫ్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఊలుతో అల్లికలు నేర్చుకుంటున్నా. హ్యాండ్ ఎంబ్రాయిడరీ నేర్చుకుని చీరలు, దుస్తులపై బొమ్మలు వేస్తున్నాను. ఊలుతో వాల్ డెకరేషన్స్, డోర్ హ్యాంగింగ్స్ చేయగలుగుతున్నా. చదువుకుంటూనే క్రాఫ్ట్స్ నేర్చుకోవడం ఆనందంగా ఉంది. ఈ శిక్షణ నా భవిష్యత్‌కు ఉపయోగపడుతుంది.

– సాయి అంబిక, 8వ తరగతి

గాజుల తయారీ నేర్చుకున్నా



రంగు రంగుల దారాలతో అందమైన గాజులు తయారు చేయడం నేర్చుకున్నా. ప్రస్తుతం నేను సొంతంగా వివిధ డిజైన్లతో గాజులు చేస్తున్నాను. పూర్తిగా దారాలు, పూసలు మాత్రమే వినియోగిస్తున్నా. మేం చేసిన గాజులు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటికి తోడు సన్నని తీగతో ఇయర్ రింగ్స్ తయారీ నేర్చుకుంటున్నా.

– దరహాసిని, 8వ తరగతి

భవిష్యత్‌కు ఎంతో ఉపయోగం



విద్యార్థులకు చదువుపాటు ఏదో ఒక అంశంపై పట్టు ఉండాలి. క్రాఫ్ట్స్ శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్నారు. గాజులు, ఇయర్ రింగ్స్, ఎంబ్రాయిడరీ వర్క్ అద్భుతంగా చేస్తున్నారు. పేద విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు క్రాఫ్ట్స్‌లో శిక్షణ భవిష్యత్‌కు దోహదపడుతుంది. మల్టీటాలెంటెడ్ విద్యార్థులు చాలా మంది ఉన్నారు. శిక్షణలో అల్లుకుపోతున్నారు.

– డి.వి.లక్ష్మీకుమారి, క్రాఫ్ట్ టీచర్

నాణేభిషేక ప్రియుడే.. శరణమయ్యప్ప

కోడూరు(అవనిగడ్డ): పుష్ప పరిమళాలు.. వేదపండితుల మంత్రోచ్చరణ.. కేరళ సంప్రదాయ పూజలు.. మంగళవాయిద్యాలు.. భక్తులు అయ్యప్ప నామస్మరణ మధ్య హరిహరసుతుడికి మంగళవారం నాణేభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామి ఆలయంలో 18వ మండలి పడిపూజోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి లక్ష రూపాయి నాణేలతో కనులపండువగా అభిషేకం నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరుతో పాటు దివిసీమ ప్రాంతానికి చెందిన 40 మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉభయదాతలు ఒకొక్కరు రూ.2500 చొప్పున రూపాయి నాణేలతో స్వామిని అభిషేకించారు. ఉభయదాతలు తొలుత రూపాయి నాణేలను ఆలయం ప్రాంగణంలో ఊరేగించారు. 'నాణేభిషేక ప్రియుడే.. శరణమయ్యప్ప' అంటూ భక్తులు నాణేలను స్వామివారి ఉత్సవమూర్తికి పోసి తమ భక్తిభావం చాటుకున్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం పులకించింది.



నాణేభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు

కోడూరుకు చెందిన బూరగడ్డ వంశీయులు కర్తలుగా వ్యవహరించి అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పండితులు కొమ్మూరి శ్రీనివాసశర్మ, ముట్నూరి శాస్త్రి పర్యవేక్షణలో కలశ పూజ, సహస్ర దీపాలంకరణ సేవ, పుష్పార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు. రాత్రికి మహాపడి పూజ, పడిహారతి జరిగాయి. బుధవారం స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపారు.

వైట్‌కోటు అలంకరణ కాదు.. బాధ్యత

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యులకు వైట్ కోటు అనేది అలంకరణ కాదని, అది వారి బాధ్యతను తెలియజేస్తుందని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో 2022–23 బ్యాచ్ కొత్తగా చేరిన వైద్య విద్యార్థులకు మంగళవారం వైట్‌కోట్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.విఠల్‌రావు వైట్ కోట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారితో వైట్ కోట్ ధరింపచేసి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైద్య విద్యలో సీటు సాధించడంతో లక్ష్యం పూర్తికాదని, ఎంతో కష్టపడి చదవాలని సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం మొదటి ఏడాది విద్యార్థులు నాలుగు ప్రయత్నాల్లో ఉత్తీర్ణులు కాకుంటే సీటు రద్దు చేస్తారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్. విఠల్‌రావు మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లోకి వైద్య వృత్తి గొప్పదన్నారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్–19 సమయంలో వైద్యులు అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఒకవైపు కోవిడ్‌తో రోగులు ప్రాణాలు విడుస్తున్నా, తమ కళాశాలలోని పీజీలు, హౌస్‌సర్జన్‌లు ఆ మృతదేహాల మధ్యలోనే రోగులకు సేవలు అందించారని గుర్తుచేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్తగా చేరిన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటకృష్ణ, పలు విభాగాల ప్రొఫెసర్లు, సిబ్బంది, వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాసరావు. చిత్రంలో ప్రిన్సిపాల్ విఠల్‌రావు తదితరులు

వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ టాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ అసోసియేషన్ సభ్యులు మంగళవారం విజయవాడ నగరంలోని తమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వట్టిపల్లి రామస్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.మోహన్‌దాస్, ఉపాధ్యక్షులుగా వేమూరి అజయ్‌కుమార్, సింహాద్రి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మురికిపూడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆర్.వెంకటలక్ష్మీనాగవరప్రసాద్, గుంటుపల్లి శశిధర్, కోశాధికారిగా చింతా సువర్ణరాజు బాధ్యతలు స్వీకరించారని అధ్యక్షుడు రామస్వామి తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన రామస్వామి తదితరులు

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కొత్తగా ఎంపికైన డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు(డీవీఎంసీ), పోలీస్, న్యాయ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 93 నమోదయ్యాయని తెలిపారు. 91 కేసులకు సంబంధించి బాధితులకు రూ.1.03 కోట్ల పరిహారం అందించామని పేర్కొన్నారు. అత్యధికంగా విజయవాడ డివిజన్‌లో 68, నందిగామ డివిజన్‌లో 20, తిరువూరులో ఐదు కేసులు నమోదయ్యాయని వివరించారు. అట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యం సరికాదని, సరైన విచారణ చేపట్టి త్వరితగతిన పరిహారం చెల్లించాలని అధికారులకు సూచించారు. ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? రాజీ అయిన కేసులు ఎన్ని? ఎంత మందికి శిక్ష పడింది? అన్న అంశాలపై కలెక్టర్ చర్చించారు. మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కుల ధ్రువీకరణ పత్రాలు జాప్యం లేకుండా త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ కులాలు, తెగలకు సంబంధించిన డప్పు కళాకారులకు పెన్షన్ పొందేందుకు గుర్తింపు కార్డులను కూడా అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి.వి.విజయభారతి, డీఎస్పీ ఎం.సత్తిబాబు, తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి, డ్వామా పీడీ జె.సునీత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 28-12-2022

ఈనెల 6 నుంచి 18 వరకు ఫ్రాన్స్‌లోని 'ఇండియన్ యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, నాన్ట్స్'లో 'ఇండియా- ఆఫ్రికా టువార్డ్స్ ఎ డైలాగ్ ఆఫ్ హ్యూమానిటీస్' సదస్సు జరిగింది. ఆదివాసీల సంస్కృతి, సంగీతం గురించిన సమగ్ర పరిశోధనకు ఉపకరించే ఆ కార్యక్రమానికి ఆహ్వానితులుగా హాజరైన ప్రొఫెసర్ గూడూరు మనోజ ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారు.

ఆది పరిశోధన

ప్రొఫెసర్ మనోజతో మాటా మంతి


పచ్చి వెదురు గడలో గింజలు వేసి, పైన బొమ్మలు చెక్కిన వాద్యపరికరం బాసురి (రెయిన్ మేకర్)ని చూపిస్తున్న ప్రొ॥ మనోజ

''నేను పుట్టింది వరంగల్‌లో. మా నాన్న డీపీఓ. ఆయన బదలీల రీత్యా నా ఎడ్యుకేషన్ తెలంగాణ జిల్లాల్లో ఏడు స్కూళ్లు, నాలుగు కాలేజీల్లో సాగింది. పెళ్లి తర్వాత భర్త ఉద్యోగ రీత్యా మహారాష్ట్ర, నాందేడ్‌కి వెళ్లాను. అక్కడే ఇరవై ఏళ్లు నాందేడ్‌లోని స్వామి రామానంద తీర్థ మరాఠ్వాడా యూనివర్సిటీకి చెందిన 'స్కూల్ ఆఫ్ లాంగ్వేజ్, లిటరేచర్ అండ్ కల్చర్ స్టడీస్'లో లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను. ఆ తర్వాత నిజామాబాద్‌లో కొంతకాలం చేసి, మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీ నుంచి 2021లో రిటైరయ్యాను.

■ **సంగీతసాధనాల అధ్యయనం**

ఫ్రాన్స్ సమావేశం గురించి చెప్పడానికి ముందు నేను ఎందుకు ఈ పరిశోధనలోకి వచ్చానో వివరిస్తాను. నా ఉద్దేశంలో ఉద్యోగం అంటే రోజుకు మూడు క్లాసులు పాఠం చెప్పడం మాత్రమే కాదు, యువతకు వైవిధ్యమైన దృక్పథాన్ని అలవరచాలి. నా ఆసక్తి కొద్దీ మన సంస్కృతి, కళలు, కళా సాధనాల మీద అధ్యయనం మొదలైంది. అది పరిశోధనగా మారింది. ఆ ప్రభావంతోనే పాలమూరు యూనివర్సిటీలో నేను ఫోర్త్ వరల్డ్ లిటరేచర్స్‌ని పరిచయం చేయగలిగాను. మన సాహిత్యాన్ని యూరప్ దేశాలకు పరిచయం చేయడం గురించి ఆలోచన కూడా మొదలైంది. విదేశీ సాహిత్యానికి అనువాదాలు మన సాహిత్యంలో భాగమైపోయాయి. అలాగే మన సాహిత్యాన్ని, సాహిత్యం ద్వారా సంస్కృతిని ప్రపంచానికి తెలియచేయాలని పని చేశాను. వీటన్నింటినీ చేయడానికి నా మీద సామల సదాశివ గారు, జయధీర్ తిరుమల రావు గారి ప్రభావం మెండుగా ఉంది. తిరుమలరావుగారు ఆదిధ్వని ఫౌండేషన్ ద్వారా నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న పరిశ్రమలో భాగస్వామినయ్యాను. ఆదివాసీ గ్రామాల్లో పర్యటించి ధ్వనికి మూలకారణమైన సాధనాలను తెలుసుకోవడం, సేకరించడం మొదలుపెట్టాం. ఇల్లు, పిల్లలను చూసుకోవడం, ఉద్యోగం చేసుకుంటూనే దాదాపుగా పాతిక సంవత్సరాల నుంచి ఇదే పనిలో నిమగ్నమయ్యాను. చెంచు, కోయ, గోండ్‌లు నివసించే గ్రామాలకు నెలకు ఒకటి -రెండుసార్లు వెళ్లేవాళ్లం. గోండ్ లిపికి కంప్యూటర్ ఫాంట్ తయారు చేయగలిగాం. గోండ్ భాష యూనికోడ్ కన్సార్టియంలోకి వెళ్లింది కాబట్టి ఇక ఆ భాష అంతరించడం అనేది జరగదు. ఆదిధ్వని ఫౌండేషన్ ద్వారా 250 సంగీత సాధనాల వివరాలను క్రోడీకరించాం. మూలధ్వని పేరుతో పుస్తకం తెచ్చాం. అందులో క్రోడీకరించిన సంగీతసాధనాలు, 27 మంది కళాకారులను ఢిల్లీకి తీసుకువెళ్లి 2020లో ప్రదర్శనలివ్వడంలోనూ పని చేశాను. దేశంలో తెలంగాణ కళలకు మూడవస్థానం వచ్చింది.


ఫ్రెంచ్ పరిశోధకులు డేనియల్ నాజర్స్, జయధీర్ తిరుమల రావు, విదేశీ ప్రతినిధులతో ...


లోహపు కాకిబొమ్మను చూపిస్తున్న ప్రొఫెసర్ మనోజ

■ **ఆద్యకళకు ఆహ్వానం**

'ఇండియన్ యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, నాన్ట్స్' ఈ ఏడాది నిర్వహించిన 'ఇండియా– ఆఫ్రికా టువార్డ్స్ ఎ డైలాగ్ ఆఫ్ హ్యూమానిటీస్' సదస్సుకు మా ఆదిధ్వని ఫౌండేషన్ నిర్వహించే 'ఆద్యకళ'కు ఆహ్వానం వచ్చింది. అందులో పని చేస్తున్న వాళ్లలో నేను, జయధీర్ తిరుమలరావుగారు సదస్సుకు హాజరయ్యాం. 'ప్రాసెస్ ఆఫ్ ఎస్టాబ్లిషింగ్ ఎ మ్యూజియమ్' అనే అంశంపై మీద పత్రం సమర్పించాం. మనదేశంలో ఆదివాసీ సంస్కృతి మీద పరిశోధన చేసిన ఫ్రెంచ్ పరిశోధకులు డేనియల్ నాజర్స్‌తోపాటు అనేక మంది ఫ్రెంచ్ ప్రొఫెసర్‌లు ఈ సమావేశాలకు హాజరయ్యారు. అయితే వారంతా మనదేశంలో మూల సంస్కృతి, సంగీతవాద్యాలు అంతరించి పోయాయనే అభిప్రాయంలో ఉన్నారు. మేము వారి అపోహను తొలగించగలిగాం. అంతరించి పోతోందనుకున్న సమయంలో చివరి తరం కళాకారులను, కళారూపాలను ఒడిసి పట్టుకున్నామని చెప్పాం. కాటమరాజు కథ, పన్నెండు పటాలకు సంబంధించిన బొమ్మలు, కోయ పగిడీలను ప్రదర్శించాం. ఆఫ్రికాలో కళారూపాలు ఒకదానికి ఒకటి విడిగా ఉంటాయి. మన దగ్గర కథనం, సంగీతవాద్యం, పటం, గాయకుడు, బొమ్మ అన్నీ ఒకదానితో ఒకటి ముడివడి వుంటాయి. పారిస్‌లో 'నేషనల్ మ్యూజియమ్ ఆఫ్ ఏషియన్ ఆర్ట్స్', ఆంత్రోపాలజీ మ్యూజియాలను కూడా చూశాం. 'ప్రాసెస్ ఆఫ్ ఎస్టాబ్లిషింగ్ ఎ మ్యూజియమ్' అనే మా పేపర్‌కి సదస్సులో మంచి స్పందన లభించింది. ఇండియాలో మరో పార్శ్వాన్ని చూసిన ఆనందం వారిలో వ్యక్తమైంది. యునెస్కో అంబాసిడర్, మనదేశానికి శాశ్వత ప్రతినిధి విశాల్ వి శర్మ కూడా ప్రశంసించారు.

శబ్దం- సాధనం

ప్రస్తుతం 'ఆది చిత్రం' పుస్తకం తెచ్చే పనిలో ఉన్నాం. ఇదంతా ఒక టీమ్ వర్క్. మన దగ్గర ఆదివాసీ గిరిజనులు, దళిత బహుజనుల దగ్గర నిక్షిప్తమై ఉన్న సంస్కృతిని వెలికి తీయడానికి మొదటి మార్గం శబ్దమే. ఆదివాసీలు తమ కథలను పాటల రూపంలో గానం చేసే వారు. కొన్ని కథలు తాటాకుల మీద రాసి ఉన్నప్పటికీ ఎక్కువ భాగం మౌఖికంగా కొనసాగేవి. మౌఖిక గానంలో ఇమిడి ఉన్న కథలను రికార్డ్ చేసుకుని, శ్రద్ధగా విని అక్షరబద్ధం చేశాం. 'గుంజాల గోండి అధ్యయన వేదిక' ఆధ్వర్యంలో ఐటీడీఏతో కలిసి చేశాం. ఓరల్ నేరేటివ్‌కి అక్షర రూపం ఇవ్వడాన్ని 'ఎత్తి రాయడం' అంటాం. ఆది కళాకారులను వెలికి తెచ్చే మా ప్రయత్నంలో భాగంగా సమ్మక్క– సారక్క కథను ఆలపించే పద్మశ్రీ సకినె రామచంద్రయ్యను పరిచయం చేశాం. ఆ కథను ఎత్తిరాసిన పుస్తకమే 'వీరుల పొరుగద్దె సమ్మక్క సారలమ్మల కథ – కోయడోలీలు చెప్పిన కథ'. ఈ ప్రయత్నం రీసెర్చ్ మెథడాలజీలో పెద్ద టర్నింగ్ పాయింట్.

- ప్రొఫెసర్ గూడూరు మనోజ,
సభ్యులు, ఆదిధ్వని ఫౌండేషన్

■ **చేయాల్సింది ఇంకా ఉంది**

ఆది అక్షరం, ఆది చిత్రం, ఆది ధ్వని, ఆది లోహ కళ, ఆది జీవనం, పరికరాలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి. మ్యూజియం ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించాలి. మ్యూజియం హైదరాబాద్ నగర శివారులో ఉంటే భావి తరాలకు మ్యూజియంకు సంబంధించిన పరిశోధనకి ఉపయోగపడుతుంది.రిటైర్ అయిన తర్వాత మనసుకు నచ్చిన పని చేయాలని నమ్ముతాను. 'ఆదిధ్వని' ద్వారా ఐదు మ్యూజియాల స్థాపనకు పని చేశాను. నా జీవితం ఆదిధ్వనికే అంకితం'' అన్నారీ ప్రొఫెసర్. హైదరాబాద్‌లోని ఆమె ఇల్లు ఆదివాసీ సంస్కృతి నిలయంగా ఉంది.

– వాకా మంజులారెడ్డి

ముగ్గు - ముచ్చట


శ్వేత సంబరాజు
బోడుప్పల్, హైదరాబాద్


17 చుక్కలు; 5 వరుసలు
ఇటు అటు వదిలి 5 వరకు


కోడిపుంజు ముగ్గు
15 చుక్కలు : 15 వరుసలు


గోకవరపు సుభాషిణి
మచిలీపట్నం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

ఉందిలే మంచి టైమ్ ముందు ముందూనా...

యూత్ పల్స్

ఆశ అనేది మనిషి శ్వాస
ఆసక్తి అనేది నిత్యనూతన శక్తి.
ఆశ, ఆసక్తులతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టడానికి రెడీ అవుతోంది యువతరం. 'భవిష్యత్ మీదే ఎప్పుడూ నా నిఘా ఉంటుంది ఇవాళ కంటే రేపే ఎంతో బాగుంటుందంటాను నేను' అనే శ్రీశ్రీ మాట రేపటి వైపు చూసినప్పుడల్లా వినిపిస్తూ ఉంటుంది. కొత్త ఉత్సాహాన్ని ఇస్తూనే ఉంటుంది.



ఇంకో మూడు రోజుల తరువాత మనల్ని పలకరించనున్న 2023 గురించి యూత్ ఏం ఆలోచిస్తుంది? కొత్త సంవత్సరంలో కొత్తగా ఏం చేయాలనుకుంటుంది? రకరకాల ట్రెండ్ రిపోర్ట్‌ల సారాంశం ప్రకారం యాక్టివిజం, ఫ్యాషన్ సస్టెయినబిలిటీ, క్లైమెట్, ఫైనాన్స్, కల్చర్, మ్యూజిక్... మొదలైన అంశాలపై ఆసక్తి కనబరుస్తుంది యువతరం.

యాక్టివిజానికి సంబంధించి ఆన్ అండ్ ఆఫ్ సోషల్ మీడియాలో యువతరం చురుకైన పాత్ర పోషిస్తోంది. రాజకీయరంగంలోకి తమ వయసు వాళ్లు రావాలని కోరుకుంటోంది. అయితే ఇదేమీ అసాధ్యమైన కోరిక కాదని కొందరు యువ రాజకీయ నాయకులు నిరూపిస్తున్నారు. ఉదా: యూఎస్ కాంగ్రెస్–2022కు ఎంపికైన జెన్–జెడ్ లీడర్ మాక్స్‌వెల్ ఫ్రాస్ట్.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ల హవా గురించి మనకు తెలిసిందే. అయితే రాబోయే రోజుల్లో ఎలాంటి ఇన్‌ఫ్లూయెన్సర్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నారు? అనే విషయానికి వస్తే 'దివ్యాంగులైన ఇన్‌ఫ్లూయెన్సర్‌లు' అనే సమాధానం వినిపిస్తుంది. దీనికి కారణం సానుభూతి అనడం కంటే వారి శక్తిసామర్థ్యాలకు ఉత్సాహం ఇచ్చే ప్రయత్నం అనుకోవచ్చు.

'పర్యావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు–వాటి పర్యవసానాలు' ఇప్పుడు యూత్‌కు పట్టని విషయం కాదు. తమ షాపింగ్ వ్యవహారాలపై పర్యావరణ స్పృహ గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. కొత్త సంవత్సరంలో పర్యావరణానికి హాని కలిగించే వస్తువులకు దూరంగా ఉండాలనుకుంటున్నారు.

క్లైమెట్–ప్రూఫ్ ప్రొడక్ట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వబోతున్నారు.

'మనం దృష్టి పెట్టాలేగానీ మార్కెట్‌లో ఎన్నో ప్రత్యామ్నాయాలు కనిపిస్తాయి. కాఫీ కప్పు, ల్యాంప్ షేడ్, యోగా మ్యాట్, ఫ్లవర్ పాట్ స్టాండ్...ఇలా ఎన్నో పర్యావరణ హిత వస్తువులు కనిపిస్తాయి. వీటిని కొనడం ద్వారా ఎకో–ఫ్రెండ్లీ కల్చర్‌ను ముందుకు తీసుకెళ్లవచ్చు' అంటుంది జైపూర్(రాజస్థాన్)కు చెందిన వైష్ణవి.

ఆర్థిక విషయాలకు వస్తే '2023లో సోషల్ మీడియా వేదికగా డబ్బులు ఎలా సంపాదించాలి?' అనేదాని గురించి ఆలోచిస్తున్నారు. ఇప్పటివరకు తమ ఆనందం కోసం చేసిన కంటెంట్ క్రియేషన్‌ని ఇకముందు కరెన్సీలోకి మార్చుకోవడంపై దృష్టి పెడుతున్నారు.

యూత్‌లో ఎక్కువ మంది వేరే ప్రాంతాలకు చెందిన రుచికరమైన ఆహారంపై ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే రాబోయే రోజుల్లో అది ఆసక్తికి మాత్రమే పరిమితం కాబోవడం లేదు. 'వైరల్ ఫుడ్ కంటెంట్'ను అనుసరిస్తూ ఆయా ప్రాంతాలకు వెళ్లి తమకు ఇష్టమైన ఆహారపదార్థలను రుచి చూడాలనుకుంటున్నారు. ఇది ఒకరకంగా 'ఫుడ్ ట్రావెల్' అని చెప్పుకోవచ్చు.

ఇన్–పర్సన్ ఇంటరాక్షన్స్‌కు ప్రాధాన్యత పెరగబోతుంది. తమ ఫేవరెట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను అభిమానించే యువతరం ఇక ముందు వారిని ప్రత్యక్షంగా కలుసుకొని చాలాసేపు మాట్లాడాలనుకుంటోంది. ఇన్–పర్సన్ వెంచర్స్‌కు ప్రాధాన్యత పెరగబోతుంది.

మ్యూజిక్ విషయానికి వస్తే గ్లోబల్ మ్యూజిక్ తమకు ఇష్టమైన అభిరుచిగా మారనుంది. ముఖ్యంగా నాన్–ఇంగ్లీష్ స్పీకింగ్ ఆర్టిస్ట్‌ల సంగీతాన్ని వినాలనుకుంటున్నారు.

ఇక సాంకేతిక ప్రపంచం వైపు తొంగిచూస్తే...

'న్యూ జెనరేషన్ ఆఫ్ ది ఇంటర్నెట్'గా చెప్పుకునే 'వెబ్3' గురించి, వాటి ట్రెండ్స్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ–కృత్రిమ మేధస్సు) అనేది '2023' హెడ్‌లైనింగ్ ట్రెండ్‌గా మారనుంది. కొత్త సంవత్సరంలో ఎన్నో ఏఐ టూల్స్ మార్కెట్‌లోకి రానున్నాయి. భాషకు సంబంధించి 'యంత్ర' వాసన పోగొట్టి సహజత్వాన్ని తీసుకువచ్చే ఏఐ టూల్స్ రాబోతున్నాయి. స్క్రిప్ట్‌లు, వ్యాసాలు రాయనున్నాయి... ఇలాంటి వాటిపై యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

2023ను 'ఫోల్డబుల్ ఫోన్‌ల సంవత్సరం' అంటున్నారు. సామ్‌సంగ్ నుంచి వన్‌ప్లస్ వరకు ఎన్నో కంపెనీల నుంచి స్టైలిష్ ఫోల్డబుల్ ఫోన్స్ వస్తున్నాయి. సహజంగానే యూత్ వీటిపై ఆసక్తి కనబరుస్తుంది.

తక్కువెందుకు?!

● స్టడీ: మాట

ఏడాదిలోపు వయసున్న పిల్లల్లో మగపిల్లలకన్నా ఆడపిల్లలే త్వరగా అడుగులు వేస్తారు! మగపిల్లలకన్నా ఆడపిల్లలే త్వరగా మాట్లాడుతారు!! ఇంట్లో అన్నదమ్ములకన్నా ఆడపిల్ల మాటే ఎక్కువ వినిపిస్తుంది! ఆడవాళ్లు మగవాళ్ల కన్నా ఎక్కువ గాసిప్స్ చేస్తారు!! ఇలాంటివెన్నో సమాజంలో స్త్రీ వాక్కు గురించి ఎక్కువగా వినిపించే మాటలు. కానీ, వృత్తిపరమైన కార్యక్రమాల్లో పురుషుల కన్నా స్త్రీలు ఎందుకు తక్కువ మాట్లాడుతున్నారు?! ఈ విషయంపై బ్రిటన్ సైకలాజికల్ సొసైటీ చేసిన అధ్యయనం ఆలోచింపజేస్తోంది..



ఒకే వయసు ఉన్నవారిలో అబ్బాయిల కంటే అమ్మాయిలు తమ మాటల్లో సంక్లిష్టమైన భాషను ఉపయోగిస్తారు. బలమైన మౌఖిక నైపుణ్యాలు అవసరమయ్యే రంగాలు పురుషుల కంటే మహిళలనే ఎక్కువ ఆకర్షిస్తాయి. అయితే, స్త్రీలు పదాల నైపుణ్యాన్ని కలిగి ఉన్నా వృత్తిపరమైన చోట పురుషుల కంటే తక్కువ మాట్లాడతారని, వేర్వేరు సందర్భాలలో పురుషుల గొంతులలాగా స్త్రీల గొంతులు వినబడవని ఇటీవలి అధ్యయనాలు సూచిస్తున్నాయి.

■ **ఎక్కువ సౌకర్యం**

బ్రిటిష్ సైకలాజికల్ సొసైటీ ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ కాన్ఫరెన్స్‌లో ఆడ–మగ తేడా లేకుండా ప్రశ్నలు అడగడంలో లింగ భేదాలను పరిశీలించారు. ప్రేక్షకుల్లో పురుషులు 63 శాతం మంది ఉండగా 78 శాతం ప్రశ్నలు అడిగారట. వీరితో పోల్చితే స్త్రీలు ప్రశ్నించే శాతం అతి తక్కువ ఉందని తేల్చారు. దీంతో పురుషులు కూడా మహిళల కంటే 3.5 రెట్లు ఎక్కువ మాట్లాడతారని తెలుసుకున్నారు. మరొక అధ్యయనంలో పరిశోధకులు పురుషులు, మహిళలను విడివిడిగా సర్వే చేశారు. పురుషులతో పోలిస్తే మహిళలు 'ఆత్రుతగా ప్రశ్నలు అడగడం, అభిప్రాయాలను వ్యక్తం చేయక పోవడంలో సౌకర్యం పొందుతున్నామ'ని అంగీకరించారు.

■ **వర్చువల్ సెట్టింగ్స్‌లో మాటలు ఎక్కువ**

మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్, బ్రిఘం అండ్ ఉమెన్స్ హాస్పిటల్‌లోని పరిశోధకుల అధ్యయనం ఇలా వివరిస్తుంది.. 'మగ – ఆడ వైద్యులు తమను తాము విద్యాసంబంధమైన పరిస్థితులలో భిన్నంగా చెప్పుకోవచ్చు. అయితే, చిన్న లేదా వర్చువల్ సెట్టింగ్‌లలో పురుషులకన్నా మహిళలు ఎక్కువ మాట్లాడతారని గ్రహించారు. ఈ అధ్యయనాలు కాన్ఫరెన్స్‌లతో సహా క్లాస్‌రూమ్‌లు, వర్క్‌ప్లేస్‌లు ఇప్పటికీ లింగభేదం ఉన్న ప్రదేశాలుగానే సూచిస్తున్నాయి.

■ **ఏది నిరోధిస్తోంది?!**

మాట్లాడటానికి, తమ గురించి తాము నొక్కి చెప్పమని మహిళలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, వారిని నిరోధించే అంశాలు కూడా మనం పరిశీలించాలి. అధికారంలో ఉన్నవారు, బాస్‌లు లేదా ప్రొఫెసర్‌లు, మగ గొంతులకు ఎక్కువ ప్రాధాన్యత ఉందనే స్పృహతో సంకేతాలిస్తున్నారా? ఇంకా, క్లాస్‌రూమ్ లేదా కాన్ఫరెన్స్ హాల్ లేదా బోర్డ్ రూమ్ డైనమిక్ పురుషులకే అనుకూలంగా ఉందా? పురుషులు మాట్లాడేటప్పుడు విద్యార్థులు, ఉద్యోగులు మరింత శ్రద్ధగా వింటారా? మహిళల స్వరం అణచివేయబడుతుందా? ఈ విధంగా ముఖ్యమైన సమయాల్లో మహిళలు నిశ్శబ్దంగా ఉండటానికి కారణాలనూ పరిశీలించారు.

స్వరాన్ని అణచివేస్తున్నారు..

భారతదేశంలో మాట వాస్తవికత గురించి చూసినప్పుడు కార్పొరేట్ విభాగంలో స్త్రీల వ్యాఖ్యలకు ప్రతిస్పందించేటప్పుడు మగ సహచరులు కూడా అణచివేసే స్వరాన్ని అవలంబిస్తుంటారు. దీంతోపాటు కొంతమంది పురుషులు స్త్రీలకు మరింత అవగాహన అవసరమని భావిస్తుంటారు. ఒక సంస్థలో ఇంటర్న్‌లుగా ఉన్నప్పటికీ చిన్న వయస్సులో ఉన్న స్త్రీలు మరింత దృఢంగా ఉంటారని, వారు మాటల్లో వెనుకడుగు వేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని కనుక్కొన్నారు.

స్త్రీల ఆధిపత్య ధోరణి మగవారికి ఇష్టం ఉండదు. అందుకే, అధికారిక సమావేశాలలో మహిళలు, తక్కువ స్వరాలతో మాట్లాడతారు. ఎక్కువ మాట్లాడితే, 'ఎక్స్‌ట్రాలు చేస్తున్నారం'టూ 'హానికరమైన లేబుల్స్' అందుకుంటారు. వెనక్కి తగ్గితే, వారి యోగ్యతే ప్రశ్నార్థకమవుతుంది. సమావేశంలో మహిళలు పొరపాటున అంతరాయం కలిగిస్తే వారి వ్యాఖ్యానాలను తప్పుపడుతూ మగవారు వ్యతిరేకంగా మాట్లాడతారు. దీని కారణంగా, మహిళలు ఏదైనా మాట్లాడాలనుకున్నా 'మనకెందుకులే' అనే ధోరణిలో ఉండిపోతున్నారు.

ఆడ–మగ అనే తేడా చూడకుండా, చెప్పే ప్రతీ విషయాన్ని ఎలా ఖండించాలా అనే ప్లాన్ చేయడానికి బదులు ఒక వ్యక్తి ఏం చెబుతున్నారనే దానిపై పూర్తి దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే మనకు చేరాల్సిన విషయంపైన స్పష్టత వస్తుంది. అడ్డుకోవాలని, అణచివేయాలనే ఆలోచనను ఎదుర్కోకపోతే రేపటి తరం అభివృద్ధికి అడ్డంకి అవుతుంది.


బ్యూటిప్స్

మొటిమలు, మచ్చల నివారణకు మంచి రూట్

బీట్‌రూట్ ఆరోగ్య పరిరక్షణకే కాదు. మంచి సౌందర్య సాధనంగా కూడా ఉపకరిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి, జింక్ పింపుల్స్, వాటి మచ్చలను తొలగించడానికి చాలా సమర్థంగా పనిచేస్తాయి. మీకు పింపుల్స్ సమస్య ఉంటే.. ఈ ప్యాక్స్ ప్రయత్నించి చూడండి.

రెండు స్పూన్ల పెరుగులో రెండు టీస్పూన్ల బీట్‌రూట్ రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారంలో మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే.. పింపుల్స్, వాటి తాలూకూ మచ్చలు తొలగుతాయి.

బీట్‌రూట్ గుజ్జులో రెండు చెంచాల ముల్తానీ మట్టీ, చెంచా నిమ్మరసం కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. అరగంటపాటు ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలూ, నల్ల మచ్చలు తొలగిపోయి చర్మం నిగనిగలాడుతుంది.





ఎనిమిదో ర్యాంక్‌కు ప్రణయ్

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. కొంత కాలంగా చక్కటి ఫామ్‌లో ఉన్న ప్రణయ్ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో ఆడటంతో పాటు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు కూడా నామినేట్ అయ్యాడు. ఇతర భారత షట్లర్లలో లక్ష్యసేన్ తన ఏడో స్థానాన్ని నిలబెట్టుకోగా, కిడాంబి శ్రీకాంత్ 12వ స్థానానికి దిగజారాడు. గాయం కారణంగా చాలా కాలంగా ఆటకు దూరమైన పీవీ సింధు కూడా ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి పడిపోయింది.

అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు



ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఇరిగేశి అర్జున్ మంగళవారం జరిగిన నాలుగు రౌండ్లలో రెండు గేముల్లో గెలిచి, మరో రెండు గేముల్లో ఓటమి పాలయ్యాడు. 9 రౌండ్లు ముగిసిన అనంతరం అర్జున్ 6.5 పాయింట్లతో మరో ఆరుగురితో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల ర్యాపిడ్ చెస్‌లో ఎనిమిదో రౌండ్ ముగిసేసరికి భారత క్రీడాకారిణి సవితశ్రీ (6.5) మరో ఇద్దరితో కలిసి ఆధిక్యంలో ఉంది.

వార్నర్ డబుల్ సెంచరీ

- ఆస్ట్రేలియా 386/3
- దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు



మెల్‌బోర్న్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టుపై ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 91 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 386 పరుగులు చేసింది. దాంతో ఆ జట్టుకు ఇప్పటికే 197 పరుగుల ఆధిక్యం లభించింది. డేవిడ్ వార్నర్ (254 బంతుల్లో 200 రిటైర్డ్‌హర్ట్; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) డబుల్ సెంచరీ సాధించగా.. స్టీవ్ స్మిత్ (161 బంతుల్లో 85; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేజార్చుకున్నాడు. ట్రవిస్ హెడ్ (48 నాటౌట్), అలెక్స్ క్యారీ (9 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు.

భారీ భాగస్వామ్యం...

మెల్‌బోర్న్‌లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 40 డిగ్రీలకు చేరడంతో మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్లంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి స్థితిలో వార్నర్ పట్టుదలగా నిలబడగా, స్మిత్ అతనికి సహకరించాడు. ఈ క్రమంలో 144 బంతుల్లో వార్నర్ కెరీర్‌లో 25వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆపై సఫారీ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ వీరిద్దరు మూడో వికెట్‌కు 239 పరుగులు జోడించారు. స్మిత్ వెనుదిరిగిన కొద్ది సేపటికే వార్నర్ డబుల్ సెంచరీ పూర్తయింది. అయితే తీవ్ర ఎండలో 63 సింగిల్స్ తీసిన వార్నర్ 14 సార్లు రెండేసి, 7 సార్లు మూడేసి పరుగులు తీయడంతో పాటు 3 సార్లు నాలుగు పరుగులు కూడా తీశాడు. దాంతో అతను తీవ్రంగా అలసిపోయాడు. డబుల్ సెంచరీ పూర్తయ్యాక వార్నర్‌ను ఇరు వైపుల సహచరులు పట్టుకొని బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది.

స్పైడర్ క్యామ్ దెబ్బ...

మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ఆట మధ్యలో దక్షిణాఫ్రికా పేసర్ ఆన్రిచ్ నోర్జే ఫీల్డింగ్‌లో మరో వైపుకు వెళుతున్న సమయంలో పైన వేలాడుతున్న స్పైడర్ క్యామ్ ఒక్కసారిగా వేగంగా దూసుకొచ్చి అతని ఎడమ భుజాన్ని, మోచేతిని బలంగా తాకింది. దాంతో నోర్జే మైదానంలో పడిపోయాడు. అదృష్టవశాత్తూ పెద్ద దెబ్బ తగలకపోవడంతో బతికిపోయిన నోర్జే...స్పైడర్ క్యామ్ ఇంత కిందకు ఉండటం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అనంతరం ఫాక్స్ స్పోర్ట్స్ దీనిపై క్షమాపణలు చెప్పింది.

100వ టెస్టులో సెంచరీ చేసిన 10వ ఆటగాడిగా (కౌడ్రీ, మియాందాద్, గ్రీనిడ్జ్, స్టివార్ట్, ఇంజమామ్, పాంటింగ్, గ్రేమ్ స్మిత్, ఆమ్లా, రూట్ తర్వాత) వార్నర్ నిలిచాడు. పాంటింగ్ ఒక్కడే రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేయగా... రూట్, వార్నర్ మాత్రమే వాటిని డబుల్ సెంచరీలుగా మలిచారు. ఓవరాల్‌గా వార్నర్ 100 టెస్టుల్లో 46.67 సగటుతో 8122 పరుగులు చేశాడు.

విమర్శలను దాటి...

కేప్‌టౌన్‌లో బాల్ ట్యాంపరింగ్ ఉదంతం జరిగి ఐదేళ్లు కావస్తున్నా ఇంకా అవే సూటిపోటి వ్యాఖ్యలు...కెప్టెన్సీ కావాలంటే కుటుంబంతో సహా విచారణకు రమ్మంటూ సొంత బోర్డు నుంచే షరతులు... జనవరి 2020నుంచి టెస్టుల్లోనే సెంచరీ లేకపోగా, గత 10 ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధసెంచరీ కూడా లేదు! వార్నర్ టెస్టు కెరీర్ ముగిసినట్లే అంటూ విమర్శలు వస్తున్న సమయంలో అతను చెలరేగాడు. తన కెరీర్‌లో 100వ టెస్టును అందుకు సరైన వేదికగా ఎంచుకొని ఈ మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు. టి20, వన్డే స్పెషలిస్ట్‌గానే క్రికెట్ ప్రపంచం గుర్తించిన వార్నర్ టెస్టుల్లో సాధించిన ఘనతలు తక్కువేమీ కాదు. తాజా వివాదాల నేపథ్యంలో మెల్‌బోర్న్ టెస్టు ఆరంభానికి ముందు 'అన్నీ మరచి ఒకప్పటి దూకుడైన వార్నర్‌లా ఆడతాను' అంటూ వ్యాఖ్యానించిన అతను దానిని నిజం చేసి చూపించాడు. మంగళవారం అన్ని రకాల మేళవింపుతో అతని బ్యాటింగ్ సాగింది. వికెట్ల మధ్య పరుగెత్తడం మొదలు చూడచక్కటి షాట్లు ఆడటం వరకు వార్నర్ అలరించాడు. ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపించిన నోర్జే, రబడ ఫాస్టెస్ట్ బంతులను కూడా సమర్థంగా ఎదుర్కొంటూ పుల్, హుక్ షాట్లతో తానేంటో అతను చూపించాడు. మైదానంలో ఫిట్‌నెస్‌పరంగా ప్రతికూల పరిస్థితి కనిపించినా అతను ఎక్కడా తగ్గలేదు. సెంచరీ పూర్తయ్యాక తనదైన శైలిలో గాల్లోకి ఎగిరి సంబరం జరుపుకున్న వార్నర్... డబుల్ సెంచరీ తర్వాత భావోద్వేగాలు ప్రదర్శించడం ఈ ఇన్నింగ్స్ విలువేమిటో చూపించింది. 110 బంతుల్లోనే వార్నర్ తర్వాతి వంద పరుగులు రాబట్టడం విశేషం. కేవలం 11 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల అనుభవంతో టెస్టుల్లో అరంగేట్రం చేసిన వార్నర్ ఈ ఫార్మాట్‌లలో అత్యుత్తమ ఓపెనర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తన రెండో టెస్టులో న్యూజిలాండ్‌పై 123 నాటౌట్, పెర్త్‌లో భారత్‌పై 180, కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా పై 134, 145, పాకిస్తాన్‌పై దుబాయ్‌లో 133, మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌పై 112, అడిలైడ్‌లో పాకిస్తాన్‌పై చేసిన 335 నాటౌట్ అతని కెరీర్‌లో కొన్ని అత్యుత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి.



శిఖర్ ధావన్‌పై వేటు

- వన్డేల్లో వైస్ కెప్టెన్‌గా హార్దిక్
- శ్రీలంకతో సిరీస్‌లకు భారత జట్ల ప్రకటన

ముంబై: సొంతగడ్డపై వన్డే వరల్డ్ కప్‌తో నిష్క్రమించాలనుకున్న సీనియర్ ఓపెనర్ శిఖర్ ధావన్ ఆశలు నెరవేరేలా లేవు. శ్రీలంకతో సిరీస్ కోసం మంగళవారం ప్రకటించిన వన్డే జట్టులో ధావన్‌కు చోటు దక్కలేదు. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో మూడు మ్యాచ్‌లలో కలిపి 18 పరుగులే చేసిన శిఖర్ సెలక్టర్ల భవిష్యత్ ప్రణాళికల్లో లేడని స్పష్టమైపోయింది. మరో సీనియర్ భువనేశ్వర్ కుమార్‌ను కూడా టి20 జట్టులోంచి తప్పించారు. జనవరి 3నుంచి 15 మధ్య భారత్, శ్రీలంక మధ్య 3 టి20లు, 3 వన్డేలు జరుగుతాయి. చేతన్‌శర్మ నేతృత్వంలోనే సెలక్షన్ కమిటీ ఈ రెండు సిరీస్‌ల కోసం టీమ్‌లను ఎంపిక చేసింది. గాయంనుంచి కోలుకున్న రోహిత్ వన్డే కెప్టెన్‌గా బరిలోకి దిగనుండగా... హార్దిక్ పాండ్యా టి20 టీమ్‌కు నాయకత్వం వహిస్తాడు. వన్డే వైస్‌కెప్టెన్‌గా హార్దిక్‌ను ఎంపిక చేయడం కొత్త నిర్ణయం కాగా, సూర్యకుమార్ యాదవ్‌కు టి20 వైస్ కెప్టెన్సీ అవకాశం లభించింది. మోకాలి గాయంతో బాధపడుతున్న రిషభ్ పంత్‌ను రెండు టీమ్‌లలో ఎంపిక చేయకపోగా...మొహమ్మద్ సిరాజ్‌కు టి20 టీమ్‌లో అవకాశం ఇవ్వలేదు. గాయం నుంచి కోలుకున్న షమీ వన్డేల్లో పునరాగమనం చేశాడు. యువ పేసర్లు శివమ్ మావి, ముకేశ్ కుమార్ జట్టులోకి ఎంపికయ్యారు. రోహిత్, విరాట్, శ్రేయస్‌లకు టి20ల నుంచి విశ్రాంతి నివ్వగా, పెళ్లి కారణంగా రాహుల్‌ను టి20లకు ఎంపిక చేయలేదు.

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), హార్దిక్ (వైస్ కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, శ్రేయస్, రాహుల్, ఇషాన్ కిషన్, సుందర్, చహల్, కుల్దీప్, అక్షర్, షమీ, సిరాజ్, ఉమ్రాన్, అర్ష్‌దీప్.

టి20 జట్టు: హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, హుడా, రాహుల్ త్రిపాఠి, సంజు సామ్సన్, సుందర్, చహల్, అక్షర్, అర్ష్‌దీప్, హర్షల్, ఉమ్రాన్, మావి, ముకేశ్ కుమార్.

అండర్–19 అమ్మాయిల శుభారంభం

- తొలి టి20లో దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు
- షబ్నమ్‌కు 3 వికెట్లు


షబ్నమ్

ప్రిటోరియా: వచ్చే నెలలో జరిగే అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌కు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి టి20లో భారత్ 54 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా మహిళలను ఓడించింది. మొదట భారత అండర్–19 జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. కెప్టెన్ షఫాలీ వర్మ (0) డకౌట్ కాగా, శ్వేత (39 బంతుల్లో 40; 5 ఫోర్లు), సౌమ్య (46 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సఫారీ బౌలర్లలో హ్లుబి, కేలా రేనెకె చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా అండర్–19 జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 83 పరుగులే చేసింది. ఆంధ్ర సీమర్ షబ్నమ్ షకీల్ (3/15)తో పాటు అర్చన దేవి (3/14) కూడా చెలరేగి ప్రత్యర్థిని పడగొట్టారు. జనవరి 14 నుంచి 29 వరకు తొలి సారి అండర్–19 మహిళల టి20 దక్షిణాఫ్రికాలోనే జరగనుంది.

మహారాష్ట్ర 200 ఆలౌట్


నితీశ్

సాక్షి, విజయనగరం: మహారాష్ట్రతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ పోరులో ఆంధ్ర సీమర్లు నితీశ్ కుమార్ (5/53), శశికాంత్ (3/44) చెలరేగారు. ఫలితంగా మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే ఆలౌటైంది. నితీశ్, శశికాంత్ వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో మహారాష్ట్ర 99 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్ (28) నిరాశపరచగా, సౌరభ్ నవలే (62 బంతుల్లో 70; 11 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆంధ్ర ఆట నిలిచే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 58 పరుగు లు చేసింది. ఓపెనర్లు అభిషేక్ (23), షేక్ రషీద్ (1) విఫలమవగా, కెప్టెన్ హనుమ విహారి (15 నాటౌట్), రికీ భుయ్ (11 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర మరో 142 పరుగులు వెనుకంజలో ఉంది.

అస్సాం 205 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై హైదరాబాద్ పేసర్లు రవితేజ (4/53), కార్తికేయ (3/43) విజృంభించి అస్సాంను కట్టడి చేశారు. ఉప్పల్ స్టేడియంలో మంగళవారం మొదలైన ఈ మ్యాచ్‌లో అస్సాం తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకే కుప్పకూలింది. ఓ దశలో 42 పరుగులకే 5 వికెట్లు కూలగా, స్వరూపమ్ పుర్కయస్త (83; 11 ఫోర్లు, 3 సిక్సర్లు)వీరోచితంగా పోరాడాడు. అనంతరం హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (21), సంహిత్ రెడ్డి (11), మికిల్ జైస్వాల్ (4) నిష్క్రమించగా, రోహిత్ రాయుడు (22 నాటౌట్), రాహుల్ బుద్ధి (16 నాటౌట్) క్రీజులో ఉన్నారు. హైదరాబాద్ ఇంకా 127 పరుగులు వెనుకబడివుంది.

కివీస్ దీటైన జవాబు

- తొలి ఇన్నింగ్స్‌లో 165/0


ఆగా సల్మాన్

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ దీటైన జవాబిచ్చింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (82 బ్యాటింగ్; 12 ఫోర్లు), టామ్ లాథమ్ (78 బ్యాటింగ్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో రెండో రోజు ఆట నిలిచే సమయానికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 165 పరుగులు చేసింది. దాదాపు రెండు సెషన్ల పాటు క్రీజు వీడకుండా న్యూజిలాండ్ ఓపెనర్లు పాకిస్తాన్ బౌలర్లను ఎదుర్కొన్నారు. అంతకుముందు ఉదయం 317/5 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 438 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్స్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్ (161) అదే స్కోరుపై అవుటవగా, ఆగా సల్మాన్ (103; 17 ఫోర్లు) సెంచరీ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో సౌతీ 3 వికెట్లు పడగొట్టగా, ఎజాజ్, బ్రేస్‌వెల్, ఇష్ సోధి తలా 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్ 273 పరుగులు వెనుకబడి ఉన్నప్పటికీ చేతిలో పది వికెట్లున్నాయి.

సినిమా


• దేవిశ్రీ ప్రసాద్, బాబీ, రవితేజ, చిరంజీవి, రాజేంద్ర ప్రసాద్, వై. రవిశంకర్


అప్పుడు రిటైర్ అయిపోవాలి - చిరంజీవి

''ఇండస్ట్రీకి వచ్చిన మొదట్లో మంచి సినిమాలు, మంచి పాత్రలు చేయాలని మనం ఎలా ఆకలిగా ఉంటామో వంద, రెండొందలు చిత్రాలు చేసినా అదే ఆకలితో, కమిట్‌మెంట్‌తో ఉండాలి. అప్పుడే మన వృత్తికి న్యాయం చేయగలం. అది లేకపోతే సినిమాల నుంచి రిటైర్ అయిపోవాలి. ఆ కమిట్‌మెంట్‌కు నేను కట్టుబడి ఉంటాను.. ఆచరిస్తాను. ప్రేక్షకులు, ఫ్యాన్స్ సంతోషం కోసం గొడ్డులా కష్టపడతాను'' అని హీరో చిరంజీవి అన్నారు. బాబీ కొల్లి (కే ఎస్ రవీంద్ర) దర్శకత్వంలో చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. హీరో రవితేజ కీలక పాత్ర పోషించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా జనవరి 13న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకానుంది. ఈ చిత్రం షూటింగ్ మంగళవారంతో పూర్తయింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిరంజీవి మాట్లాడుతూ–''బాబీ కథ చెప్పినప్పుడు బాగుందనిపించింది. నిర్మాతలతో ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందన్నాను. నా హార్డ్‌కోర్ ఫ్యాన్ బాబీ ఈ మూవీలో నన్ను అద్భుతంగా చూపించాడు. ఎలాంటి సన్నివేశాలైనా డూప్స్‌తో చేయించడం నాకు ఇష్టం ఉండదు.. నేను చేస్తేనే సంతృప్తిగా ఉంటుంది. వేరే హీరోలు ఇలా చేస్తారో లేదో తెలియదు కానీ, నాకు తెలిసింది ఇదే.. ఇలాగే చేస్తాను'' అన్నారు.

''అన్నయ్యకి(చిరంజీవి) నేను పెద్ద అభిమానిని. పైగా బాబీ అంటే నమ్మకం. అందుకే ఈ సినిమా చేశాను'' అన్నారు రవితేజ. ''2002లో గీతాఆర్ట్స్ ఆఫీసులో రక్తదానం చేసేందుకు వచ్చిన 50 మంది చిరంజీవిగారి అభిమానుల్లో నేనూ ఒక్కణ్ణి. ఆయనతో సినిమా చేయాలనే నా కల 'వాల్తేరు వీరయ్య'తో తీరింది. సంక్రాంతి బరిలో మా అన్నయ్యను దింపాలని 94 రోజులు నాన్‌స్టాప్‌గా షూటింగ్ చేశాం'' అన్నారు బాబీ. ''సంక్రాంతి అనే పెద్ద పండగకి ఇలాంటి అద్భుతమైన సినిమాని మాకు ఇచ్చిన బాబీగారికి థ్యాంక్స్'' అన్నారు వై.రవిశంకర్. ''ఈ కథ విన్నప్పుడు ఆహా.. మళ్లీ మెగా హిట్ తప్పదు అనిపించింది'' అన్నారు నటుడు రాజేంద్ర ప్రసాద్.

"వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' చిత్రాల నిర్మాతలు ఒక్కరే. రెండు సినిమాలు సంక్రాంతికి రిలీజవుతున్నాయి. వాటిని ఎలా రిలీజ్ చేసుకోవాలనేది వాళ్ల ఇష్టం. అందులో నటుడిగా నా ప్రమేయం ఉండదు. రెండు సినిమాలు వారికి రెండు కళ్లు.. వాటిలో ఏ ఒక్క కన్నుని పొడుచుకోవాలనుకోరు కదా?" అన్నారు చిరంజీవి.

చలో కర్నూల్


• రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జనవరి మొదటి వారంలో కర్నూలులో ఆరంభం కానుందని తెలిసింది. కొండారెడ్డి బురుజు సెంటర్‌లో రామ్‌చరణ్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించేందుకు ప్లాన్ చేశారట శంకర్. ఈ సినిమాలో తండ్రీ కొడుకు పాత్రలను రామ్‌చరణ్ చేస్తున్నారని, తండ్రి పాత్ర 1920 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా తండ్రి పాత్రకు కాస్త నత్తి ఉంటుందనే టాక్ తెరపైకి వచ్చింది. 'రంగస్థలం'లో రామ్‌చరణ్ వినికిడి లోపం ఉన్న పాత్రలో నటించి, మెప్పించారు. ఇప్పుడు నత్తి పాత్ర చేస్తున్నది కరెక్టే అయితే ఈ పాత్రను కూడా పండిస్తారని ఊహించవచ్చు.

ఏజెంట్ పోరాటం


• అఖిల్

అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. సాక్షీ వైద్య తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో మమ్ముట్టి ఓ కీలక పాత్ర చేస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. అఖిల్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు టాకీ పార్ట్ సీన్స్‌ను కూడా చిత్రీకరిస్తున్నారట. ఇదిలా ఉంటే.. 'ఏజెంట్'ను సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వేసవిలో విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఫొటో స్టూడియోలో...


• యష్, చెందు, హరీష్ శంకర్, చైతన్యా రావ్

''చాలా రోజుల తర్వాత 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' అనే మంచి టైటిల్ చూశాను. టైటిల్, పోస్టర్ డిజైన్ చూడగానే సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. చైతన్యా రావ్, లావణ్య జంటగా 'ఓ పిట్ట కథ' ఫేమ్ చెందు ముద్దు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో'. 'పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని' వంటి విజయవంతమైన చిత్రాలు నిర్మించిన యష్ రంగినేని నిర్మిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్, 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' టైటిల్‌ని హరీష్ శంకర్ విడుదల చేశారు. ''80వ దశకంలో గ్రామీణ నేపథ్యంలో సాగే క్రైమ్ కామెడీ చిత్రమిది. 'పిట్ట కథ'ని ఆదరించినట్లే ఈ సినిమానీ ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు చెందు ముద్దు.



"ప్రస్తుతం ప్రేక్షకులు ఎలాంటి కంటెంట్‌ను ఇష్టపడుతున్నారన్న విషయం అంచనాలకు అందడంలేదన్న మాటలను నేనూ వింటున్నాను. ఓ సినిమా సెంట్రల్ ఐడియా కొత్తగా ఉందంటే సగం పాసైపోయినట్లే అని నమ్ముతాను" అని హీరో ఆది సాయికుమార్ అన్నారు. ఆది సాయికుమార్, రియా సుమన్ జంటగా కె. శశికాంత్ దర్శకత్వంలో కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మించిన 'టాప్‌గేర్' ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆది సాయికుమార్ చెప్పిన విశేషాలు.

అదో పెద్ద పజిల్ - ఆది సాయికుమార్

● ఒక్కరోజులో జరిగే కథతో రూపొందిన చిత్రం 'టాప్ గేర్'. ఏ మాత్రం తనకు సంబంధం లేని ఓ సమస్యలో ఇరుక్కునే ఓ క్యాబ్ డ్రైవర్ అందులో నుంచి ఎలా బయటపడతాడు? అనేది ఈ సినిమా కథనం. మేజర్ షూటింగ్ అంతా కారులోనే చేశాం. స్క్రీన్‌ప్లే రేసీగా సాగుతుంది. నా గత చిత్రాల మాదిరిగానే 'టాప్ గేర్' కూడా టెక్నికల్‌గా చాలా స్ట్రాంగ్ ఫిల్మ్. నా ప్రతి సినిమాకు నేను వంద శాతం కష్టపడుతూనే ఉన్నాను. నా సినిమాలను గమనిస్తే అందులోని ప్రధానాంశం కచ్చితంగా కొత్తగా ఉంటుంది. 'టాప్‌గేర్' కూడా అలాంటి కథాంశమే. ● ప్రస్తుతం మాస్ యాక్షన్ ఫిల్మ్ నిర్వచనం మారింది. ఇప్పుడు ఎక్కువగా 'కేజీఎఫ్'లాంటి స్టయిలిష్ యాక్షన్ ఫిలింస్‌ని చూస్తున్నారు. భవిష్యత్‌లో నేనూ ఓ స్టైలిష్ యాక్షన్ ఫిలిం చేస్తాను. ● థియేటర్స్‌లో ఓ హిట్ సాధించడం అనేది అందరికీ ఓ సవాలుగా మారింది. రీసెంట్‌గా విడుదలైన నా 'క్రేజీ ఫెలో' చిత్రం మంచి బజ్‌ను క్రియేట్ చేసుకుంది. కానీ మా సినిమా విడుదలైన మర్నాడే కన్నడ 'కాంతార' తెలుగులో విడుదలైంది. ఆ సినిమా ఫ్లోలో మా సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కలేదు. బహుశా.. రాంగ్ రిలీజ్ డేట్ కావొచ్చు. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ సినిమాలను ఆడియన్స్ ఓటీటీలోనే చూడాలని ఫిక్స్ అయ్యారో లేదా థియేట్రికల్ మూవీ అంటే ఏదో ఎక్స్‌ట్రార్డినరీ కంటెంట్ ఉండాలని ఫిక్స్ అయ్యారా? అన్నది ఇప్పుడు అందరికీ అర్థం కాని పెద్ద పజిల్. ● ప్రస్తుతానికి నెగటివ్ రోల్స్ చేయాలనుకోవడం లేదు. ఏదైనా అద్భుతమైన స్క్రిప్ట్ వస్తే అప్పుడు ఆలోచిస్తాను. ప్రస్తుతం లక్కీ మీడియాలో ఓ సినిమా చేస్తున్నాను. 'పులిమేక' వెబ్ సిరీస్ చేశాను. త్వరలో జీ5లో స్ట్రీమింగ్ కానుంది.

నాన్నగారు చేసిన 'అనలేం గుర్తుకు రాదు..' ('అంతఃపురం') సినిమా పాటను రీమిక్స్ చేయాలని ఉంది. అయితే నా సినిమాలో ఆ పాటకు తగ్గ సందర్భం కుదరాలి. ఒకవేళ రీమిక్స్ చేస్తే దర్శకుడు కృష్ణవంశీగారే తీయాలి.

హీరో అవ్వాలనుకుని డైరెక్టర్ అయ్యా! - భరత్


• భరత్, గౌతమ్

తారకరత్న, ప్రిన్స్, సునీల్, అలీ, సాయికుమార్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఎస్ 5: నో ఎగ్జిట్'. భరత్ కోమలపాటి దర్శకత్వంలో ఆదూరి ప్రతాప్‌రెడ్డి, దేవు శ్యాముల్, షైక్ రహీమ్, గాదె మిల్కి రెడ్డి, గౌతమ్ కొండెపూడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రదర్శకుడు భరత్ మాట్లాడుతూ– ''మాది అనంతపురం. ఇంటర్ సెకండ్ ఇయర్ అయ్యాక హీరో అవుదామని 2003లో హైదరాబాద్ వచ్చాను. సినిమా ప్రారంభమైంది కానీ, ఆగిపోయింది. ఆ తర్వాత డ్యాన్సర్‌గా చాన్స్ వచ్చింది. తొలి సంపాదన 350 రూపాయలు. ఆ తర్వాత 'ఆట' షోలో పాల్గొన్నాను. కాన్సెప్ట్స్‌తో సాంగ్ కొరియోగ్రఫీ చేసుకుంటున్నానని తెలిసి పూరి జగన్నాథ్, చార్మీగార్లు ప్రోత్సహించారు. కొరియోగ్రాఫర్‌గా 'జ్యోతిలక్ష్మి' నా తొలి సినిమా. ఎన్టీఆర్‌గారి 'టెంపర్'కూ చేశాను. ఇక 'ఎస్ 5: నో ఎగ్జిట్' విషయానికి వస్తే... కొడుకు బర్త్ డే సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లే ఓ ట్రైన్‌లోని ఎస్ 5 బోగిని బుక్ చేస్తారు సీయం. ట్రైన్ జర్నీ స్టార్ట్ అయ్యాక ఎగ్జిట్ డోర్స్ కనిపించవు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే కథ'' అన్నారు. ''మణిశర్మగారి మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాను 200 థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. సాగా ఎంటర్‌టైన్మెంట్స్ రిలీజ్ చేస్తోంది'' అన్నారు నిర్మాత గౌతమ్.

సుదీప్ యాక్షన్


• సుదీప్

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన కన్నడ చిత్రం 'హెబ్బులి'. ఎం. మోహన శివకుమార్ సమర్పణలో సి. సుబ్రహ్మణ్యం నిర్మించారు. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు నిర్మాతలు. ''కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. కెప్టెన్ పాత్రను సుదీప్ స్టయిలిష్‌గా చేయడంతో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో అద్భుతంగా నటించారు. తెలుగులో డబ్బింగ్, సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి'' అని నిర్మాతలు పేర్కొన్నారు.

థ్రిల్లింగ్ లేఖ


• ఇడెన్ రోజ్

సుభాష్, హర్ష హీరోలుగా ఇడెన్ రోజ్ హీరోయిన్‌గా 'చిత్రలేఖ' అనే సినిమా షురూ అయింది. 'తెలంగాణ దేవుడు' ఫేమ్ హరీష్ వడత్యా దర్శకత్వంలో వీసీ రావు సమర్పణలో కృష్ణ వంశీ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామ్‌చంద్రు తేజవత్, టీఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ సాయి చంద్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు తులసీరామ్ క్లాప్ కొట్టారు. హరీష్ వడత్యా, నిర్మాత, నటుడు డీఎస్ రావ్ గౌరవ దర్శకత్వం వహించారు. హరీష్ వడత్యా మాట్లాడుతూ– ''వైజాగ్ నేపథ్యంలో సాగే లవ్, రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అడుసుమిల్లి విజయకుమార్, సంగీతం: బొబ్బిలిరాజా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: లింగం.కె.

చక్కని కథతో...


• భూమిక, మహేశ్

మహేశ్, భూమిక జంటగా సజ్జా కుమార్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, సీహెచ్ సుజాత నిర్మిస్తున్న చిత్రం హైదరాబాద్‌లో ఆరంభమైంది. సుజాత మాట్లాడుతూ– ''మా గోల్డెన్ సినీ క్రియషన్స్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. కుమార్ మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు'' అన్నారు. ''నిర్మాతలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను'' అన్నారు సజ్జా కుమార్. ''చక్కని కథాంశంతో రూపొందిసున్నాం'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ శోభన్‌బాబు, విలయిల్ ఫిలిప్స్ థామస్. ఈ చిత్రానికి సంగీతం: రాజేష్ రాజ్, కెమెరా వాసు వర్మ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	361	60,927
నిఫ్టీ ▲	118	18,132

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,400	▼	99
డోజోన్స్	33,312	▲	108
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,473	▲	4
డాక్స్	13,995	▲	54
షాంఘై	3,096	▲	30
నికాయ్	26,448	▲	42

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	54,639 ▲	253
బంగారం (99.5 స్వచ్ఛత)	54,420 ▲	252
వెండి (కిలో)	68,768 ▲	1,015

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.29	83.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	85.84	89.32
€	యూరో	ఎస్‌బీఐ	97.57	102.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.74	62.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	57.01
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.32	62.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.99	22.65
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	20.58	22.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.64	12.68

రిలయన్స్ జియోతో షావోమీ భాగస్వామ్యం

షావోమీ 5జీ ఫోన్లకు ప్రత్యేక అప్‌డేట్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియోతో 5జీ ఫోన్లకు సంబంధించి షావోమీ ఇండియా ఓ భాగస్వామ్యం కుదుర్చుకుంది. జియో కస్టమర్లకు అచ్చమైన 5జీ సేవల అనుభవాన్ని అందించనున్నట్టు షావోమీ తెలిపింది.



రిలయన్స్ జియో నెట్‌వర్క్ పరిధిలో షావోమీ ఫోన్లకు మెరుగైన కవరేజీ అందేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ఇవ్వనుంది. అన్ని షావోమీ 5జీ ఫోన్లు రిలయన్స్ జియో ట్రూ 5జీ నెట్‌వర్క్‌కు సపోర్ట్ చేస్తాయని షావోమీ ఇండియా ప్రకటించింది. యూజర్లు తమ ఫోన్ నెట్‌వర్క్ సెట్టింగ్స్‌లో ప్రిఫర్డ్ నెట్‌వర్క్ టైప్‌ను 5జీకి మార్చుకోవాలని సూచించింది.

విజయ్ సేల్స్ అదిరే ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైల్ చైన్ విజయ్ సేల్స్ నూతన సంవత్సరం, ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అన్ని యాపిల్ ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లు అందిస్తోంది. యాపిల్ ప్రొడక్టులైన ఐఫోన్14, ఐప్యాడ్, యాపిల్ వాచ్, మ్యాక్‌బుక్ ఇతర అన్ని ఉత్పత్తులకు సంబంధించి అత్యుత్తమ ఆఫర్లు పొందవచ్చు. డిసెంబర్ 23న మొదలైన ఈ ప్రత్యేక ఆఫర్



సేల్ ఈ నెలాఖరు 31 తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులపై 10వేల వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. ఈఎంఐపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. కస్టమర్లు 120కి పైగా రిటైల్ అవుట్‌లెట్‌లతో పాటు www.vijaysales.comలో అత్యుత్తమ డీల్స్ పొందవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-12-2022	
విశాఖ	547-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
27-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	528-00
వరంగల్	530-00
రిటైల్ ధర	5.90

3 డోసులు తీసుకున్నవారికి డిస్కౌంట్


- పాలసీ రెన్యువల్‌పై ఇవ్వాలి
- కరోనా క్లెయిమ్‌లను సత్వరం పరిష్కరించాలి
- బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ సూచన



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పలు దేశాల్లో కరోనా కేసులు పెరుగుతున్న తరుణంలో బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) చర్యలకు నడుం బిగించింది. మూడు డోసులు టీకా తీసుకున్న వారికి సాధారణ, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల పునరుద్ధరణపై డిస్కౌంట్ ఇవ్వాలని అన్ని బీమా సంస్థలను కోరింది. కరోనా క్లెయిమ్‌లను వీలైనంత త్వరితంగా పరిష్కరించాలని, డాక్యుమెంట్ల అవసరాన్ని తగ్గించాలని కోరింది. బీమా సంస్థలు తమ వెల్‌నెట్ నెట్‌వర్క్ ద్వారా ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లు నిర్వహించుకునే విధంగా పాలసీదారులను ప్రోత్సహించాలని, ఇందుకు వారికి రాయితీలు కల్పించాలని సూచించింది. కోవిడ్ నిబంధనలను పాలసీదారులు అనుసరించేలా సామాజిక మాధ్యమాల ద్వారా వారిని ప్రోత్సహించాలని బీమా సంస్థలతో నిర్వహించిన సమావేశంలో భాగంగా కోరినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. విదేశీ ప్రయాణ బీమా పాలసీలు తీసుకునే వారికి, పలు దేశాల్లో కరోనా పరీక్షల నిర్వహణ అవసరాల గురించి తెలియజేయాలని ఐఆర్‌డీఏఐ సూచించింది. కరోనాతో చికిత్స కోసం వచ్చే పాలసీదారుల నుంచి నెట్‌వర్క్ హాస్పిటళ్లు డిపాజిట్ తీసుకోకుండా చూడాలని కోరింది. నగదు రహిత సదుపాయం ఉన్న ఆస్పత్రుల్లో చేరినప్పటికీ, కరోనా మొదటి, రెండో విడతలో చాలా ఆస్పత్రులు రోగుల నుంచి డిపాజిట్లు తీసుకున్నాయి. దీంతో ఐఆర్‌డీఏఐ ఈ సూచన చేసింది. కరోనా కేసులు ఒకవేళ అధికంగా వస్తే సాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని కోరింది. 2022 మార్చి నాటికి బీమా సంస్థలు కరోనాకు సంబంధించి 2.25 లక్షల క్లెయిమ్‌లను పరిష్కరించడం గమనార్హం.

బ్యాంకింగ్, ఐటీ షేర్ల జోష్...

- ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు
- సూచీలకు రెండోరోజూ లాభాలే



ముంబై: మెటల్, బ్యాంకింగ్, ఐటీ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ లాభాలు గడించాయి. చైనాలో కోవిడ్ ఆంక్షలను సడలించడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో లాభాల బాట పట్టాయి. అక్కడి నుంచి మన మార్కెట్ సానుకూల సంకేతాలు అందుపుచ్చుకుంది. ఉదయం సెన్సెక్స్ 295 పాయింట్ల లాభంతో 60861 వద్ద, నిఫ్టీ 75 పాయింట్లు పెరిగి 18,090 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్ సెషన్ తర్వాత లాభాలు కొనసాగాయి. ఒక దశలో సెన్సెక్స్ 421 పాయింట్లు దూసుకెళ్లి 60987 వద్ద, నిఫ్టీ 134 పాయింట్లు బలపడి 18,149 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 361 పాయింట్ల లాభంతో 60,927 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118 పాయింట్లు పెరిగి 18,132 వద్ద నిలిచింది. ఎఫ్ఎంజీసీ రంగ షేర్లకు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.867 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.622 కోట్ల షేర్లను కొన్నారు. నెలాఖరులో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో పాటు క్రూడాయిల్ ధరలు పెరగడంతో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 25 పైసలు పతనమై 82.90 వద్ద స్థిరపడింది. గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1082 పాయింట్లు పెరగడంతో రూ. 8.37 లక్షల కోట్ల సంపద ఇన్వెస్టర్ల సొంతమైంది. దీంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.280.49 లక్షల కోట్లకు చేరింది.

మెరిసిన మెటల్ షేర్లు

భారత స్టీల్ కంపెనీలు జనవరి నుంచి ధరలను పెంచొచ్చనే వార్తలు వెలుగులోకి రావడంతో ట్రేడింగ్‌లో మెటల్ షేర్లు మెరిశాయి. అలాగే చైనాలో కోవిడ్ ఆంక్షల ఎత్తివేతతో ఆర్థిక వ్యవస్థ తిరిగి పునరుద్ధరణ దిశగా నడవచ్చనే ఆశలు సైతం ఈ రంగ షేర్లకు డిమాండ్‌ను పెంచాయి. హిందాల్కో, టాటా స్టీల్, సెయిల్ షేర్లు 6-5% లాభపడ్డాయి. వెల్‌స్పన్ కార్ప్, జిందాల్ స్టీల్, హిందుస్తాన్ కాపర్, వేదాంత షేర్లు నాలుగుశాతం లాభపడ్డాయి. మొయిల్, హిందుస్తాన్ జింక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జేఎస్‌డబ్ల్యూ షేర్లు 2-1% పెరిగాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 4% పైగా ర్యాలీ చేసింది.

రేడియంట్ క్యాష్ ఐపీవో.. ఫ్లాప్

రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి ఇన్వెస్టర్ల నుంచి నామమాత్ర స్పందనే లభించింది. చివరి రోజు మంగళవారానికల్లా 53% సబ్‌స్క్రయిబ్ అయ్యింది. షేరుకి రూ.94-99 ధరలో చేపట్టిన ఇష్యూలో కంపెనీ 2,74,29,925 షేర్లను ఆఫర్ చేసింది. 1,45,98,150 షేర్ల కోసం మాత్రమే బిడ్స్ దాఖలయ్యాయి.

టెల్కోలకు రైల్వే గ్రీన్ సిగ్నల్!

- రైల్వే భూమిలో టెలికం టవర్లు
- ఇక ప్రయివేట్ కంపెనీలకు చాన్స్
- సర్వీసులకూ రైల్వే శాఖ ఓకే...
- కొత్తగా భూముల లీజ్ పాలసీ
- దేశీయంగా 5జీ నెట్‌వర్క్‌కు బూస్ట్

రైల్వే సంబంధ భూములలో రైల్‌టెల్ కార్పొరేషన్‌కు మినహా ఏ ఇతర టెలికం కంపెనీలూ టవర్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటివరకూ అనుమతించడం లేదు. అయితే తాజాగా ఇందుకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు వీలుగా భూములకు కొత్త లీజ్ విధానాలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా దేశీయంగా 5జీ టెలికం నెట్‌వర్క్ ఊపందుకునే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

న్యూఢిల్లీ: రైల్వే భూములకు సంబంధించి ల్యాండ్ లైసెన్సింగ్ ఫీజు(ఎల్ఎల్ఎఫ్) నిబంధనలను కొద్ది నెలల క్రితం కేంద్ర క్యాబినెట్ సరళీకరించింది. వెరసి ప్రయివేట్ రంగం నుంచి పెట్టుబడులను ఆకట్టుకునే బాటలో రైల్వే శాఖ కొత్త ఎల్ఎల్ఎఫ్ పాలసీకి తెరతీసింది. దీంతో మొబైల్ టవర్ల ఆదాయంలో 7 శాతాన్ని పంచుకునే నిబంధనలకు తెరదించింది. దీని స్థానే భూముల మార్కెట్ విలువలో వార్షికంగా 1.5 శాతం చార్జీల విధింపునకు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది. తద్వారా దేశీయంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణకు దారి ఏర్పడనుంది. దీనిలో భాగంగా అనుమతులు మంజూరు చేసే అంశంలో భవిష్యత్ నెట్‌వర్క్ అవసరాలను పరిగణించేలా జోనల్ రైల్వేలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

రైల్‌టెల్ మాత్రమే...

ప్రస్తుతం రైల్వే రంగ టెలికం అవసరాలకు రైల్‌టెల్ కార్పొరేషన్‌పై మాత్రమే ఆ శాఖ ఆధారపడుతూ వస్తోంది. ప్రస్తుతం ప్రయివేట్ రంగ కంపెనీలకూ టెండర్లను ప్రారంభించినట్లు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీటిని ఆయా సంస్థలు వాణిజ్యంగా వినియోగించుకునేందుకు వీలుంటుంది. ఇదే సమయంలో ఈ మౌలిక సదుపాయాలను పోటీ ధరల ప్రాతిపదికన రైల్వేలు సైతం ఉపయోగించుకోనున్నాయి. 2016 పాలసీ ప్రకారం రైల్వే భూములలో రైల్‌టెల్‌కు మాత్రమే టవర్ల ఏర్పాటుకు వీలుండేది. తాజా విధానాలు వీటికి స్వస్తి పలికాయి. వీటి ప్రకారం 70 డివిజన్ల కార్యాలయాలు, స్టేషన్ పరిసరాలలో పోల్ మౌంట్లు, స్మాల్ సెల్స్ ఏర్పాటుకు అనుమతించనున్నాయి.



రెండు నెలల గడువు

సొంత నెట్‌వర్క్‌లో 5జీ సర్వీసుల వృద్ధికి కొద్ది రోజులుగా రైల్వే శాఖ ప్రయివేట్ నెట్‌వర్క్ ఆపరేటర్లతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రైల్వే భూములలో ప్రయివేట్ టెలికం కంపెనీలు టవర్లను ఏర్పాటు చేసేందుకు అనుమతించడంతో వ్యయాలు తగ్గనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా సామర్థ్య మెరుగుకు ఊతం లభించడంతోపాటు, అత్యుత్తమ గ్రిడ్ ప్రణాళికలకు వీలున్నట్లు తెలియజేశాయి. రైల్వేలకు ఆయా భూములు అవసరమైనప్పుడు రెండు నెలల నోటీసు ద్వారా తిరిగి సొంతం చేసుకునే నిబంధనలు జత చేసినట్లు తెలుస్తోంది. కాగా.. 5జీ టవర్ల ఏర్పాటుకు మొబైల్ సేవల దిగ్గజాలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ భూముల కోసం అన్వేషిస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ తాజా నిర్ణయాలు పరిశ్రమకు బూస్ట్‌నివ్వనున్నట్లు పేర్కొన్నాయి. దీంతో స్థానిక నెట్‌వర్క్‌లకు మరింత బలిమి చేకూరే వీలుంది. ప్రధానంగా పట్టణాలు, గ్రామీణ దూర ప్రాంతాల రైల్వే స్థలాలలో టవర్ల ఏర్పాటు కంపెనీలకు లబ్ధిని చేకూర్చగలదని పరిశ్రమ నిపుణులు వివరించారు. తద్వారా టెలికం మౌలిక సదుపాయాల ఏర్పాటులో మరిన్ని ప్రణాళికలకు తెరలేస్తుందన్నారు. ఇది టెలికం పరిశ్రమ నుంచి చాలా కాలంగా వినిపిస్తున్న డిమాండ్లకు పరిష్కారాన్ని అందించనున్నట్లు అభిప్రాయపడ్డారు. అయితే టవర్లను వాణిజ్యపరంగా వినియోగించుకోవడం, రైల్వేకు తిరిగివ్వడం వంటి కొన్ని అంశాలలో సమస్యలను పరిష్కరించవలసి ఉన్నట్లు తెలియజేశారు.

డేటా సెంటర్లలో పెట్టుబడులకు విఘాతం

డేటా బిల్లు నిబంధనలపై ఐటీఐ అభిప్రాయం

న్యూఢిల్లీ: ప్రతిపాదిత డిజిటల్ వ్యక్తిగత డేటా భద్రత బిల్లులోని (డీపీడీపీ) నిబంధనలతో భారత్‌లో డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టడం, డేటా ప్రాసెసింగ్ కార్యకలాపాలు సాగించడం కష్టతరమవుతుందని అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థల పరిశ్రమ ఐటీఐ అభిప్రాయపడింది. ప్రభుత్వానికి గణనీయంగా అధికారాలు, మినహాయింపులు లభించే విధంగా ఇందులో ప్రతిపాదనలు ఉండటమే దీనికి కారణమని పేర్కొంది.



డీపీడీపీ 2022 ముసాయిదాపై జనవరి 2లోగా తమ అభిప్రాయాలు తెలపాల్సిందిగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (ఎంఈఐటీవై) పరిశ్రమ వర్గాలను కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐటీఐ తన అభిప్రాయాలు ప్రభుత్వానికి తెలియజేసింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ట్విటర్, యాపిల్ వంటి పలు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఐటీఐలో సభ్య సంస్థలుగా ఉన్నాయి. డీపీడీపీ భారత విస్తృత డిజిటల్ వ్యవస్థకు మూలస్తంభంగా ఉండనుంది.

భవిత

జాబ్ పాయింట్

టీఎస్‌పీఎస్సీలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 581
- **పోస్టుల వివరాలు:** గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో అధికారులు గ్రేడ్1-5,గ్రేడ్2-106, ఎస్సీ సంక్షేమ వసతి గృహ అధికారులు గ్రేడ్2(మహిళ)-70,గ్రేడ్2(పురుషులు)-228, బీసీ సంక్షేమ వసతి గృహ అధికారులు గ్రేడ్2(ప్రీ మెట్రిక్ బాయ్స్ హాస్టల్/పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్ /ప్రీ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్/పోస్ట్-మెట్రిక్ గర్ల్స్ హాస్టల్)-140,దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖలో వార్డెన్ గ్రేడ్1-5,వార్డెన్ గ్రేడ్2-03,దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమశాఖలో మాట్రన్ గ్రేడ్1-3,మాట్రన్ గ్రేడ్2-2, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-చిన్నారుల సంరక్షణ గృహాల్లో లేడీ సూపరింటెండెంట్లు-19.
- **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ, బీఈడీ, బీఈడీ /డీఈడీ(విజువల్ హ్యాండిక్యాప్డ్ /హియరింగ్ హ్యాండిక్యాప్డ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1,వార్డెన్ గ్రేడ్-1,మాట్రన్ గ్రేడ్-1 పోస్టులకు రూ.38,890-రూ.1,12,510, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2, వార్డెన్ గ్రేడ్-2, మాట్రన్ గ్రేడ్-2, లేడీ సూపరింటెండెంట్ పోస్టులకు రూ.35,720-రూ.1,04,430 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** రాతపరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. పేపర్-1లో జనరల్ స్టడీస్, పేపర్-2లో ఎడ్యుకేషన్/స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో ప్రశ్నలుంటాయి. పేపర్-1లో 150 ప్రశ్నలు, పేపర్-2లో 150 ప్రశ్నలు, మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.01.2023.
- **దరఖాస్తులకు చివరితేది:** 27.01.2023.
- **పరీక్ష తేది:** ఆగస్ట్-2023.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tspsc.gov.in

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్)-2022

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా అర్హత సాధించేందుకు తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్) నిర్వహిస్తోంది.

- **సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్,కామర్స్, కంప్యూటర్ సైన్స్-అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఇన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.
- **అర్హత:** కనీసం 55% మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** గరిష్ట వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు-100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు -200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- **పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, మెదక్, వైజాగ్, నల్గొండ, రంగారెడ్డి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.12.2022
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.01.2023
- **పరీక్ష తేది:** మార్చి, 2023.
- **వెబ్‌సైట్:** www.telanganaset.org

డీఎంహెచ్‌వో, చిత్తూరు జిల్లాలో 53 పోస్టులు

చిత్తూరు జిల్లాలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 53
- **పోస్టుల వివరాలు:** స్టాఫ్ నర్స్-23, ల్యాబ్ టెక్నీషియన్-02, అటెండర్ కమ్ క్లీనర్-01, కుక్ కమ్ కేర్ టేకర్-01, పీడియాట్రీషియన్-04, సెక్యూరిటీ గార్డ్-05, సపోర్టింగ్ స్టాఫ్-03, మెడికల్ ఆఫీసర్-14.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఐదో తరగతి, పదో తరగతి, డిప్లొమా(జీఎన్ఎం), బీఎస్సీ(ఎంఎల్‌టీ), పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చిత్తూరు జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.12.2022
- **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

వాయుసేనలో.. ఆఫీసర్ కొలువు

భారత రక్షణ రంగంలో ఉన్నత స్థాయి కొలువులను కోరుకునే వారికి ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్టు(ఏఎఫ్‌క్యాట్) ప్రకటన వచ్చేసింది. దీనిద్వారా భారత వైమానిక దళానికి సంబంధించిన ఫ్లయింగ్, గ్రౌండ్‌డ్యూటీ(టెక్నికల్, నాన్ టెక్నికల్) విభాగాల్లో ఉన్నతమైన కొలువులను సంపాదించవచ్చు. ఏడాదికి రెండుసార్లు ఏఎఫ్‌క్యాట్‌ను నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారు ఉన్నత స్థాయి ఉద్యోగంతో పాటు కొలువుకు తగ్గ వేతనాలు, సౌకర్యాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందుకోవచ్చు. ఏఎఫ్‌క్యాట్‌కు పురుషులతోపాటు మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్-2023 వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర సమగ్ర సమాచారం..

ఏఎఫ్‌క్యాట్ 2023



» 258 పోస్టులకు ప్రకటన విడుదల
» ఎంపికైతే శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్

ఏఎఫ్‌క్యాట్ ద్వారా గెజిటెడ్ ఆఫీసర్స్ హోదా కలిగిన ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) విభాగాల్లో రెండు రకాల పోస్టులను భర్తీ చేస్తారు. ఇందులో ఒకటి పీసీ(పర్మనెంట్ కమిషన్), రెండోది షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పరిధిలోకి వస్తాయి. పీసీ విభాగంలో ఎంపికైన వారు పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చు. ఎస్ఎస్‌సీ అభ్యర్థులు మాత్రం గరిష్ఠంగా 14ఏళ్ల పాటు కొలువులో కొనసాగి పదవి నుంచి వైదొలుగుతారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 258
- బ్రాంచీల వారీగా ఖాళీలు: ఫ్లయింగ్: 10(పురుషులు 05, మహిళలు-05); గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్):130(పురుషులు-117,మహిళలు-13).
- ఏరోనాటికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్: గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్)-118 (పురుషులు-103, మహిళలు-15); బ్రాంచ్: వెపన్ సిస్టమ్, అడ్మినిస్ట్రేషన్, ఎల్‌జీఎస్, అకౌంట్స్, ఎడ్యుకేషన్, మెటియోరాలజీ.

అర్హతలు

- ఫ్లయింగ్ బ్రాంచ్: ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన(10+2)లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా చదివినవారై గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసుండాలి. లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించాలి. డిగ్రీ లేదా బీటెక్/బీఈ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు: జనవరి 01,2024 నాటికి 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్ బ్రాంచ్): కనీసం 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా కమ్యూనికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసిన వారు అర్హులు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత(10+2)లో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలి. • **వయసు:** జనవరి 01,2024 నాటికి 20-26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్):** నాన్ టెక్నికల్‌కు సంబంధించి అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్, అకౌంట్స్ విభాగాలున్నాయి. అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ విభాగాలకు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుండాలి. అకౌంట్స్ విభాగానికి సంబంధించి 60 శాతం మార్కులతో బీకాం డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తుకు అర్హులే. **వయసు:** 20-26 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **మెటియోరాలజీ:** ఈ విభాగానికి సంబంధించి మ్యాథ్స్/స్టాటిస్టిక్స్/జాగ్రఫీ/ కంప్యూటర్ అప్లికేషన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అప్లయిడ్ ఫిజిక్స్/ఓషనోగ్రఫీ/ మెటియోరాలజీ/అగ్రికల్చరల్ మెటియోరాలజీ/ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్/ జియోఫిజిక్స్/ఎన్విరాన్‌మెంటల్ బయాలజీలో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. అలాగే డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులను 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

ఎంపిక విధానం

- ఏఎఫ్‌క్యాట్‌కు సంబంధించి రాత పరీక్ష (కామన్ ఎంట్రన్స్ టెస్ట్),ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్,పైలెట్ ఆప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్(పీఏబీటీ),మెడికల్ టెస్టుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నా.. రాత పరీక్ష ఉమ్మడిగానే ఉంటుంది. టెక్నికల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ) అదనంగా రాయాలి. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు స్టేజ్-1, స్టేజ్-2 రెండు పరీక్షలు నిర్వహిస్తారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ అనంతరం కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలక్షన్ సిస్టం(సీపీఎస్ఎస్) పరీక్ష ఉంటుంది. వీటన్నింటిలో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణలోకి తీసుకుంటారు.

ఏఎఫ్ క్యాట్ 300 మార్కులకు

- సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించే ఈ పరీక్ష మొత్తం 300 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున 100 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు ఆప్షన్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. దీనిలో నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు.
- **ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ):** టెక్నికల్ బ్రాంచ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ) అదనంగా రాయాలి. ఇందులో 50 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు.

స్టేజ్ 1, 2 ఇలా

రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని స్టేజ్ 1, 2 పరీక్షలకు పిలుస్తారు. వీటిని ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు(ఏఎఫ్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ విభాగంలో అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని 10 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే 10 పుష్ అప్స్, 3 చిన్ అప్స్ తీయగలగాలి. ఇక స్టేజ్ 1 స్క్రీనింగ్ టెస్టులో చిన్న అసైన్‌మెంట్స్, పజిల్స్ లాంటి వాటి ద్వారా అభ్యర్థి మేధోశక్తిని పరిశీలిస్తారు. ఏదైనా చిత్రాన్ని చూపించి దాన్ని విశ్లేషించమంటారు. ఇందులో అర్హత సాధించిన వారు స్టేజ్-2కి వెళ్తారు. స్టేజ్-2లో సైకాలజిస్టు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఇన్‌డోర్, అవుట్‌డోర్ ఇంటరాక్టివ్ గ్రూపు టెస్టులుంటాయి. వీటిలో మానసిక, శారీరక పనులు మిళితమై ఉంటాయి. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ జరుగుతుంది. ఈ దశలన్నీ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. అందులోనూ అర్హత సాధించిన వారితో మెరిట్ లిస్ట్ తయారు చేసి శిక్షణకు ఎంపిక చేస్తారు.

వేతనాలు

శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్‌గా చెల్లిస్తారు. శిక్షణ అనంతరం విధుల్లో చేరిన వారికి రూ.56.100 మూలవేతనం లభిస్తుంది. అలాగే డీఏ, హెచ్ఆర్ఏ సహా ఇతర అలవెన్సులు ప్రోత్సాహకాలు అదనం. మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్పీ)లో భాగంగా ప్రతి నెలా రూ.15,500 చెల్లిస్తారు. పోస్టింగ్ పొందిన ప్రాంతాన్ని బట్టి రూ.83 వేల నుంచి రూ.96 వేల వరకు నెల వేతనం(సీటీసీ) పొందవచ్చు.

శిక్షణ ఇలా

ఏఎఫ్‌క్యాట్‌కు ఎంపికైన ఫ్లయింగ్, టెక్నికల్ బ్రాంచ్ అభ్యర్థులకు 74 వారాల పాటు.. గ్రౌండ్ డ్యూటీకి ఎంపికైన వారికి 52 వారాల పాటు ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ ఇస్తారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు ఎంపికైన అభ్యర్థులకు దుండిగల్, హకీంపేట్, బీదర్, ఎలహంకల్లో ఆరు నెలలపాటు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. అనంతరం అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ఫైటర్ పైలట్, ట్రాన్స్‌పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్‌గా వేర్వేరుగా ఆయా విభాగాల్లో అంతర్గత శిక్షణ ఇస్తారు.

సిలబస్ అంశాలివే

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే రాత పరీక్షలో జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి.

- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగానికి సంబంధించి హిస్టరీ, సివిక్స్, పాలిటిక్స్, కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంట్, కల్చర్, డిఫెన్స్, స్పోర్ట్స్ సహా వివిధ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **వెర్బల్ ఎబిలిటీ:** ఈ విభాగానికి సంబంధించి కాంప్రహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్, సెంటెన్స్ కంప్లీషన్, సినానిమ్స్, యాంటనిమ్స్, వొకాబ్యులరీ, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ నుంచి ప్రశ్నలుంటాయి.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** ఈ విభాగంలో ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. మిగిలిన విభాగాల్లోని ప్రశ్నలు మాత్రం డిగ్రీ స్థాయిలో అడుగుతారు. ఇందులో ముఖ్యంగా డెసిమల్ ఫ్రాక్షన్, టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, పర్సెంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్, సింపుల్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్ (ట్రెయిన్స్/బోట్స్ అండ్ స్ట్రీమ్స్).
- **రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్:** వెర్బల్ స్కిల్స్, స్పేషియల్ ఎబిలిటీ(మెంటల్ ఎబిలిటీ) నుంచి ప్రశ్నలు వస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు

హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** డిసెంబర్ 30, 2022
- **వెబ్‌సైట్ :** https://afcat.cdac.in/AFCAT


కర్నూలు జిల్లా గోవర్ధనగిరిలో సంక్షేమ పథకాల గురించి వాకబు చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


విజయనగరం జిల్లా ఆర్.తమ్మాపురంలో ప్రజలతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గడప గడపకూ మన ప్రభుత్వం


ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు


పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

క్లుప్తంగా...

‘సంక్షేమ పాలన’కు టీడీపీ ఎంపీటీసీ స్వాగతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల హృదయాలను సైతం కదిలిస్తున్నాయి. ఇందుకు విశాఖజిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురం కాలనీలో మంగళవారం జరిగిన ఘటన అద్దం పడుతోంది. భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కృష్ణాపురం ఎస్సీ కాలనీలో నిర్వహించారు.తమ గడప ముందుకు వచ్చిన ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి హారతి ఇచ్చి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను కొనియాడారు.

–పద్మనాభం(విశాఖజిల్లా)

గవర్నర్లతో రాష్ట్రాలను దెబ్బతీస్తున్నారు

కేంద్రం తీరుపై కేరళ మంత్రి రాజేష్ విమర్శలు

సాక్షి, అమరావతి: బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గవర్నర్లను ఆయుధాలుగా మార్చుకుని రాష్ట్రాలను అన్ని విధాలా దెబ్బతీస్తున్నదని కేరళ ఎక్సైజ్, స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబీ రాజేష్ విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన విజయవాడలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఫెడరల్ వ్యవస్థ మీద, రాష్ట్రాల హక్కుల మీద పెద్ద ఎత్తున దాడికి దిగుతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అంశాలపైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెత్తనం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా ఆర్థికంగా ఇబ్బందులు సృష్టిస్తున్నదన్నారు. కేరళకు చట్ట ప్రకారం రావాల్సిన రూ.30 వేల కోట్లకు కోత పెట్టిందని ఆరోపించారు.సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలవరం కేంద్రం బాధ్యతని, అయినా పట్టనట్లు వ్యవహరిస్తోందని వివరించారు. గిరిజనుల విషయంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శలు చేశారు.

సుగంధ ద్రవ్యాల బోర్డు సభ్యులుగా బాలశౌరి, అరవింద్



సాక్షి, న్యూఢిల్లీ/చిలకలపూడి(మచిలీపట్నం): సుగంధ ద్రవ్యాల బోర్డు సభ్యులుగా వైఎస్సార్ సీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ తెలంగాణ ఎంపీ ధర్మపురి అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరు సభ్యుల ఎన్నిక కోసం ముగ్గురు సభ్యులు నామినేషన్లు దాఖలు చేయగా, చివరికి ఎంపీ హిబి ఎడెన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎంపీలు బాలశౌరి, అరవింద్ ఎన్నికయ్యారు. కాగా, దీనికి సంబంధించిన బులెటిన్‌ను లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ మంగళవారం విడుదల చేశారు.

‘హాత్ సే హాత్’ ఏపీ పరిశీలకుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తెలంగాణ పరిశీలకుడిగా గిరీష్‌చోడాంకర్

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ ఆధ్వర్యంలో జనవరి 26 నుంచి ప్రారంభించనున్న ‘హాత్ సే హాత్’ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ పరిశీలకుడిగా ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. అలాగే తెలంగాణ పరిశీలకుడిగా గోవా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిరీష్‌చోడాంకర్‌ను నియమించారు. మహారాష్ట్ర పరిశీలకుడిగా కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, గోవా పరిశీలకుడిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్, పుదుచ్చేరి పరిశీలకుడిగా మాజీ ఎంపీ వి.హనుమంతరావును నియమించారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ‘హాత్ సే హాత్’ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు నియమితులైన అన్ని రాష్ట్రాల పరిశీలకుల వివరాలను ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు.



రేపు హైవేపై విమానాల ల్యాండింగ్ ట్రయల్ రన్

- బాపట్ల జిల్లా రేణింగవరం-కొరిశపాడు మధ్య 4 కిలోమీటర్ల మేర రన్ వే ఏర్పాటు
- ఉదయం 11 గంటల సమయంలో దిగనున్న కార్గో, ఫైటర్ జెట్ విమానాలు

జే.పంగులూరు: విజయవాడ-ఒంగోలు మధ్యనున్న జాతీయ రహదారిపై గురువారం విమానాల ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. అత్యవసర సమయాల్లో విమానాలు దిగేందుకు వీలుగా.. ఇప్పటికే జాతీయ రహదారిపై రెండు ప్రాంతాల్లో రన్‌వేలు నిర్మించారు. వరదలు, భూకంపాలు, ప్రకృతి విపత్తులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు సైతం క్షేమంగా నేలపైకి దిగడానికి వీలుగా రన్‌వేలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 19 చోట్ల అత్యవసర ల్యాండింగ్ కోసం ఏర్పాట్లు చేయగా.. రాష్ట్రంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండ-కలికివాయి, బాపట్ల జిల్లా రేణింగవరం-కొరిశపాడు మధ్య హైవే మీద రన్‌వేలు సిద్ధం చేస్తున్నారు. రేణింగవరం-కొరిశపాడు మధ్య 4 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన రన్‌వేపై గురువారం ఉదయం 11 గంటలకు కార్గో, ఫైటర్ జెట్ విమానాలు దిగనున్నాయి. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైమానిక దళ సిబ్బంది విమానాలు దిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్ సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. రన్‌వే కోసం తారు రోడ్డును నాలుగు కిలోమీటర్ల పరిధిలో 6 మీటర్ల మేర తవ్వి.. నాలుగు లేయర్లుగా సిమెంట్ రోడ్డు వేశారు. డివైడర్లను, చుట్టుపక్కల ఉన్న చెట్లను, విద్యుత్ తీగలను తొలగించారు.

గిరిజనులతో నటి నిత్యామీనన్ ముచ్చట్లు


ప్రముఖ సినీ నటి, హీరోయిన్ నిత్యామీనన్ మంగళవారం కల్కి ట్రస్టుకు చెందిన ఏకం ఆలయాన్ని సందర్శించారు. అనంతరం వరదయ్యపాళెం మండలం కాంబాకం గిరిజనకాలనీలో పర్యటించారు. స్థానికులు, గిరిజన విద్యార్థులతో ముచ్చటించారు. పల్లెటూరి పాటలతో సరదాగా గడిపారు.

–వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా)

మిర్చి అ‘ధర’హో !

గరిష్ట ధర రూ.37,112, మోడల్ ధర రూ.18,009


మార్కెట్‌కు భారీగా వచ్చిన ఎండుమిర్చి

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి ధర పరుగులు తీస్తున్నది. మంగళవారం కర్నూలు మార్కెట్‌కు 207 మంది రైతులు 295 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.4,119, గరిష్ట ధర రూ.37,112, మోడల్ ధర రూ.18,009గా నమోదు అయ్యింది. కర్నూలు మార్కెట్ చరిత్రలోనే రికార్డు స్థాయిలో రూ.37,112 ధర లభించడం విశేషం. ఈ నెల 24న మార్కెట్‌లో గరిష్ట ధర రూ.33,102 లభించింది. మూడు రోజుల్లోనే క్వింటాలుపై రూ.4,010 పెరగడం విశేషం. జిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.25 లక్షల ఎకరాల్లో ఎండుమిర్చి సాగయింది. కర్నూలు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ నెల 24న మార్కెట్‌కు 135 క్వింటాళ్లు మాత్రమే రాగా.. ఈ నెల 27న 295 క్వింటాళ్ల మిర్చి వచ్చింది.

మాకిదేం ఖర్మ!

- ప్రభుత్వం అన్నీ ఇస్తుంటే.. ఇవ్వలేదని ఎలా చెప్తాం?
- టీడీపీ ‘ఇదేం ఖర్మ’కు రాలేమని తేల్చిచెప్పిన తిరుపతి ప్రజలు


పది మంది కూడా లేని ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి మంగళం: టీడీపీ నేతలకు మంగళవారం తిరుపతి ప్రజలు షాక్ ఇచ్చారు. తమ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను కాదని.. టీడీపీ కార్యక్రమాలకు ఎలా వస్తామంటూ నిలదీశారు. మాకంత ఖర్మ పట్టలేదు.. వెళ్లిపోవాలంటూ టీడీపీ నాయకుల ముఖం మీదే చెప్పి పంపించేశారు. వివరాలు.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం ఒకటో డివిజన్ రెడ్డిగుంటలో ‘ఇదేం ఖర్మ’ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి హాజరు కావాలని పిలిచేందుకు టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లారు. కానీ స్థానికుల నుంచి స్పందన కరువవ్వడంతో ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చేరవేశారు. అనంతరం మరో బ్యాచ్ వెళ్లి ఓ పది మందిని బలవంతంగా కార్యక్రమానికి తీసుకొచ్చారు. వారితో సుగుణమ్మ మాట్లాడుతూ.. ‘ఏమమ్మా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక చెప్పిన హామీలేమీ అమలు చేయలేదు కదా?’ అని ప్రశ్నించారు. వెంటనే అక్కడున్న రాములమ్మ, జయలక్ష్మమ్మ అనే మహిళలు జోక్యం చేసుకొని.. ‘ఎందుకు చెయ్యలేదు. మాకు అన్నీ ఇస్తున్నారు. అన్నీ ఇస్తుంటే.. ఇవ్వలేదని ఎలా చెప్పేది. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అడగకుండానే అన్నీ చేస్తున్నారు’ అని సమాధానం చెప్పడంతో సుగుణమ్మ షాక్‌కు గురయ్యారు. మరోవైపు స్థానిక టీడీపీ నాయకులు కూడా రాకపోవడంతో.. సమావేశాన్ని కొనసాగించలేక.. కొద్దిసేపు కూర్చొని తమతో తెచ్చుకున్న శాలువాలతో ఒకరికొకరు సన్మానం చేసుకొని.. ఫొటోలు దిగి వెళ్లిపోయారు.

సంక్రాంతికి 94 ప్రత్యేక రైళ్లు

సాక్షి, అమరావతి/రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగ రద్దీకి అనుగుణంగా జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు 94 ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాలకు కూడా ఈ రైళ్లను నడపనుంది. . మచిలీపట్నం-కర్నూలు సిటీ (07067) ప్రత్యేక రైలు జనవరి 3, 5, 7, 10, 12, 14, 17 తేదీల్లో, కర్నూలు-మచిలీపట్నం (07068) రైలు జనవరి 4, 6, 8, 11, 13, 15, 18 తేదీల్లో, కాకినాడ టౌన్-లింగంపల్లి (07445) రైలు 2, 4, 6, 9, 11, 13, 16, 18 తేదీల్లో, లింగంపల్లి-కాకినాడ టౌన్(07446) రైలు 3, 5, 7, 10, 12, 14, 17, 19 తేదీల్లో, మచిలీపట్నం-సికింద్రాబాద్ (07185) రైలు 1, 8, 15, సికింద్రాబాద్-మచిలీపట్నం (07186) రైలు తిరుగు ప్రయాణంలోనూ 1, 8, 15 తేదీల్లో, మచిలీపట్నం-తిరుపతి (07095) జనవరి 1, 2, 4, 6, 8, 9, 11, 13, 15, 16 తేదీల్లో, తిరుపతి-మచిలీపట్నం (07096) 2, 3, 5, 7, 9, 10, 12, 14, 16, 17 తేదీల్లో నడుస్తాయి. విజయవాడ-నాగర్‌సోల్ (07698) జనవరి 6, 13 తేదీల్లో, నాగర్‌సోల్-విజయవాడ (07699) 7, 14 తేదీల్లో, పూణే-తిరుపతి (07607) 2, 9, 16 తేదీల్లో, తిరుపతి-పూణే (07608) 3, 10, 17 తేదీల్లో, తిరుపతి-అంకోలా (07605) 6, 13 తేదీల్లో, అంకోలా-తిరుపతి (07606) 8, 15 తేదీల్లో, సికింద్రాబాద్-కటక్ (07165) జనవరి 6, 13 తేదీల్లో, కటక్-సికింద్రాబద్ (07166) 7, 14 తేదీల్లో, నాందేడ్-బ్రహ్మపూర్ (07431) 7, 14 తేదీల్లో, బ్రహ్మపూర్-నాందేడ్ (07432) 8, 15 తేదీల్లో నడుస్తాయి. నాందేడ్-యశ్వంత్‌పూర్ (07093) 2, 9 తేదీల్లో, యశ్వంత్‌పూర్-నాందేడ్ (07094) 3, 10 తేదీల్లో, హైదరాబాద్-యశ్వంత్‌పూర్ (07265) 3, 10, 17 తేదీల్లో, యశ్వంత్‌పూర్-హైదరాబాద్ (07266) 4, 11, 18 తేదీల్లో, సికింద్రాబాద్-యశ్వంత్‌పూర్ (07233) రైలు 5, 12, 19 తేదీల్లో, యశ్వంత్‌పూర్-సికింద్రాబాద్ (07234) ప్రత్యేక రైళ్లు 6, 13, 20 తేదీల్లో నడుస్తాయి.

దళిత మహిళపై చెయ్యెత్తిన పరిటాల సునీత

రాప్తాడు: టీడీపీ నాయకురాలు, మాజీమంత్రి పరిటాల సునీత దళిత మహిళపై దౌర్జన్యం చేశారు. ‘ఏయ్..’ అంటూ చెయ్యెత్తి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం మరూరు గ్రామంలో సోమవారం పరిటాల సునీత పర్యటించారు. ఈ సందర్భంగా దళిత మహిళ, ఆశా కార్యకర్త అయిన ఆదిలక్ష్మిని కొట్టేందుకు ఆమె యత్నించారు. పరిటాల సునీత అనుచరుడైన రైటర్ కదిరప్ప భూముల విషయంలో తమను మోసం చేశాడంటూ కదిరప్ప సొంత అన్న నారాయణ కోడలైన ఆదిలక్ష్మి నిలదీసింది. దీన్ని జీర్ణించుకోలేని పరిటాల సునీత తన వెంట ఉండే వ్యక్తి గురించి అలా మాట్లాడతావా అంటూ ఆదిలక్ష్మికి వేలు చూపుతూ బెదిరించడమే కాక.. ‘ఏయ్’ అంటూ గద్దించారు. ఆదిలక్ష్మి కూడా ఏమాత్రమూ తగ్గకుండా అంతే స్థాయిలో ఘాటుగా బదులిచ్చింది. ఇలాంటి మోసగాళ్లను పక్కన పెట్టుకుని తిరిగితే నీ పార్టీ నాశనం అయిపోతుందంటూ మండిపడింది.

28 నుంచి లాసెట్ అడ్మిషన్ల ప్రక్రియ

30 వరకు వెబ్ ఆప్షన్లు • 2న సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ లాసెట్-2022- 23 అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి వై.నజీర్ అహ్మద్ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28 నుంచి 30 వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలి. 31న ఆప్షన్లను సవరించుకోవచ్చు. జనవరి 2న సీట్లు కేటాయిస్తారు. సీట్లు లభించినవారు అదే నెల 3 నుంచి 7లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. జనవరి 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.